ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 25.11.2026 | సంపుటి:13 సంచిక:125 | పేజీలు:12 వెల:రూ.4/-

RNI NO.TELTEL / 2013 /50370

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్





ద్విశతక వైభవం

52 బంతుల్లోనే సూర్యవంశీ డబుల్ సెంచరీ.. చిత్తు చిత్తుగా ఓడిన యూఏఈ ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ వన్డే టోర్నీలో ఇండియా ఎ సెమిస్‌కు చేరింది. యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో ఇండియా-ఎ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 250 పరుగుల లక్ష్యాన్ని 14.2 ఓవర్లలోనే భారత్-ఎ అలవోకగా ఛేదించింది. వైభవ్ సూర్యవంశీ (204; 53 బంతుల్లో 28 సిక్స్‌లు, 7 ఫోర్లు) విధ్వంసం సృష్టించాడు. యూఏఈ బౌలర్లకు పట్టపగలే చుక్కలు చూపించాడు. లిస్ట్ ఎ క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ, 150, డబుల్ సెంచరీ చేసిన బ్యాటర్‌గా రికార్డుల్లోకెక్కాడు.
- దోహా(జనంసాక్షి):

మూసీ పునరుజ్జీవ పనుల్లో వేగం పెంచండి

క్యూర్, ప్యూర్ పరిధిలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- నిర్దేశిత గడువులోగా పనులు పూర్తికావాలి
- సరైన ప్రణాళికలతో పీఆర్టీఎస్ చేపట్టాలి
- మున్సిపల్ పట్టణాభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమావేశం



హైదరాబాద్(జనంసాక్షి):మూసీ పునరుజ్జీవ పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్ల పురోగతి, పట్టణాభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష చేశారు. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోందని మొదటి దశ పనులు జనవరిలో ప్రారంభించనున్నట్లు అధికారులు సీఎం రేవంత్‌రెడ్డికి తెలిపారు. ఫేజ్-1లో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.20 కిలోమీటర్ల ప్రాంతాన్ని జోన్-1 ఏగా, ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్ల ప్రాంతాన్ని జోన్-1 బీగా విభజించి పనులు చేపట్టనున్నట్లు అధికారులు వివరించారు. పాతబస్తీలోని మిరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీశారు. మిరాలం చెరువు అభివృద్ధి పనులు 2028 జనవరి నాటికి పూర్తవుతాయని అధికారులు చెప్పారు. మిరాలం చెరువులో పేరుకుపోయిన పూడికను తొలగించాలని అధికారులను సీఎం ఆదేశించారు. రేడియల్ రోడ్ల నిర్మాణం, భూసేకరణ పురోగతిని సీఎంకు అధికారులు వివరించారు. రేడియల్ రోడ్ల నిర్మాణంలో వేగం పెంచాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు. గండిపేట వద్ద నిర్మిస్తున్న ఆధునిక గోశాల పనుల పురోగతి పనులను ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. వచ్చే ఏడాది మార్చి నాటికి పనులు పూర్తి

మిగతా 2లో..

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రూ.10 వేలకోట్లు

భారీ కార్యాచరణతో రాష్ట్ర సర్కారు కసరత్తు

- ప్రతికూల వాతావరణ సవాళ్లకు శాస్త్రీయ, ఆచరణాత్మక పరిష్కారాలే లక్ష్యం
- కరువు తట్టుకునే నమూనాలు, నీటి భద్రత, సుస్థిర వ్యవసాయంపై ప్రధానంగా చర్చ
- ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన విధానాలను ప్రదర్శనల్లో పొందుపరచాలి
- క్లైమేట్ కాంక్లేవ్ ఏర్పాట్లపై అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సమీక్ష



హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ కేవలం సిద్ధాంతపరమైన చర్చలకే పరిమితం కాకుండా, వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్లకు ఆచరణాత్మకంగా అమలు చేయగల, శాస్త్రీయంగా నిరూపితమైన పరిష్కారాలను సూచించే వేదికగా నిలవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.కరువును తట్టుకునే వ్యవస్థల నిర్మాణం, నీటి భద్రత, సుస్థిర వ్యవసాయం, ఎల్‌నినో పరిస్థితుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ముందస్తు చర్యలపై కాంక్లేవ్‌లో లోతైన చర్చ జరగాలని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణ రైజింగ్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో భాగంగా నిర్వహిస్తున్న క్లైమేట్ కాంక్లేవ్ ఏర్పాట్లపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హైదరాబాద్‌లో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కార్యక్రమ రూపకల్పన, నిపుణుల భాగస్వామ్యం, పెట్టుబడిదారులతో సంప్రదింపులు, వివిధ అంశాలపై రూపొందిస్తున్న ప్రదర్శనలు, ఆడియో విజువల్ కంటెంట్‌పై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన వాతావరణ అనుకూల నమూనాలతోపాటు ఇక్రిశాట్ గుర్తించిన ఉత్తమ విధానాలను ప్రదర్శనలు, ఆడియో?విజువల్ కార్యక్రమాల్లో సమగ్రంగా పొందుపరచాలని మంత్రి సూచించారు. రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, టీజీ ట్రాన్స్‌కో

మిగతా 2లో..

షరతులకు అంగీకరించే వరకు అమెరికాతో

చర్చల్లేవ్

పునరుద్ఘాటించిన ఇరాన్

2 లో..

వలసదారులకూ శాశ్వత నివాసం

డెమోక్రాట్ల కొత్త ప్రతిపాదన

నీటిపై సర్కారు శ్వేతపత్రం విడుదల చేయాలి

- ఒక్క రిజర్వాయరైనా కట్టారా
- లిఫ్టులు ఎంతకాలం నడిపారు?
- హరీశ్ రావు డిమాండ్



హైదరాబాద్(జనంసాక్షి):
సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో కొత్తగా ఒక్క రిజర్వాయర్ అయినా కట్టారా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లిఫ్టులు ఎంత కాలం నడిపారో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రేవంత్‌రెడ్డి చెప్పిన జీవో నంబర్ తప్పు అని ఆరోపించారు. దీంతో పాటు ఒంగోలు బ్రాంచ్ కెనాల్ అని ఉంటే.. నాగార్జున సాగర్ కెనాల్ అని చెప్పారన్నారు. "తెలంగాణ హక్కుల కోసం పోరాడిందే బీఆర్ఎస్ పార్టీ. ప్రాణాలను పణంగాపెట్టి కేసీఆర్ తెలంగాణను తీసుకురావడం తప్పా? కృష్ణా జలాల కోసం సెక్షన్ 3 తేవడం తప్పా? టీఆర్ఎస్ పుట్టకముందు అసలు నీళ్ల గురించి ఎవరైనా మాట్లాడారా? తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పోరాడుతున్నప్పుడు రేవంత్‌రెడ్డి ఎప్పుడైనా మాట్లాడారా? ఉమ్మడి ఏపీలో సాగర్ కుడి కాల్వకు ఒక నీతి, ఎడమ కాల్వకు మరో నీతి ఉండేది. టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటుకు ముందు జూరాలకు ఎక్కువగా ఆయకట్టే లేదు. మెదక్ జిల్లాలో ఆయకట్టు వచ్చింది అంటే

మిగతా 2లో..

రాజీవ్‌కు ఉద్దేశపూర్వకంగానే

భద్రత తొలగించారు

- ప్రాణహాని జరగాలనే కుట్రపన్నారు :సోనియాగాంధీ
- పుస్తకంలో 500 పేజీలు ఉన్నా అమ్మ చెప్పాల్సిన విషయాలు ఇంకా చాలా ఉన్నాయి:రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ(జనంసాక్షి):తన భర్త, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ప్రాణాలకు హాని తలపెట్టేందుకు.. గతంలో ఉద్దేశపూర్వకంగానే సెక్యూరిటీని తొలగించారని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ ఆరోపించారు. ఆ సమయంలో తన కుటుంబం ఎంతో ఆందోళన చెందిందని పేర్కొన్నారు. నాటి పరిస్థితులను గుర్తు చేసుకుంటూ రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో జరిపిన సంభాషణను ఆమె 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు.'రాజీవ్ గాంధీ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు వివిధ రాష్ట్రాలలో పర్యటనలకు వెళ్లేవారు. అటువంటి సమయంలో కొందరు కుట్రపూరితంగా ఆయనపై దాడులకు పాల్పడేవారు. అయినప్పటికీ ఆ సమయంలో ఉద్దేశపూర్వకంగానే భద్రతను తగ్గించారు. 1991 మార్చిలో రాజీవ్ ఓపెన్ జీపులో బిహార్‌లో ప్రయాణిస్తుండగా అల్లరి మూకలు ఆయనపై రాళ్లు రువ్వాయి. ఆయన పర్యటనను అడ్డుకోవడానికి కొందరు నిరసనలు చేపట్టారు. అది చాలా భయంకరమైన సందర్భం. ఆ పర్యటనకు తన తండ్రితో పాటు వెళ్లిన రాహుల్ రాళ్ల దాడిని, నిరసనలను ప్రత్యక్షంగా చూశాడు. ఇంటికి రాగానే నా దగ్గరకు వచ్చి ఏడ్చాడు. నాన్న భద్రత కోసం మనం ఏమీ చేయకపోతే.. ఆయన ప్రాణాలు కోల్పోయే

మిగతా 2లో..

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు శుభవార్త

విద్యాసంస్థల్లో పదో తరగతి వరకు ఉచిత విద్య

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సంక్షేమం దిశగా సింగరేణి యాజమాన్యం మరో కీలక నిర్ణయం తీసుకుంది. సంస్థ పరిధిలోని 12 ఏరియాల్లో పనిచేస్తున్న సుమారు 30 వేల మంది కాంట్రాక్టు కార్మికుల పిల్లలకు సింగరేణి పాఠశాలల్లో ఉచిత విద్య అందించాలని నిర్ణయించింది. ఇటీవల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన కోల్ బెల్ట్ ప్రాంత ప్రజా ప్రతినిధుల సమావేశంలో కాంట్రాక్టు కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా ఉచిత విద్యను ప్రవేశపెట్టడం విశేషం. ప్రస్తుతం సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలోని 9 పాఠశాలల్లో చదువుతున్న 400 మందికి పైగా పిల్లలకి తక్షణమే ఇది వర్తించనుంది. వచ్చే సంవత్సరం నుంచి వీరితో పాటు కొత్తగా చేరబోయే కాంట్రాక్టు కార్మికుల పిల్లలకి కూడా ఈ సౌకర్యం వర్తించనుంది. ఈ మేరకు సింగరేణి కాలరీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ జనరల్ మేనేజర్ అన్ని ఏరియాలకు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిర్ణయం ప్రకారం సింగరేణి ప్రాంతాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల పిల్లలకు ఆయా ప్రాంతాల్లోని సింగరేణి పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు కల్పించడంతో పాటు పదో

మిగతా 2లో..



ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడంతోనే

యువత పెడదోవ

డ్రగ్స్ బారిన పడుతున్నారు. : కిషన్‌రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి):దేశంలో విచ్చలవిడిగా పెరిగిపోతున్న డ్రగ్స్ వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కవాడిగూడలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "దేశానికి

మిగతా 2లో..



డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌కు షేక్ హసీనా

ఆ దేశ ప్రధాని షేక్ హసీనా కీలక నిర్ణయం

న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత్‌లో రెండేళ్లకుపైగా ఆశ్రయం పొందుతోన్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా కీలక నిర్ణయం తీసుకున్నారు. డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్తానని ప్రకటించారు. ఏటా డిసెంబర్ 16న

మిగతా 2లో..

అక్రమ నిర్మాణాల్లో మున్సిపల్ అధికారుల

లంచావతారం

కొనుగోలు దారులకు మహాశాపం



హైదరాబాద్(జనంసాక్షి):దేశవ్యాప్తంగా భవన నిర్మాణ నిబంధనలు తీవ్రంగా ఉల్లంఘనకు గురవుతున్నాయని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అక్రమార్కులతో మున్సిపల్ అధికారులు కుమ్మక్కై సహకారం అందించడంపై మండిపడింది. పట్టణ ప్రణాళిక విభాగం ముందస్తు అనుమతులను తమ కళ్ల ముందే అతిక్రమిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారని జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు, ఒక్క కేసుకు పరిమితమైన మాట లు కావు. అవి దేశంలోని ప్రతి నగరం, ప్రతి పట్టణం ఎదుర్కొంటున్న దుస్థితికి అద్దం పట్టే న్యాయస్థానం తీర్పు లాంటి హెచ్చరిక.అనుమతి ఒక అంతస్తుకు ఇస్తే నాలుగు అంతస్తులు లేస్తున్నాయి. సెట్‌బ్యాక్ వదలాల్సిన చోట గోదలు లేస్తున్నాయి. పార్కింగ్ కోసం కేటాయించాల్సిన సెల్లార్లు దుకాణాలుగా, గోదాములుగా మారుతున్నాయి. ఇవన్నీ రాత్రికి రాత్రే జరగవు. నెలల తరబడి పునాది నుంచి శ్లాబు వరకు ప్రతి దశలోనూ టౌన్ ప్లానింగ్ సిబ్బంది తనిఖీకి వస్తూనే ఉంటారు. వారికి కనిపించని అక్రమం లేదు. కనిపించినా కదలని చేతులు ఉన్నాయి.

మిగతా 2లో..



రహదారులు రక్తసిక్తం

ఏపీ,తెలంగాణలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల్లో పలువురి మృతి మరికొందరికి గాయాలు

2 లో..

మృత్యుభూమి

ఉక్రెయిన్‌తో యుద్ధంలో 4.9 లక్షల మంది సైనికులను కోల్పోయిన రష్యా!

భాజపాతో అకాలీదళ్ చేతులు

ఆరేళ్ల తర్వాత మళ్లీ ఎన్డీయే గూటికి..





గూగుల్‌లో భారీ లేఆఫ్‌లు..

న్యూఢిల్లీ(జనంసాక్షి):టెక్ దిగ్గజం గూగుల్ భారత్‌లో భారీగా ఉద్యోగులను తొలగిస్తోందంటూ ఇటీవల వచ్చిన వార్తలపై సంస్థ స్పందించింది. లేఆఫ్‌ల ప్రచారాన్ని ఖండించింది. గత వారం గూగుల్ క్లౌడ్ ఇండియా విభాగంలో సంస్థాగత మార్పులు చేపట్టినట్లు వెల్లడించింది. ఇందులో భాగంగా సుమారు 30 రోల్స్ తొలగించినట్లు

మిగతా 2లో..

సెప్టిక్ ట్యాంక్‌లో పడి ముగ్గురు కార్మికులు మృతి

- మేడ్చల్ జిల్లా బాచుపల్లిలో విషాదం
- కుటుంబికులకు సమాచారం ఇవ్వకుండానే మృతదేహాలను తరలించారని ఆందోళన



2 లో..

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
25.11.2026

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు

రూ.10 వేల కోట్లు

సీఎండీ డి. కృష్ణభాస్కర్‌తోపాటు పలువురు ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.కాంక్లేవ్‌లో ముఖ్యంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రూపొందిస్తున్న ఐదు నెలల ఎల్‌నినో సన్నద్ధత కార్యక్రమాన్ని ప్రదర్శించనున్నారు. సుమారు రూ.10 వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ బృహత్తర కార్యక్రమంలో సంక్రాంతి తరువాత ప్రతి నెలా దాదాపు రూ.2 వేల కోట్ల విలువైన పనులను అమలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది.నీటిపారుదల, పంచాయతీరాజ్ శాఖలు సంయుక్తంగా అమలు చేయనున్న ఈ కార్యక్రమంలో చెరువులు, వాగులు, కాలువల పునరుద్ధరణ, భూగర్భ జలాల రీఛార్జ్, వర్షపు నీటి సంరక్షణ, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల పరిరక్షణకు సంబంధించిన పనులను విస్తృతంగా చేపట్టనున్నారు. వ్యవసాయ పనులు తగ్గే కాలంలో గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పించడం కూడా ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యాల్లో ఒకటని మంత్రి వివరించారు.సంభావ్య కరువు పరిస్థితుల్లోనూ ప్రజలకు తాగునీరు, ఆహార భద్రత కల్పించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కాంక్లేవ్ ప్రదర్శనల ద్వారా వివరించాలని అధికారులను ఆదేశించారు. వచ్చే వర్షాకాలం వరకు జలాశయాల్లోని నీటి నిల్వలను సంరక్షించేందుకు అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా ప్రత్యామ్నాయ పంటల సాగువైపు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.ప్రజా పంపిణీ వ్యవస్థ అవసరాలకు దాదాపు ఏడాదిపాటు సరిపడే బియ్యం నిల్వలు ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్నాయని మంత్రి వెల్లడించారు. కరువు కారణంగా పంట దిగుబడులు తగ్గినప్పటికీ ప్రజల ఆహార భద్రతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈ నిల్వలు కీలక రక్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు.పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విస్తరణ, శుద్ధి చేసిన మురుగునీటిని పరిశ్రమల్లో తిరిగి వినియోగించడం, తెలంగాణను నెట్‌జీరో లక్ష్యాల దిశగా తీసుకెళ్లే చర్యలపైనా సమీక్షలో చర్చించారు. వాతావరణ మార్పులను తట్టుకునే సుస్థిర అభివృద్ధిలో తెలంగాణను దేశానికి మార్గదర్శకంగా నిలపాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని ఈ కాంక్లేవ్ మరింత బలోపేతం చేయనుంది.

రహదారులు రక్తసిక్తం

ఆగిఉన్న ట్యాంకర్‌ను ఢీకొట్టిన కారు..
విజయనగరం జిల్లాలో ఐదుగురి దుర్మరణం

భోగాపురం(జనంసాక్షి):

విజయనగరం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగిం ది. భోగాపురం హైవేపై సుంద రపేట సమీపంలో ఆగిఉన్న ట్యాంకర్‌ను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయా ణిస్తున్న ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. నలుగురు ఘటనాస్థలంలో చనిపోగా.. మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. శ్రీకాకుళం జిల్లా శ్రీముఖలింగం దర్శనానికి వెళ్లి కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతులను కొండా సూరిబాబుతో పాటు దంపతులు బొర్రా సతీశ్-శ్రుతి, వాకలపూడి శ్రీను-కుసుమరంజనిగా గుర్తించారు. వీరిలో వాకలపూడి శ్రీను దంపతులు తగరపువలస.. మిగిలినవారు భీమిలికి చెందినవారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. .

ఆగి ఉన్న కోళ్లవ్యాన్‌ను ఢీకొన్న కారు.. దంపతుల దుర్మరణం

సంగారెడ్డి: జహీరాబాద్ బైపాస్ రోడ్డులో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. అల్గోల్ చౌరస్తాలో ఆగి ఉన్న కోళ్ల వ్యాన్‌ను వెనకనుంచి కారు ఢీకొట్టింది. ఈ దుర్ఘటనలో దంపతులు దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాలను జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతులను మహారాష్ట్రకు చెందిన వారిగా గుర్తించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాద దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ వార్త చదివారా: గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రోడ్డు ప్రమాదం.. హైదరాబాద్‌కు చెందిన దంపతుల మృతి

రోడ్డు ప్రమాదంలో మాజీ సీఎం కేసీఆర్ అటెండర్ మృతి..

హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నివాసంలో అటెండర్‌గా పనిచేస్తున్న మణికుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం బంధనకల్ వద్ద జరిగిన ప్రమాదంలో మణికుమార్ చనిపోయారు.మణికుమార్ మృతిపట్ల కేసీఆర్, ఆయన సతీమణి శోభ, మాజీ మంత్రి కేటీఆర్, శైలిమ దంపతులు, కుటుంబ సభ్యులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మణి తమ కుటుంబంలో ఒకడిగా కలిసిపోయారని.. ఆయన అకాల మరణం ఎంతగానో కలచివేసిందని చెప్పారు. అతడి కుటుంబానికి అండగా ఉంటామన్నారు. అంత్యక్రియలను దగ్గరుండి నిర్వహించాలని మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, ముస్తాబాద్ మాజీ జడ్పీటీసీ శరత్‌రావుకు కేసీఆర్ సూచించారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రోడ్డు ప్రమాదం..

హైదరాబాద్‌కు చెందిన దంపతుల మృతి

వైరా: ఓ కారు లారీని ఢీకొన్న ప్రమాదంలో దంపతులు అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా వైరా సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎగ్జిట్ వద్ద చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌కు చెందిన కోటా కిశోర్‌రెడ్డి,భార్య లావణ్య, కుమారుడు ప్రణీత్ ఏపీలోని అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి దర్శనానికి వెళ్లారు. అనంతరం హైదరాబాద్‌కు తిరిగివస్తుండగా వైరా సమీపంలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే ఎగ్జిట్ వద్ద వీరి కారు ఆగిఉన్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కిశోర్‌రెడ్డి, లావణ్య అక్కడికక్కడే మృతి చెందగా.. ప్రణీత్‌కు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

మృత్యుభూమి

4.9 లక్షల మంది సైనికులను కోల్పోయిన రష్యా!

మాస్కో(జనంసాక్షి):ఉక్రెయిన్‌పై ఐదేళ్ల క్రితం రష్యా మొదలుపెట్టిన యుద్ధం ఇంకా కొనసాగుతూనే ఉంది. 2022లో దురాక్రమణ ప్రారంభించినప్పటి నుంచి కనీసం 4.9లక్షల మంది రష్యా సైనికులు ప్రాణాలు కోల్పోయినట్లు తెలిసింది. వీరిలో కొన్ని వేల మంది 18 ఏళ్ల వయసువారే ఉండటం కలవరపెట్టే విషయం. మరోవైపు, ఐదేళ్ల కాలంలో కొందరు సైనికులు బలవన్మరణానికి పాల్పడినట్లు తేలింది. రష్యాలో ఇటీవల లీకైన ప్రభుత్వ రికార్డులను విశ్లేషించిన కొన్ని మీడియా సంస్థలు ప్రాణనష్ట అంచనాలను వెల్లడించాయి. దేశంలో జనన, మరణాలకు సంబంధించిన రికార్డులను నమోదు చేసే ఫెడరల్ స్టేట్ స్టాటిస్టిక్స్ సర్వీస్ ఏజెన్సీ డేటా ఇటీవల హ్యాకింగ్‌కు గురైంది. లీకైన డేటాలో జనవరి 2021 నుంచి సెప్టెంబర్ 2026 వరకు నమోదైన లక్షలాది పౌరుల మరణ ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి. వీటిని విశ్లేషించిన స్థానిక మీడియా సంస్థలు.. ఈ ఏడాది సెప్టెంబర్ చివరి నాటికే కనీసం 4.9లక్షల మంది రష్యన్ సైనికులు మరణించినట్లు గుర్తించాయి. మరణాల నమోదులో జాప్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ సంఖ్య 7లక్షల వరకు ఉండే అవకాశం ఉందని అంచనా వేశాయి.ఈ రికార్డులను ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల గణాంకాలతో పోల్చి చూశామని, ఇవన్నీ సరైనవేనని ధ్రువీకరించుకున్నట్లు మీడియా సంస్థలు పేర్కొన్నాయి. మరణించిన రష్యన్ సైనికుల సగటు వయసు 2022లో 33గా ఉండగా.. 2026లో 40గా ఉన్నట్లు తెలిపాయి. చనిపోయిన వారిలో దాదాపు 7వేల మంది వయసు 18-19గా గుర్తించినట్లు చెప్పాయి. అయితే, వీరంతా నిర్బంధ సైనిక సేవకులే కావచ్చని అంచనా వేశాయి.

వందలాది ఆత్మహత్యలు..?

మరోవైపు, ఉక్రెయిన్‌తో యుద్ధం కారణంగా అనేక మంది రష్యన్ సైనికులు ఆత్మహత్యలకు పాల్పడినట్లు తెలిసింది. ఈ ఐదేళ్ల కాలంలో సుమారు 1229 మంది సైనికులు బలవన్మరణాలకు పాల్పడినట్లు అంచనా. వీరిలో సగం మంది సరిహద్దు ప్రాంతాల్లోనే చనిపోయినట్లు భావిస్తున్నారు.

మూసీ పునరుజ్జీవ పనుల్లో వేగం పెంచండి

చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఫుట్ బ్రిడ్జ్ వద్ద మల్టీ లెవల్ కార్ పార్కింగ్ కోహెడలో ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ పనుల పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచాలని, నాణ్యతలో రాజీ పడొద్ద న్నారు. మార్కెట్ అభివృద్ధి పనులతో సమాంతరంగా రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సీఎంసీ పరిధిలో ఐఐఐటీ జంక్షన్ వద్ద ఫుట్ బ్రిడ్జ్ డిజైన్లను కమిషనర్ సీఎం దృష్టికి తీసుకురాగా ఫుట్ బ్రిడ్జ్ వద్ద మల్టీ లెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లో పీఆర్‌టీఎస్ ఫేజ్-1 టెక్నో ఎకానమీ ఫీజిబిలిటీని అధికారులు సీఎంకు వివరించారు. కూకట్‌పల్లి, రాయదుర్గం, బయో డైవర్సిటీ అలైన్‌మెంట్‌ను గురించి తెలిపారు.బేగంపేట నుంచి సెక్రటేరియట్ వరకు పీఆర్‌టీఎస్ అలైన్‌మెంట్, బషీర్‌బాగ్ మీదుగా రాణిగంజ్ వరకు అలైన్‌మెంట్ ప్రతిపాదనలను అధికారులు సీఎంకు తెలిపారు. పీఆర్‌టీఎస్ డిపోల నిర్మాణానికి స్థలాలు గుర్తించి అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. డిపో పరిసరాల్లో మల్టీ లెవల్ పార్కింగ్‌కు ప్రణాళికలు రూపొందించాలన్నారు. రూట్స్, డిపోల నిర్మాణంపై అధ్యయనం చేసి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. చెరువుల పునరుద్ధరణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై హైడ్రా కమిషనర్ సీఎంకు వివరించారు. చెరువుల పునరుద్ధరణలో ఎస్టీపీల ఏర్పాటుపై సీఎం దృష్టికి తెచ్చారు. ఎస్టీపీల నిర్మాణం వేగవంతం చేయాలని అధికారులకు సీఎం సూచించారు. మెట్ల బావుల పునరుద్ధరణలోనూ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

క్యూర్, ప్యూర్ ప్రాంతాల్లో పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతం

క్యూర్, ప్యూర్ ప్రాంతాల్లో మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖల పరిధిలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి ఆయా ప్రాజెక్టులపై స్పష్టమైన సూచనలు ఇచ్చారు.ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో మున్సిపల్ వ్యవహారాలు, పట్టణాభివృద్ధిపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్షించారు. మూసీ పునరుజ్జీవం, రేడియల్ రోడ్ల పురోగతిని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. మూసీ పునరుజ్జీవం ప్రాజక్టు ఫేజ్-1 లో భాగంగా హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.20 కి.మీ ప్రాంతాన్ని జోన్-1 ఏ గా, ఉస్మాన్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కి.మీ ప్రాంతాన్ని జోన్-1 బీ గా విభజించి పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. జనవరి 2027 లో ఫేజ్-1 పనులు మొదలు పెట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఇప్పటికే ఫేజ్-1 టెండర్ల ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు.మిరాలం ట్యాంక్ అభివృద్ధి పనుల పురోగతిపై సీఎం ఆరా తీశారు. జనవరి 2028 నాటికి ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు అధికారులు తెలిపారు. మిరాలం చెరువు అభివృద్ధితో పాటు చెరువులో ఎంతో కాలంగా పేరుకుపోయిన పూడికను తొలగించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రేడియల్ రోడ్ల నిర్మాణం, భూసేకరణ పురోగతిని అధికారులు వివరించగా, రేడియల్ రోడ్ల నిర్మాణంలో పనులను మరింత వేగం పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు.

రాజీవ్‌కు ఉద్దేశపూర్వకంగానే భద్రత తొలగించారు

అవకాశం ఉందని ఆందోళన చెందాడు. మేమంతా తీవ్ర భయభ్రాంతులకు గురయ్యాం. అంత జరిగినా అప్పటి ప్రభుత్వం రాజీవ్‌కు సెక్యూరిటీ పెంచలేదు. ఆ తర్వాత కొన్ని నెలలకే ఆయన ప్రాణాలు కోల్పోయారు' అని సోనియా పేర్కొన్నారు. 1968లో ఇటలీ నుంచి భారతదేశానికి వచ్చిన తర్వాత తన తొలిరోజులను సోనియా గాంధీ గుర్తుచేసుకున్నారు. అప్పట్లో దేశంలోని పేదరికాన్ని చూసి తాను తీవ్రగ్రాంతికి గురయ్యానని తెలిపారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. ఆత్మకథ పుస్తకంలో తమ కుటుంబం గురించి తన తల్లి 500కుపైగా పేజీలు రాసినా.. ఆమె చెప్పాల్సిన విషయాలు ఇంకా చాలా ఉన్నాయన్నారు.

సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు శుభవార్త

తరగతి వరకు ఉచితంగా విద్య అందించనున్నారు. ఈ నిర్ణయంతో వచ్చే విద్యా సంవత్సరం నుంచి సింగరేణి విద్యా సంస్థల్లో కాంట్రాక్టు కార్మికుల పిల్లల ప్రవేశ సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.ఈ సదుపాయాన్ని పొందాలనుకునే కాంట్రాక్టు కార్మికులు తమ గుర్తింపు కార్డు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, తమ పిల్లల ఆధార్ కార్డు, ప్రభుత్వం జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లను సంబంధిత సింగరేణి శాఖాధిపతుల ద్వారా ధ్రువీకరించి సమర్పించాలని సింగరేణి విద్యాశాఖ అధికారులు జారీ చేసిన సర్క్యులర్ లో పేర్కొన్నారు.సింగరేణి యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఊరటనివ్వనుంది. ప్రైవేటు పాఠశాలల్లో చదివించేందుకు అధిక మొత్తంలో ఫీజులు చెల్లించాల్సి వస్తున్న నేపథ్యంలో, సింగరేణి పాఠశాలల్లో తమ పిల్లలకు పదో తరగతి వరకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించే అవకాశం కలగడం పట్ల కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.కాగా, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో ఎప్పుడూ లేని విధంగా సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు కూడా లాభాల వాటా బోనస్‌ను చెల్లిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది రూ.5,500 బోనస్ చెల్లించగా.. తాజాగా కాంట్రాక్టు కార్మికుల పిల్లలకు ఉచిత విద్య అందించే నిర్ణయం తీసుకోవడంతో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికుల సంక్షేమానికి మరింత ప్రాధాన్యత లభించినట్లయింది. ఈ నిర్ణయం పట్ల ఔట్ సోర్సింగ్ కార్మికులు రాష్ట్ర ప్రభుత్వానికి, సింగరేణి యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు .

నీటిపై సర్కారు శ్వేతపత్రం విడుదల చేయాలి

బీఆర్ఎస్, కేసీఆర్ వల్లే. పదవుల కోసం పెదవులు మూసుకున్నది కాంగ్రెస్ నేతలు కాదా?30 ఏళ్లలో కాంగ్రెస్, తెదేపా హయాంలో పాలమూరు జిల్లాలో 30 వేల ఎకరాలకే నీళ్లిచ్చారు. బీఆర్ఎస్ హయాంలో 10 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చాం. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక పాలమూరులో అదనంగా లక్ష ఎకరాలకైనా నీళ్లిచ్చారా? 2024 డిసెంబర్ 3న ఏపీ ప్రభుత్వం 403, 405 జీవోల ద్వారా కుప్పానికి లైనింగ్ చేయించారు. 700 కి.మీ దూరంలోని కుప్పం వరకూ కృష్ణా నీళ్లు ఎలా పారుతున్నాయి?ఇక్కడే ఉన్న పాలమూరుకు మాత్రం కృష్ణా జలాలు రాలేదు. ఉద్యమ సమయంలో, సీఎంగానూ రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహిగానే ఉన్నారు" అని హరీశ్‌రావు విమర్శించారు.

కేఆర్ఎంబీకి లేఖ రాసి జగన్‌కి ఆదేశాలు వచ్చేలా చేసిందే కేసీఆర్..

రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నేనే ఆపేశానని సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నాడని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నా మాటకు విలువ ఇచ్చి చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఆపేశాడని రేవంత్ రెడ్డి చెప్పాడు. రేవంత్ రెడ్డి మాటలు తప్పు అని నిరూపిస్తూ, ఆ ప్రాజెక్టు జగన్ హయాంలో బీఆర్ఎస్ రాసిన లేఖల వల్ల ఆగిపోయిందని చంద్రబాబు నాయుడు ప్రెస్ రిలీజ్ చేశాడని క్లారిటీ ఇచ్చారు.వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2019 జూన్ లో వచ్చిండు.. వచ్చిపోగానే 5-5-2020లో రాయలసీమ లిఫ్ట్ జీవో వచ్చింది.. నిజమేంటో చెబుతా.. అసలు ఈ జీవో రాకముందే ఉత్తరం రాసినం.. జీవో మేలో వచ్చింది.. మా బీఆర్ ఎస్ కమిట్‌మెంట్, నిజాయితీకి ఇదొక నిదర్శనం.. ఈ లెటర్ 29-01-2020న రాసినం.. ఇందులో మీరు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ చేపట్టబోతున్నట్టు సాక్షి, ఆంధ్రజ్యోతి, వెలుగుతోపాటు పలు వార్తా పత్రికల్లో వార్తలు వచ్చినయి.. అని ఆ వార్తల ఆధారంగా కేఆర్ ఎంబీకి 4 నెలల ముందే ఇలాంటి ప్రాజెక్ట్ ఏదైనా వస్తే వెంటనే ఆపండి.. దీనికి అనుమతులు ఇయ్యొద్దు.. వాళ్లు పనులు చేయకుండా మీరు వెంటనే ఆదేశాలు ఇవ్వండి.. అని కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్‌కు జీవో రావడానికి 4 నెలల ముందు లేఖ రాశాం.. రేవంత్‌రెడ్డి ఏం మాట్లాడుతడు.. 2019 జూన్‌లో జగన్‌మోహన్ రెడ్డి రాగానే కేసీఆర్ ఒప్పుకున్నడు.. పరమాన్నం తిన్నడు.. మాట్లాడిండు.. ఆంధ్రాకు మంచోడు.. అని సీఎం రేవంత్ రెడ్డి ఇంత పచ్చి అబద్దాలు మాట్లాడొచ్చా అని హరీశ్ రావు ప్రశ్నించారు.రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు వెంటనే ఆపాలని జగన్ మోహన్ రెడ్డికి కేసీఆర్ స్పష్టంగా చెప్పారు. చెప్పడమే కాకుండా ఆనాడు జగన్ ప్రభుత్వానికి ప్రాజెక్టు ఆపాలని అని హరీశ్ రావు స్పష్టం చేశారు.

ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడంతోనే యువత పెడదోవ

యువత ప్రధానమైన ఆస్తి. ప్రపంచంలోనే భారత్‌లో యువ జనాభా ఎక్కువగా ఉంది. పంజాబ్‌లో యువత డ్రగ్స్‌కు బానిసై నిర్వీర్యం అవు తోంది. దేశాన్ని, యువతను రక్షించుకునేందుకు 'నషా ముక్త్ భారత్' కో సం పని చేయాలని ప్రధాని మోదీ నిర్ణయం తీసుకున్నారు. కొందరు డ్రగ్స్ ద్వారా వచ్చే ఆదాయాన్ని దేశ వ్యతిరేక కార్యక్రమాలకు ఉపయో గిస్తున్నారు. ఉమ్మడి కుటుంబాలు తగ్గిపోవడం.. మత్తు పదార్థాల వినియోగానికి కారణమవుతోంది. పట్టణ ప్రాంతాల్లో 25శాతం యువత డ్రగ్స్ వినియోగిస్తోంది. తల్లిదండ్రులకు దూరంగా ఉన్న పిల్లలకు.. కొత్త పరిచయాలు ఏర్పడి వీటి వినియోగం పెరిగిపోతోంది.నషా ముక్త్ భారత్ ఉద్యమంలో బస్తీ స్థాయి నుంచి భాగస్వామ్యం చేస్తూ అధికారులతో కమిటీలు వేస్తాం. మొదటి దశలో డ్రగ్స్ ఎక్కడి నుంచి వస్తున్నాయనే సమాచారాన్ని సేకరిస్తున్నాం. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాలని నిర్ణయించాం. ప్రభుత్వమే కాకుండా ప్రతి కుటుంబ సభ్యుడు, విద్యా సంస్థలు భాగస్వామ్యం అయితేనే డ్రగ్స్ రహిత దేశంగా తీర్చిదిద్దవచ్చన్నారు

భాజపాతో అకాలీదళ్ చేతులు

న్యూఢిల్లీ(జనంసాక్షి):పంజాబ్‌లో వచ్చే ఏడాది ఆరం భంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ క్రమంలోనే దాదాపు ఆరేళ్ల తర్వాత శిరోమణి అకాలీదళ్ మళ్లీ ఎన్డీయే గూటికి చేరింది. భాజపా-అకాలీ దళ్ పొత్తును కేంద్రమంత్రి అమిత్‌షా, శిరోమణి అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ప్రకటించారు. ఇరు పార్టీలు పంజాబ్ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తాయని తెలిపారు. పంజాబ్‌ను డ్రగ్స్ రహితంగా మార్చడం, అవినీతి నిర్మూలన, జాతీయవాద శక్తులను బలోపేతం చేయడం, రైతుల సమస్యలను పరిష్కరించడం వంటివి కూటమి కీలక ప్రాధాన్యతలుగా ఉంటాయన్నారు.వచ్చే ఏడాది ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభకు జరగబోయే ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల మధ్య తొలి విడత చర్చలు జరిగాయి. ఈ క్రమంలో కాంగ్రెస్‌కు 26 సీట్లు ఆఫర్ చేసినట్లు సమజ్‌వాదీ ఎంపీ రాజీవ్ రాయ్ వెల్లడించారు. తమకు 100కుపైగా సీట్లు కావాలని కాంగ్రెస్ కోరుతుండగా.. ఎస్పీ 26 సీట్లు మాత్రమే ఇవ్వడానికి అంగీకరించడం గమనార్హం.యూపీలో మొత్తం 403 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 2022లో ఎస్పీ 347 సీట్లలో పోటీ చేయగా.. 111 చోట్ల విజయం సాధించింది. కాంగ్రెస్ 399 చోట్ల బరిలోకి దిగి.. కేవలం రెండు సీట్లకే పరిమితమైంది. అయితే.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమిలో భాగంగా పోటీ చేసిన ఈ పార్టీలు మంచి ఫలితాలు సాధించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఇదే ఒరవడిని కొనసాగించాలనే ఉత్సాహంతో ఈ రెండు పార్టీలు మళ్లీ కూటమిగా పోటీచేస్తున్నట్లు తెలుస్తోంది.

డిసెంబర్ 16న బంగ్లాదేశ్‌కు షేక్ హసీనా

బంగ్లాదేశ్‌లో విక్టరీ డే నిర్వహిస్తారు. అదే రోజును ఆమె స్వదేశానికి తిరిగి వెళ్లడానికి ఎంపిక చేసుకోవడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. '2024 ఆగస్టు 5న తాను బంగ్లాదేశ్ విమానంలో భారత్‌కు వచ్చినందున.. తిరిగి దిల్లీ నుంచి తీసుకువెళ్లడానికి బిమాన్ బంగ్లాదేశ్ ఎయిర్‌లైన్స్ ఫ్లైట్‌ను పంపాలని హసీనా బంగ్లాదేశ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆ సమయంలో రాజ్యాంగానికి విరుద్ధంగా ఆమెను బహిష్కరించినందున.. డిసెంబర్ 16న విక్టరీ డే రోజున ఆమె గౌరవంగా బంగ్లాదేశ్‌కు తిరిగి వచ్చేలా చూడటం ఇప్పుడు ప్రభుత్వ బాధ్యత' అని హసీనా సహాయకుడు పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లడానికి హసీనా కొంత కాలంగా ప్రయత్నాలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే తనకు కొత్త పాస్‌పోర్టు, జాతీయ గుర్తింపు కార్డు జారీ చేయాలని ఆమె బంగ్లాదేశ్‌ను అభ్యర్థించారు. మరోవైపు ఆమెను స్వదేశానికి పంపాలంటే ఆ దేశం తమ సైనిక విమానాన్ని పంపాలని.. లేదా ఇరుదేశాల భూ సరిహద్దు మార్గంలో పొరుగు దేశ సైన్యం హసీనాను మర్యాదపూర్వకంగా ఆహ్వానించాలని భారత్ షరతులు విధించినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆమె తిరిగి వెళ్లే తేదీని ఖరారు చేయడం గమనార్హం. అయితే ఈ విషయంపై బంగ్లా ప్రభుత్వం ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఒకవేళ హసీనా తిరిగి దేశానికి వస్తే.. ఆమెను కచ్చితంగా అరెస్ట్ చేస్తామని బంగ్లా ప్రభుత్వ వర్గాలు స్థానిక మీడియాకు తెలిపాయి.

అక్రమ నిర్మాణాల్లో మున్సిపల్ అధికారుల లంచావతారం

ఆ చేతులు కదలాలంటే జేబులు నిండాలి. ఈ లంచావతారాలే ఇవాళ నగరాల భవిష్యత్తును తాకట్టు పెడుతున్నారు.ఈ అక్రమ దందాలో అసలు బలి పశువులు ఎవరు? కష్టార్జితంతో, బ్యాంకు రుణాలతో, జీవితకాల పొదుపుతో ఇల్లు కొనుక్కునే సామాన్య కొనుగోలుదారులే. ఏళ్ల తరబడి ఈఎంఐలు కడుతూ కొనుక్కున్న ఇల్లు రేపు అక్రమ నిర్మాణమని తేలితే ఏమవుతుంది? కూల్చివేత నోటీసు వస్తుంది. రిజిస్ట్రేషన్ చేయడానికి నిరాకరిస్తారు. బ్యాంకులు రుణం ఇవ్వవు. అమ్ముకుందామంటే కొనేవారు ఉండరు. అనుమతి ఇచ్చిన అధికారి పదవీ విరమణ చేసి పింఛను తీసుకుంటూ హాయిగా ఉంటాడు. నిర్మాణదారు మరో ప్రాజెక్టు ప్రకటిస్తాడు. నష్టం మాత్రం ఇల్లు కొన్నవాడిదే. ఇది న్యాయమా?ప్రాణాలకు కూడా ముప్పు ఉంది. నిబంధనలు పాటించని భవనాల్లో అగ్ని ప్రమాద భద్రత ఉండదు. నాణ్యత లేని నిర్మాణాలు కుప్పకూలే ప్రమాదం ఉంది. ఏ ప్రమాదం జరిగినా కొన్ని రోజులు హడావుడి, కొందరు చిన్న ఉద్యోగుల సస్పెన్షన్, ఆ తర్వాత అంతా మామూలే. పెద్ద తలకాయలు మాత్రం ఎప్పటికీ తప్పించుకుంటూనే ఉన్నాయి. శిక్ష భయం లేకపోవడమే ఈ నిర్భయానికి కారణం.అక్రమ నిర్మాణాల ప్రభావం భవనం గోడల దగ్గరే ఆగదు. సుప్రీంకోర్టు పేర్కొన్నట్లు పౌర సదుపాయాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. వాహనాలతో రహదారులు కిక్కిరిసిపోతున్నాయి. మురుగునీటి పారుదల వ్యవస్థ కుప్పకూలుతోంది. తాగునీటి సరఫరా, విద్యుత్ లోడు ఎవరి లెక్కలోనూ లేవు. వర్షం వస్తే నగరాలు చెరువులవుతున్నాయి. దీనికి కారణం వాన కాదు, అనుమతి లేకుండా లేచిన భవనాలు, కబ్జాకు గురైన కాలువలు, చూసీచూడనట్లు ఉన్న అధికారులు.ఇక పరిష్కారం ఏమిటి? మొదట, అక్రమ నిర్మాణం జరిగిన ప్రతి చోటా ఆ ప్రాంత అధికార

కార్తీక పౌర్ణమి రోజు కాళేశ్వరంలో విషాదం

- గోదావరిలో పుణ్యస్నానం ఆచరిస్తూ చత్తీస్‌గడ్ బాలుడు మృతి



మహాదేవపూర్, నవంబర్ 24 జనంసాక్షి: కార్తీక పౌర్ణమి రోజు పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో అపశృతి చోటుచేసుకుంది, పక్క రాష్ట్రమైన ఛత్తీస్గడ్ రాష్ట్రానికి చెందిన బాలుడు పుణ్యస్నానం ఆచరిస్తూ గోదావరిలో పడి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకోవడంతో పుణ్యక్షేత్రం అంతా విషాద ఛాయలు నిండాయి.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు వచ్చి పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్న క్రమంలో, పక్క రాష్ట్రమైన చత్తీస్గడ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా కేంద్రానికి చెందిన 8 మంది సభ్యులతో కుటుంబం కాళేశ్వరానికి వచ్చి పుణ్యస్నానం ఆచరిస్తున్న క్రమంలో, రావ్ నక్ సాహు,14 సంవత్సరాలు పడవలో త్రివేణి సంగమం వద్దకు వెళ్లి సిరివంచ ఒడ్డు వైపు స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు ప్రవాహంలో పడి మృతి చెందడం జరిగింది. సమాచారం అందడంతో స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ సురేష్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి వెళ్లి స్థానిక జాలర్ల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీసి అనంతరం పోస్టార్టం నిమిత్తం మహదేవపూర్ సామాజిక ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

కావాలని అన్న మాట కాదు.. అనుకోకుండా దొర్లిన పదం

- కల్వకుంట్ల కవిత వ్యాఖ్యలను ప్రస్తావించే క్రమంలో పొరపాటు జరిగింది
- వెంటనే వెనక్కి తీసుకున్నా.. బీఆర్ఎస్ వైరల్ చేయడం దుర్మార్గం
- మంత్రి సీతక్క

ములుగు (జనంసాక్షి) : కల్వకుంట్ల కవిత ఒక మీడియాతో మాట్లాడిన మాటలను తాను ఊటంకిస్తున్న సందర్భంలో దొర్లిన పొరపాటుకు చింతిస్తున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. నిన్న ములుగులో చేయూత నూతన పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఫైలేరియా, డయాలసిస్, ఎయిడ్స్ బాధితులకు కూడా పెన్షన్లు మంజూరు చేసిన విషయాన్ని తాను ప్రస్తావించినట్లు మంత్రి తెలిపారు. అనంతరం అదే అంశాలపై మీడియా మాట్లాడుతున్న క్రమంలో కల్వకుంట్ల కవిత ఒక మీడియా సంస్థతో మాట్లాడిన వ్యాఖ్యలను ప్రస్తావించే సందర్భంగా పొరపాటు జరిగిందని వివరించారు. ఆ పొరపాటును వెంటనే సరిదిద్దుకున్నప్పటికీ, కవితపై ఉన్న రాజకీయ కోపంతో బీఆర్ఎస్ పార్టీకి చెందినవారు ఆ వ్యాఖ్యలను వైరల్ చేయడం దారుణమని మంత్రి సీతక్క అన్నారు. రాజకీయ కక్షతో తనను క్యాన్సర్ పేషెంట్ గా బీఆర్ఎస్ చిత్రీకరించిట్లు కవితే ఓ మీడియా ఛానెల్ కు చెప్పిన విషయాన్ని తాను ప్రస్తావించానని తెలిపారు. కవిత ను కావాలని అన్న పదం కాదు..దొర్లిన పదం..వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించినా...బీఆర్ఎస్ ట్రోల్ చేయడం దారుణమన్నారు. వరంగల్ పర్యటన సందర్భంగా చేయుత పెన్షన్లపై కేటీఆర్ చేసిన తప్పుడు ప్రచారాన్ని తాను తిప్పికొట్టాననే అక్కసుతోనే తన మాటలను వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తాను రాజకీయ ప్రత్యర్థులను రాజకీయంగానే ఎదుర్కొంటానని, వ్యక్తిగత విమర్శలు చేయడం తన నైజం కాదని సీతక్క అన్నారు. ఈ విషయం రాష్ట్ర ప్రజలకు కూడా తెలుసన్నారు.



పోడు భూములకు శాశ్వత పట్టాలు ఇవ్వాలి

- తండా పంచాయతీలను రెవిన్యూ పంచాయతీలుగా గుర్తించాలి
- సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించాలి
- లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గుగులోత్ రాజేష్ నాయక్



గూడూరు, నవంబర్24 (జనంసాక్షి): పోడు భూములకు శాశ్వత పట్టాలు ఇచ్చి తండా పంచాయతీలను రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించాలని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు గూగుల్లో రాజేష్ నాయక్ అన్నారు. మంగళవారం గూడూరు మండల కేంద్రంలో లంబాడి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం సిరి ఫంక్షన్ హాల్లో మండల అధ్యక్షులు మంగీలాల్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా గుగులోత్ రాజేష్ నాయక్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో తండా పంచాయతీలను రెవిన్యూ గ్రామపంచాయతీలుగా నేటికీ గుర్తించలేదని, ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీలను దృష్టిలో పెట్టుకొని తక్షణమే రెవెన్యూ పంచాయతీలుగా గుర్తించి, ఆయా పంచాయతీలకు ఒక్కొ పంచాయతీకి కోటి రూపాయలు విడుదల చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను అయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేస్తున్న రైతులకు ఆర్ఓఎఫ్ఆర్ హక్కు పత్రాలు కొన్ని మాత్రమే బ్యాంకు లోన్ కు ఉపయోగపడుతున్నాయని,మరికొన్ని ఆర్ఓఎఫ్ఆర్ పాస్ బుక్కులు డీఎల్సీలో ఇంప్లిమెంట్ చేయకుండా జీరో బుక్కులు రైతులకు అందజేయడం ద్వారా లోను తీసుకునే అవకాశం లేకుండా పోయిందని, తక్షణమే ఏజెన్సీ రైతులను వారి పట్టాలకు లోను వచ్చే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోని రైతులను ఆదుకోవాలని అన్నారు. ఎలినో ప్రభావంతో పంటలు పండక ఏజెన్సీ ప్రాంతంలో నీటి వసతులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని,తక్షణమే రాష్ట్రప్రభుత్వం స్పందించి ప్రతి ఎకరాకు 50 వేల రూపాయలు అందించాలని సభలో తీర్మానం చేయడం జరిగిందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో పనిచేస్తున్న అధికారులు ఏజెన్సీ చట్టాలను కాపడాల్సిన బాధ్యత వారిపై ఉన్నదని,ఏజెన్సీ తీర్మానం లేకుండా అనేక అక్రమాలు జరుగుతున్నాయని అవినీతికి పాల్పడుతున్నారని, జిల్లా కలెక్టర్ దృష్టి పెట్టి ఏజెన్సీలో ఉన్నటువంటి చట్టాలను వారికి ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా నవంబర్ 29న జనగామలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నమని,సభకే పరిమితం కాదని,లంబాడీల సమాజం,భవిష్యత్తును నిర్ణయించే హక్కుల పోరాటానికి ఒక దిశ నిర్దేశమని,మన సమస్యలపై చర్చించి పరిష్కారాల కోసం ఐక్య కార్యచరణను శ్రీకారం చుట్టడమే మన సంకల్పమని అన్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసునాయక్. మాట్లాడుతూ గూడూరు మండల కేంద్రంలో సేవాలాల్ మహారాజ్ మందిరం నిర్మాణం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించాలని,తెలంగాణ రైతాంగ పోరాటంలో అసువులుబాసిన టాను నాయక్ విగ్రహ ప్రతిష్ట త్వరలో చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర,జిల్లా నాయకులు జగన్ నాయక్,బాలు నాయక్,సుందర్ నాయక్, శీను నాయక్,మంగీలాల్ నాయక్,వెంకన్న నాయక్, రమేష్ నాయక్,బాలు నాయక్,మాజీ సర్పంచ్ దీవిలాల్ నాయక్, సిమ్లా నాయక్,సుభాష్ నాయక్, లక్ష్మణ్ నాయక్,గోనియా నాయక్, బాలు నాయక్,మహిళ నాయకులు పాల్గొన్నారు.

బహిరంగ మార్కెట్‌లో పోలీస్ శాఖ రహస్యాలు

- ఉగ్ర హెచ్చరిక మెయిల్ లీక్ అందులో భాగమే
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



హైదరాబాద్ (జనంసాక్షి) : రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో వరుస హత్యల, దాడులతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి హోంమంత్రి పదవికి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో ఇటీవల వరుసగా జరుగుతున్న హత్యలు, గ్యాంగ్‌వార్ ఘటనలను ప్రస్తావిస్తూ.. నగరం సిలికాన్ వ్యాలీగా, అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా ఎదగాల్సిన సమయంలో గ్యాంగ్‌వార్‌లకు అడ్డాగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎకో పార్క్ వద్ద ముర్తుజా పెహల్వాన్‌పై కత్తులతో దాడి చేసి హత్య చేయడం, మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో రౌడీ గ్యాంగుల దాడులు, ఇతర హత్య ఘటనలు నగరంలో భద్రతా పరిస్థితికి నిదర్శనమన్నారు. అలాగే, హైదరాబాద్‌లో ముంబై తరహా ఉగ్రదాడులు జరిగే ప్రమాదం ఉందంటూ ఈ నెల 21న జాయింట్ కమిషనర్ (స్పెషల్ బ్రాంచ్) నుంచి పోలీసు అధికారులకు హెచ్చరిక మెయిల్ వచ్చిందని వెల్లడించారు. లష్కరే తోయిబా పేరుతో వచ్చినట్లు చెబుతున్న ఆ మెయిల్‌లో కాచిగూడ రైల్వే స్టేషన్, టూరిస్ట్ ప్లాజా వంటి ప్రాంతాల్లో దాడులు చేసి 300 మందిని చంపుతామని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. ఇలాంటి కీలకమైన సమాచారం ఇన్‌స్పెక్టర్లు, ఏసీపీలు, డీసీపీ స్థాయి అధికారులకే పరిమితం కావాల్సి ఉండగా సోషల్ మీడియాలోకి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. ఆ మెయిల్ నిజమైనదా, నకిలీదా అనే విషయాన్ని ముందుగానే ఎందుకు నిర్ధారించలేకపోయారని నిలదీశారు. మాదాపూర్‌లోని మెటా సంస్థ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం దురదృష్టకరమని అన్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి అంతర్జాతీయ వేదికలను నిర్వహించే సంస్థపై దాడి జరగడం రాష్ట్ర ప్రతిష్టకు నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు. పోలీసు శాఖలోని కీలక విభాగాలకు సంబంధించిన సమాచారం, ఫోన్ ట్యాపింగ్ వివరాలు బయటకు లీక్ అవుతున్నాయని, పోలీసు శాఖలోని రహస్య సమాచారం మార్కెట్‌లో అమ్ముడవుతున్నట్లుగా పరిస్థితి తయారైందని విమర్శించారు. పోలీసు శాఖలోని సైబర్ సెక్యూరిటీ, కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, నాయకులు మంద శ్యామ్, కొంకటి శేఖర్, శ్రీనివాస్ యాదవ్, అబ్రార్ హుస్సేన్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల జాబితా పేరు లేదని సెల్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్



మిర్యాలగూడ (జనంసాక్షి) : ఇటీవల మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో తన పేరు లేదని ఆవేదనతో ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి హల్‌చల్ చేసిన సంఘటన మంగళవారం మిర్యాలగూడ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని చైతన్యనగర్‌కు చెందిన యూనస్‌కు ఇటీవల మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో పేరు రాకపోవడంతో ఆవేదనకు గురై సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకుడికి నచ్చజెప్పి కిందికి దించారు. గత నాలుగు నెలల క్రితం కూడా యూనస్ సెల్ టవర్ ఎక్కడంతో టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసునమోదు చేశారు.

ఊయల తగిలి పదేళ్ల విద్యార్థి మృతి

హైదరాబాద్ (జనంసాక్షి) : సరదాగా గడపాల్సిన స్కూల్ పిక్నిక్ ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. హైదరాబాద్ శివారులోని మొయినాబాద్ లోటస్ పాండ్ పార్క్‌లో జరిగిన ప్రమాదంలో పదేళ్ల బాలుడు మృతి చెందగా, మరో విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యమే తమ కుమారుడి ప్రాణాలు తీసిందని మృతుడి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. నగరంలోని ఓ పాఠశాల విద్యార్థులను యాజమాన్యం మొయినాబాద్‌లోని లోటస్ పాండ్ పార్క్‌కు పిక్నిక్‌కు తీసుకెళ్లింది. ఈ క్రమంలో అక్కడ ఉన్న భారీ ఇనుప ఊయలపై సుమారు 10 మంది పిల్లలు ఎక్కారు. వెనుక నుంచి మరో నలుగురు విద్యార్థులు ఆ ఊయలను అత్యంత వేగంగా ఊపడంతో అది ఒక్కసారిగా అదుపుతప్పింది. వేగంగా వెనక్కి దూసుకొచ్చిన ఇనుప ఊయల అక్కడే ఉన్న ఇద్దరు చిన్నారులను బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు.

పర్యవేక్షణ లోపంపై తల్లిదండ్రుల ఆగ్రహం..

ప్రమాదం జరిగిన సమయంలో పిల్లల వద్ద కనీసం ఒక్క టీచర్ కానీ, స్కూల్ సిబ్బంది కానీ లేకపోవడం గమనార్హం. పిల్లలను గాలికి వదిలేసి నిర్లక్ష్యంగా వ్యవహరించారని, కనీస భద్రతా చర్యలు, పర్యవేక్షణ లేకపోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, ఈ విషాద ఘటన బయటకు పొక్కకుండా ఉండేందుకు స్కూల్ యాజమాన్యం వ్యవస్థలను మేనేజ్ చేసిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమ కుమారుడి మృతికి కారణమైన పాఠశాల యాజమాన్యంపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని అభిరామ్ తల్లిదండ్రులు, బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనతో పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

ఈసీఐఎల్‌లో బీఆర్టీయూ విజయం

- ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు పోరాటం : మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఆర్టీయూ నాయకత్వంలో కృషి చేస్తామని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఈసీఐఎల్‌లో ఇటీవల జరిగిన యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో విజయం సాధించిన నాయకులకు బీఆర్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈనెల 21న జరిగిన ఎన్నికల్లో భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్టీయూ, సీఐటీయూ, ఓబీసీ సంఘం, ఇతర మిత్ర సంఘాలతో కూడిన ఫ్రంట్ విజయం సాధించడంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి. రాంబాబు యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, ఏఐటీయూసీలతో కూడిన ఫ్రంట్‌ను కార్మికులు ఓడించి బీఆర్టీయూ మిత్రపక్షాల ఫ్రంట్‌కు పట్టం కట్టారని నాయకులు పేర్కొన్నారు. నూతన ఆర్థిక విధానాలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లకు మద్దతిచ్చే విధానాలను కార్మికులు తిరస్కరించారని తెలిపారు. దేశంలో కొత్త లేబర్ కోడ్‌ల అమలు తర్వాత ఈసీఐఎల్‌లో తొలిసారిగా జరిగిన యూనియన్ గుర్తింపు ఎన్నికల్లో 51 శాతానికి పైగా ఓట్లు సాధించి భాస్కర్ రెడ్డి నాయకత్వంలోని ఫ్రంట్ గుర్తింపు పొందడం అభినందనీయమని అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు చేసిన కృషిని ఈసీఐఎల్, మిధాని, బీడీఎల్ కార్మికులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. బీహెచ్ఈఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల మనుగడకు కేసీఆర్ చేసిన కృషి ఎంతో దోహదపడిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు కట్టుబడి ఉందని, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతుందని స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో పబ్లిక్ సెక్టార్ కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వేతన ఒప్పందాలు, ఉద్యోగ నియామకాలు తదితర సమస్యలపై చర్చించి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా కార్యాచరణ రూపొందించాలని సమావేశంలో నిర్ణయించారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ఒక్కటే

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

హైదరాబాద్ (జనంసాక్షి) : బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు ఒక్కటేనని బీఆర్ఎస్ మోసగాడు అయితే కాంగ్రెస్ మోసగాళ్లకు మోసగాడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు విమర్శించారు. ఈ మోసగాళ్ల భరతం పట్టడానికి తెలంగాణలో బీజేపీ ధురంధర్ అధికారంలోకి రాబోతోందన్నారు. ఇవాళ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ పార్టీ ఇతర ప్రాంతీయ పార్టీలపై ఆధారపడుతూ సబ్ రీజనల్ పార్టీగా మారుతోందని ఎద్దేవా చేశారు. అందుకే యూపీలో కేవలం ఆ పార్టీకి 26 స్థానాలు మాత్రమే ఇచ్చేందుకు ఎస్పీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. నీటి విషయంలో సెంటిమెంట్ రగిలించి లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. కృష్ణా జలాల్లో కర్ణాటక నుంచి రావాల్సిన వాటాను ఎందుకు తీసుకురాలేకపోతున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నీటి విషయంలో సెంటిమెంట్ రగిలించే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ఎల్ నినో ప్రభావంతో ఓ వైపు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే మరో వైపు గ్లోబల్ సమ్మిట్ ఏంటని ప్రశ్నించారు. పెట్టుబడులు తీసుకువస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదని కానీ సమ్మిట్ పేరుతో ప్రభుత్వ డబ్బులు దుబారా చేయడం ఏంటన్నారు. మొన్న జరిగిన భారత్ సమ్మిట్‌కు ప్రభుత్వ నిధులు ఎలా కేటాయించారని ప్రశ్నించారు.

చిల్డ్రన్ బ్యాంక్ నోట్లతో భారీ మోసం..



ఆదిలాబాద్ (జనంసాక్షి) : చిల్డ్రన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో ముద్రించిన నోట్లను అసలైన కరెన్సీగా నమ్మిస్తూ ప్రజలకు కుచ్చుటోపీ పెడుతున్న ముఠాగుట్టును ఆదిలాబాద్ జిల్లా పోలీసులు రట్టు చేశారు. పూజలు, మంత్రతంత్రాలతో డబ్బులు రెట్టింపు చేస్తామని ఆశ చూపుతూ అమాయకుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేసి, అందుకు బదులుగా నకిలీ నోట్ల కట్టలను అందిస్తున్న ముఠా వ్యవహారాన్ని పోలీసులు వెలుగులోకి తెచ్చారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.40 లక్షలకు పైగా విలువైన 99 కట్టల చిల్డ్రన్ బ్యాంక్ నోట్లు, 100 నకిలీ బంగారు నాణేలు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు ప్రధాన నిందితులు ఇప్పటికే వేరే కేసులో అరెస్టయ్యారు. ఈ ముఠా పై ఆదిలాబాద్, హైదరాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో పలుకేసులు నమోదైనట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ వెల్లడించారు.

పూజల పేరుతో రూ.8 లక్షలకు టోకరా..

మంచిర్యాల జిల్లాకు చెందిన పత్తి రాములును ప్రధాన నిందితుడు అత్రం పరశురామ్ 2023 నవంబర్‌లో పరిచయం చేసుకున్నాడు. పూజలు, మంత్రతంత్రాలతో డబ్బులు రెట్టింపు చేస్తానని నమ్మించి రూ.6.50 లక్షలు తీసుకున్నాడు. అనంతరం ఒక బ్యాగులో డబ్బులు రెట్టింపు అయ్యాయని చెప్పి, పది రోజుల తర్వాత తెరవాలని సూచించాడు. బాధితుడు బ్యాగు తెరిచి చూడగా, అందులో అసలు కరెన్సీకి బదులుగా చిల్డ్రన్ బ్యాంక్ నోట్లు, తెల్ల కాగితాలు కనిపించాయి. ఇంటి శుద్ధి పూజల పేరుతో మరోసారి రూ.1.50 లక్షలు వసూలు చేయడంతో మొత్తం రూ.8 లక్షలు మోసపోయినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఈ కేసులో అరెస్టయిన ఎంబడి మల్లేష్, చీటి తరుణ్, జమల్‌పూర్ సాయికృష్ణ అలియాస్ సాయి, పేంద్రం సురేష్‌లు ప్రధాన నిందితులకు నకిలీ నోట్ల సరఫరాలో సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. మరో ఇద్దరు ప్రధాన నిందితులు అత్రం పరశురామ్, మండలి బక్కన్న ఇప్పటికే ఇచ్చోడ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన మరో కేసులో అరెస్టయ్యారు. అసలు కరెన్సీ నోట్ల కట్టకు పైన, కింద నిజమైన నోట్లు ఉంచి, మధ్యలో చిల్డ్రన్ బ్యాంక్ నోట్లను అమర్చి మోసాలకు పాల్పడుతున్నట్లు విచారణలో వెల్లడైంది. సుమారు 40 మంది బాధితులు ఉండవచ్చని ఎస్పీ తెలిపారు. మోసపోయిన వారు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని, డబ్బులు రెట్టింపు చేస్తామని చెప్పే వ్యక్తులను నమ్మవద్దని ప్రజలకు సూచించారు.

ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ముంగిట్లోకి : మంత్రి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల (జనంసాక్షి) : కాంగ్రెస్ సర్కార్ రాకతో ప్రభుత్వ పథకాలు లబ్ధిదారుల ముంగిట్లోకే వస్తున్నాయని, పింఛన్లు రేషన్ కార్డులు లాంటి పథకాల కోసం సంవత్సరాల పాటు ఎదురుచూపులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెరదించాడని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో వెల్గటూర్, ఎండపల్లి మండలాలకు నూతనంగా మంజూరైన చేయూత పింఛన్లు మంజూరి పత్రాలను వెల్గటూర్ మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మంగళవారం మంత్రి లక్ష్మణ్ కుమార్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నాలుగు గ్యారంటీలు అమలు చేశామని మరో రెండు గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు అందజేయడంతో పాటు సన్న బియ్యం సైతం పంపిణీ చేస్తున్నామని మంత్రి. గర్వంగా చెప్పారు. రాష్ట్రము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదవారికి చేయూత పింఛను అందించి అండగా నిలవాలని ఉద్దేశంతో కొత్త పింఛన్లు మంజూరు చేశారని అన్నారు.వెల్గటూర్ ఎండపల్లి మండలాలకు కొత్తగా 812 చేయూత పింఛన్లు మంజూరు అయినట్లు మంత్రి ప్రకటించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
25 నవంబర్ 2026

టౌన్ ప్లానింగ్ అధికారుల చేతివాటం

గృహ కొనుగోలుదారులకు మహా శాపం

దేశవ్యాప్తంగా భవన నిర్మాణ నిబంధనలు తీవ్రంగా ఉల్లంఘనకు గురవుతున్నాయని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. అక్రమార్కులతో మున్సిపల్ అధికారులు కుమ్మక్కై సహకారం అందించడంపై మండిపడింది. పట్టణ ప్రణాళిక విభాగం ముందస్తు అనుమతులను తమ కళ్ల ముందే అతిక్రమిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారని జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ సంజీవ్ సచ్‌దేవా ధర్మాసనం చేసిన వ్యాఖ్యలు, ఒక్క కేసుకు పరిమితమైన మాటలు కావు. అవి దేశంలోని ప్రతి నగరం, ప్రతి పట్టణం ఎదుర్కొంటున్న దుస్థితికి అద్దం పట్టే న్యాయస్థానం తీర్పు లాంటి హెచ్చరిక.

అనుమతి ఒక అంతస్తుకు ఇస్తే నాలుగు అంతస్తులు లేస్తున్నాయి. సెట్‌బ్యాక్ వదలాల్సిన చోట గోడలు లేస్తున్నాయి. పార్కింగ్ కోసం కేటాయించాల్సిన సెల్లార్లు దుకాణాలుగా, గోదాములుగా మారుతున్నాయి. ఇవన్నీ రాత్రికి రాత్రే జరగవు. నెలల తరబడి పునాది నుంచి శ్లాబు వరకు ప్రతి దశలోనూ టౌన్ ప్లానింగ్ సిబ్బంది తనిఖీకి వస్తూనే ఉంటారు. వారికి కనిపించని అక్రమం లేదు. కనిపించినా కదలని చేతులు ఉన్నాయి. ఆ చేతులు కదలాలంటే జేబులు నిండాలి. ఈ లంచావతారాలే ఇవాళ నగరాల భవిష్యత్తును తాకట్టు పెడుతున్నారు.

ఈ అక్రమ దందాలో అసలు బలి పశువులు ఎవరు? కష్టార్జితంతో, బ్యాంకు రుణాలతో, జీవితకాల పొదుపుతో ఇల్లు కొనుక్కునే సామాన్య కొనుగోలుదారులే. ఏళ్ల తరబడి ఈఎంఐలు కడుతూ కొనుక్కున్న ఇల్లు రేపు అక్రమ నిర్మాణమని తేలితే ఏమవుతుంది? కూల్చివేత నోటీసు వస్తుంది. రిజిస్ట్రేషన్ చేయడానికి నిరాకరిస్తారు. బ్యాంకులు రుణం ఇవ్వవు. అమ్ముకుందామంటే కొనేవారు ఉండరు. అనుమతి ఇచ్చిన అధికారి పదవీ విరమణ చేసి పింఛను తీసుకుంటూ హాయిగా ఉంటాడు. నిర్మాణదారు మరో ప్రాజెక్టు ప్రకటిస్తాడు. నష్టం మాత్రం ఇల్లు కొన్నవాడిదే. ఇది న్యాయమా?

ప్రాణాలకు కూడా ముప్పు ఉంది. నిబంధనలు పాటించని భవనాల్లో అగ్ని ప్రమాద భద్రత ఉండదు. నాణ్యత లేని నిర్మాణాలు కుప్పకూలే ప్రమాదం ఉంది. ఏ ప్రమాదం జరిగినా కొన్ని రోజులు హడావుడి, కొందరు చిన్న ఉద్యోగుల సస్పెన్షన్, ఆ తర్వాత అంతా మామూలే. పెద్ద తలకాయలు మాత్రం ఎప్పటికీ తప్పించుకుంటూనే ఉన్నాయి. శిక్ష భయం లేకపోవడమే ఈ నిర్భయానికి కారణం.

అక్రమ నిర్మాణాల ప్రభావం భవనం గోడల దగ్గరే ఆగదు. సుప్రీంకోర్టు పేర్కొన్నట్లు పౌర సదుపాయాలపై తీవ్ర ప్రభావం పడుతోంది. వాహనాలతో రహదారులు కిక్కిరిసిపోతున్నాయి. మురుగునీటి పారుదల వ్యవస్థ కుప్పకూలుతోంది. తాగునీటి సరఫరా, విద్యుత్ లోడు ఎవరి లెక్కలోనూ లేవు. వర్షం వస్తే నగరాలు చెరువులవుతున్నాయి. దీనికి కారణం వాన కాదు, అనుమతి లేకుండా లేచిన భవనాలు, కబ్జాకు గురైన కాలువలు, చూసీచూడనట్లు ఉన్న అధికారులు.

ఇక పరిష్కారం ఏమిటి? మొదట, అక్రమ నిర్మాణం జరిగిన ప్రతి చోటా ఆ ప్రాంత అధికారిని వ్యక్తిగతంగా బాధ్యుడిని చేయాలి. కూల్చివేత ఖర్చును అతని జీతం నుంచే వసూలు చేయాలి. అవినీతి రుజువైతే ఉద్యోగం పోవడంతో పాటు జైలు శిక్ష పడాలి, పింఛను ప్రయోజనాలు నిలిపివేయాలి. రెండోది, ప్రతి భవనం అనుమతులు, తనిఖీ నివేదికలు, నిర్మాణ పురోగతి ఫొటోలు ప్రజల కోసం ఆన్‌లైన్‌లో బహిరంగంగా అందుబాటులో ఉంచాలి. మూడోది, గృహ కొనుగోలుదారులను మోసం చేసిన బిల్డర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. బాధితులకు పరిహారం ఇప్పించాలి. అక్రమం జరిగితే కొనుగోలుదారుడిని కాకుండా అక్రమం చేసినవారిని శిక్షించాలి. సుప్రీంకోర్టు ప్రశ్నించింది, ఆక్షేపించింది, హెచ్చరించింది. ఇక కదలాల్సింది ప్రభుత్వాలు. లంచం తిని కళ్లు మూసుకున్న అధికారులకు శిక్ష పడని రోజు, రేపు కొనుగోలు చేసే ప్రతి ఇంటి యజమాని పాలిట ఆ ఇల్లే మరణ శాసనంగా మారుతుంది. చట్టబద్ధంగా వ్యవహరిస్తూ రాజ్యాంగ నిబంధనలను కాపాడాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని కోర్టు గుర్తు చేసింది. ఆ బాధ్యత మొదట ప్రజా సేవకులదే. ఆ బాధ్యతను మరిచినవారికి శిక్ష పడేవరకు ఈ దేశంలో ఇల్లు కొనడం ఒక జూదంగానే మిగిలిపోతుంది.

కిషన్‌జీ అమరత్వానికి నేటికీ..15 సంవత్సరాలు!

భారత విప్లవోద్యమ సేనాని పెద్దపల్లి పోరు బిడ్డ జగిత్యాల జైత్రయాత్ర నుంచి లాల్ గాడ్ వరకు విప్లవాన్ని విస్తరించిన విప్లవ శిఖరం మమతా బెనర్జీ అధికార దాహానికి, రాజ్యం కుట్రలకు బూటకం ఎన్కౌంటర్‌లో అమరత్వం చెందిన మల్లోజుల కోటేశ్వరరావు (అలియాస్) కిషన్ జి స్మృతి దిన జోహార్లు !

కిషన్ జీ అసలు పేరు మల్లోజుల కోటేశ్వరరావు. ఇతర పేర్లు కిషన్‌జీ, బిమల్, జయంత్, కోటన్న, మురళి, ప్రదీప్, ప్రహ్లాద్, రామ్‌జీ, శ్రీధర్ మరియు విమల్. విప్లవభావాలకు ప్రభావితమైన ఆయన.. న్యాయ విద్యను పూర్తి చేయకుండానే ఉద్యమంలోకి వెళ్లిపోయారు. సుధీర్ఘకాలం మావోయిస్టు పార్టీలో అగ్రనాయకత్వం లో పని చేశారు. కరీంనగర్ జిల్లా పెద్దపల్లి కిషన్‌జీ స్వగ్రామం. స్వాతంత్ర్య సమరయోధులైన మల్లోజుల వెంకటయ్య, మధురమ్మ దంపతులకు 1954 సెప్టెంబర్ 26 న కిషన్ జీ రెండో సంతానంగా జన్మించారు. పదో తరగతి వరకు పెద్దపల్లిలోనే చదివారు. ఎమర్జెన్సీ రోజుల్లో ఇంటర్మీడియెట్ పూర్తిచేశారు.కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కాలేజీలో బీకాం పూర్తి చేశారు. ఆ తర్వాత న్యాయవిద్యాభ్యాసంలో చేరినా.. దాన్ని పూర్తి చేయలేదు.



ఉద్యమ ప్రస్థానం...

ఎమర్జెన్సీ రోజుల్లో ఇంటర్మీడియెట్ పూర్తిచేసిన ఆయన అప్పటి పీపుల్స్‌వార్‌కు విద్యార్థి విభాగమైన రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ వ్యవస్థాపక సభ్యుడిగా పనిచేశారు. డిగ్రీ పూర్తైన తర్వాత..శ్రీకాకుళం నక్సల్బరీ పోరాటం ప్రభావంతో ఉద్యమంలోకి ప్రవేశించారు. శ్రీకాకుళం ఉద్యమం దెబ్బతిన్న తరువాత ఆంధ్రప్రదేశ్ లో నక్సల్బరీ రాజకీయాలని ప్రారంభించిన కొండపల్లి సీతారామయ్య యువసైన్యాన్ని తయారు చేశారు. అందులో... గణపతితో పాటు, కిషన్ జీ కూడా ముందు వరుసలో ఉన్నారు. శ్రీశ్రీ, చలసాని ప్రసాద్, వరవర రావు, కాళోజీ నారాయణరావు, ప్రొఫెసర్ జయశంకర్, కొండపల్లి సీతారామయ్య, కేజీ సత్యమూర్తిల ఆయనకు మంచి సాన్నిహిత్యం ఏర్పడింది. 1977 ప్రాంతంలో సిపిఐ ఎంఎల్ ఆంధ్రప్రదేశ్ శాఖ కార్యదర్శిగా ప్రహ్లాద పేరుతో కిషన్ జీ పనిచేశారు. 1977 జగిత్యాల జైత్రయాత్రలో బహిరంగ సభలో ప్రసంగించారు. కిషన్ జీ తమ్ముడు మల్లోజుల వేణుగోపాల్ కూడా ఉద్యమంలో ఉన్నారు. వేణుగోపాల్ సోను అలియాస్ భూపతి పేరిట మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులుగాను, దండకారణ్య ఇన్‌చార్జ్‌గానూ కొనసాగారు. ఇటీవల మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఆయన మహారాష్ట్ర ముఖ్యమంత్రి సమక్షంలో 60 మందితో లొంగిపోయారు.

మల్లోజుల వేణుగోపాల్ కేంద్ర కమిటీలో 28 ఏండ్లు, పొలిట్ బ్యూరోలో 18 ఏండ్ల సభ్యుడిగా ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఉద్యమం ఎదురొంటున్న వైఫల్యాలకు, భారీ నష్టాలకు నైతిక బాధ్యత వహిస్తూ, యావత్ పార్టీ క్యాడర్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పారు. ఇంతటి నష్టాలకు దారితీసిన నాయకత్వంలో కొనసాగడానికి అనర్హుడిని అని ప్రకటించారు. గతంలో దివంగత ప్రధానకార్యదర్శి కామ్రేడ్ బసవరాజు (నంబాల కేశవరావు) కూడా ప్రభుత్వంతో శాంతి చర్చల ప్రక్రియను ప్రారంభించారని, ఏప్రిల్ 2025 నాటికి ఈ నిర్ణయం అనివార్యమని భావించారని గుర్తు చేశారు.

కేంద్ర నాయకత్వ బాధ్యతలు

బెంగాల్‌లో 1974లో చారు మజుందార్ మృతి తరువాత పశ్చిమ బెంగాల్‌లో సీపీఐఎంఎల్ తీవ్ర నిర్బంధాన్ని ఎదుర్కొంది. ఆ సమయంలోనే ఉద్యమం దెబ్బతింది. అయితే ఆంధ్రప్రదేశ్, బీహార్, నేటి జార్ఖండ్, చత్తీస్ గఢ్ లలో మావోయిస్టు ఉద్యమం సాయుధ పోరాట రూపం తీసుకుంది. 1980ల తరువాత ఆదిలాబాద్, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉద్యమం వ్యాప్తికి పనిచేసిన కిషన్ జీ... తరువాత దండకారణ్యంలో ఉద్యమాన్ని తారాస్థాయికి తీసుకు వెళ్లారు. 1986-92 మధ్య నాటి పీపుల్స్‌వార్ పార్టీలో మొదటి తరం నేతలైన కొండపల్లి సీతారామయ్య వంటి వారితో విభేదిస్తూ... గణపతి, పులి అంజన్న, చెరుకూరి రాజ్ కుమార్ ఆలియాస్ ఆజాద్‌లతో పాటు పీపుల్స్ వార్ ను దేశవ్యాప్తంగా విస్తృతం చేసేందుకు విశేష కృషి చేశారు.

జంగల్ మహల్ ఉద్యమం..

1990 మొదట్లో పశ్చిమ బెంగాల్ లోని వివిధ నక్సల్ గ్రూపుల్లోని కేడర్... వారి విభాగాలను విభేదిస్తూ పీపుల్స్ వార్ లో చేరారు. దాంతో నక్సల్బరీ తరువాత బెంగాల్ లో అంతమైన నక్సలైట్ ఉద్యమం మళ్లీ చిగురించింది. నేపాల్ నుంచి ఆంధ్రప్రదేశ్ వరకు రెడ్ కారిడార్ ఏర్పాటు చేసుకోవాలన్న మావోయిస్టు వ్యూహరచనలో భాగంగా కిషన్‌జీ 21 ఏళ్లగా పశ్చిమబెంగాల్‌లో పార్టీ నిర్మాణాన్ని విస్తరింపజేశారు. జంగల్ మహల్ ఉద్యమంతో లక్షలాది మంది ఆదివాసీలను భూమిపై హక్కుల కోసం ఏకం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్, దంతెవాడ, జగ్దల్‌పూర్, బీజపూర్, ప్రాంతాలతో పాటు ఒడిశా, మహారాష్ట్రలోని గడ్చిరోలి, చంద్రపూర్, ప్రాంతాల్లో పార్టీ నిర్మాణంలో కిషన్‌జీ వ్యూహ రచనే కీలకంగా పనిచేసింది... జార్ఖండ్, బీహార్‌లో పార్టీకి సంబంధించిన క్యాడర్‌ను బలోపేతం చేయటంలో ఆయన ఎత్తుగడలు ఉపకరించాయి. 2005లో పీపుల్స్‌వార్‌ను మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ లో విలీనం చేయటంలోనూ కిషన్‌జీ ప్రధాన భూమిక పోషించారు. శత్రు నిర్మూలన పేరిట దేశంలో జరిగిన పలు దాడులకు సూత్రధారిగా వ్యవహరించారు. 1997లో పశ్చిమ బెంగాల్ లోని జంగల్ మహల్ ప్రాంతంలో మొదటి సాయుధ దళాన్ని పీపుల్స్‌వార్ ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి పశ్చిమబెంగాల్‌లో కిషన్‌జీ నాయకత్వంలోని పీపుల్స్ వార్ పార్టీ... వామపక్ష ప్రభుత్వానికి కొరకరాని కొయ్యలా మారింది. బెంగాల్ లో కేవలం సాయుధ పోరాటం రూపమే కాకుండా సాధారణ, మధ్య తరగతి ప్రజానీకాన్ని కూడా నాటి వామపక్ష ప్రభుత్వానికి వ్యతిరేకంగా కిషన్ జీ కూడగట్టారు. సింగూరు, నందిగ్రాం లాంటి ఉద్యమాల్లోనూ ప్రజలను సమీకరించడానికి కిషన్ జీ వ్యూహాలు కారణమయ్యాయి. లాల్‌గఢ్ హింస దేశ వ్యాప్తంగా పలువురి దృష్టిని ఆకర్షించి పాలకుల వెన్నులో వణుకు పుట్టించింది. తూర్పు మిడ్నాపూర్ జిల్లాలోని లాల్‌గఢ్‌లో పోలీసు, అధికార యంత్రాంగాన్ని తరిమికొట్టి ఆ ప్రాంతాన్ని విముక్తి ప్రాంతంగా ప్రకటించిన దానిలో మల్లోజుల కీలక పాత్ర పోషించారు. విప్లవపంథాపై ఆయనకు ఎనలేని విశ్వాసం ఉండేది.. ఎక్కడికైనా చొచ్చుకవెళ్లగలిగే చొరవ ఎంతటి పెద్ద టార్గెట్‌నైనా సునాయాసంగా పూర్తిచేయగలిగే సామర్థ్యం కిషన్ జీ సొంతం.. మావోయిస్టు ఉద్యమానికి టెక్నాలజీని కూడా జోడించింది ఆయనే అని చెబుతుంటారు. శాటిలైట్‌ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగంలోను మల్లోజులది అందవేసిన చెయ్యి. శాటిలైట్ ఫోన్లద్వారానే మీడియాకు ఫోన్ ఇంటర్వ్యూలు ఇచ్చిన సందర్భాలున్నాయి. ఒకచేత్తో గన్ను, మరోచేత్తో ల్యాప్‌టాప్‌తో తిరిగేవారని ఆయన్ను చూసినవారు చెబుతుంటారు.

పోలీసుల చేతిలో....మరణం

బెంగాల్-జార్ఖండ్ సరిహద్దుకు సమీపంలోని పశ్చిమ మిడ్నాపూర్ జిల్లాలోని అటవీ ప్రాంతాన్ని చుట్టుముట్టిన సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌లోని 1,000 మందికి పైగా సభ్యుల సహాయంతో కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్ (కోబ్రా) ఆపరేషన్‌లో కిషన్‌జీ 24 నవంబర్ 2011న చంపబడ్డాడు . రాత్రి 9:30 గంటల సమయంలో కిషన్‌జీ హత్యకు గురయ్యాడు. మృతదేహాన్ని తర్వాత మాజీ సహచరుడు సోమ మండి మరియు 2009లో బృందం బందీగా ఉంచిన అతింద్రనాథ్ దత్తా అనే పోలీసు అధికారి గుర్తించారు. అరెస్టయిన మావోయిస్టు తెలుగు దీపక్‌ను కూడా మృతదేహం గుర్తింపు కోసం పశ్చిమ మిడ్నాపూర్‌కు తీసుకువచ్చారు. కిషన్‌జీ మృతదేహాన్ని మొదట ఝర్‌గ్రామ్ ఆసుపత్రి మార్చురీకి తీసుకెళ్లారు మరియు పోస్ట్‌మార్టం పరీక్ష కోసం మిడ్నాపూర్ పోలీసు మార్చురీకి తరలించారు.మావోయిస్టు పార్టీ నేత మల్లోజుల కోటేశ్వరరావు ఎలియాస్ కిషన్ జీ ని చంపింది తమ ప్రభుత్వమే అని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ మేనల్లుడు, ఆపార్టీ ఎంపీ అభిషేక్ బెనర్జీ బైట పెట్టారు. కిషన్ జీ మరణానికి తమకు ఎలాంటి సంభంధంలేదన్న మమతా బెనర్జీ..పశ్చిమ మిడ్నాపూర్ జిల్లా బెల్పహారీలో ఓ బహిరంగ సభలో మాట్లాడుతూ అభిషేక్ కిషన్ జీ ని చంపడం తమ విజయమన్నారు.

24 నవంబర్ 2011 న మల్లోజుల కోటేశ్వర్ రావు పోలీసుల చేతిలో మరణించారు. కుటుంబం నుంచి కిషన్‌జీ మేనకోడలు దీపారావు, వరవరరావుతో కలిసి కిషన్ జి మృతదేహాన్ని గుర్తించి స్వగ్రామానికి తీసుకొచ్చారు. తన మేనమామ మృతదేహాన్ని చూసిన తర్వాత, జక్రాఖీ అతనిని భయంకరంగా హింసించిందని దీప ఆరోపించింది. మల్లోజులను పోలీసులే పట్టుకొని తీవ్ర చిత్రహింసలు పెట్టి చంపారని అప్పట్లో ప్రజా సంఘాలు ఆరోపణలు చేశాయి. కానీ ఈ ఆరోపణలను కొట్టి పడేసిన మమతాబెనర్జీ ఆయన ఎన్ కౌంటర్ లోనే చనిపోయారనే వాదనను వినిపించారు.ప్రభుత్వమే కిషన్ జీ ని హత్య చేసినట్టు తేలిందని సీపీఎం అభిప్రాయ పడింది.

- (మహమ్మద్ గౌస్ గారి వాల్ నుండి సేకరణ)

ఇల్లిల్లొక ఫ్లాటూనుగ ఎదిగే..

పగలూ రాత్రీ తేడా లేక
బీదా బిక్కీ బేధం మర్సి..
తల్లీ పిల్లని సూడకుండా
బాంబులు వేసే డాలర్దేగా..
అన్నార్థుల కడుపు గొట్టి
దోచిన శ్రమెల్లా కొల్లగొట్ట..
విశ్వ లంగ వేషాల్ వేస్తూ
ప్రపంచ గూండా నన్టవా..
సర్వ నిఘాల కళ్ళు గప్పి
నీ చుట్టూ ఆకాశాన్నంటే..
ఆయుధాల గిడ్డంగులు
కోట్ల కోట్లు పేర్చుకోవచ్చు..
ప్రపంచమంతా జల్లెడ పట్టి
అత్యాధునిక డ్రోన్లను తెచ్చి..
అడుగడుగూ కాపలా పెట్టి
నాకేమౌనని నిర్ర నీల్గవచ్చు..
ఏ దేశ పాలకుడ వైతేనేమి
ఎంత క్రూర ఫాసిస్టువైతేమీ..
పీడిత జనాగ్రహ జ్వాలల్లో
మాడి బూడిదన్నది చరిత..
పాలు దాపే కన్న తల్లులూ
అమ్మ వొళ్ళోని పిల్లలెల్లరు..
పిడికిలి బిగ గడుతున్నరూ
కడపోరుకు సై అంటున్నరు..
జంగల్ మహిళ జూలిప్పెను
ఇరాన్వనిత కుబుసమ్మిద్దే..
పీడన అంతం అయ్యేదాకా
రెప్పలువాల్చే ముచ్చట్లేదని..
సౌతీష్టంతా సైరన్ మోగెను
ఇల్లిల్లొక ఫ్లాటూనుగ ఎదిగే..
దొంగ దాడుల తిప్పి కొట్టగా
దేశ రక్షణకు సింహాలయ్యిరి..

ఇక్బాల్
9440775732

రహదారులపై ధాన్యం ఆరబోత.. ప్రమాదాలకు ఆహ్వానం.. రైతులకూ తీరని నష్టం

పంట చేతికొచ్చే సమయం రైతులకు ఆనందాన్ని కలిగించాల్సిన సందర్భం. నెలల తరబడి శ్రమించి, పెట్టుబడులు పెట్టి, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని పండించిన పంట ఇంటికి చేరే సమయంలో అన్నదాతలు సంతోషంగా ఉండాలి. కానీ ప్రస్తుతం పంట కోతల సమయంలో రహదారులపై ధాన్యం ఆరబెట్టే పద్ధతి రైతులకు, వాహనదారులకు కొత్త సమస్యలను సృష్టిస్తోంది. దేశవ్యాప్తంగా నవంబరు--డిసెంబరు, ఏప్రిల్--మే నెలల్లో ప్రధాన పంటల కోతలు పూర్తవుతుంటాయి. ఈ సమయంలో గ్రామీణ రహదారుల నుంచి ప్రధాన రహదారుల వరకు ఎక్కడ చూసినా ధాన్యం రాశులు, ఆరబోసిన పంట కనిపిస్తుంటుంది. ముఖ్యంగా ఇరుకైన రహదారులపై కిలోమీటర్ల మేర ధాన్యాన్ని పరిచి ఉంచడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు దారి లేకపోవడం, ధాన్యంపై వాహనాల టైర్లు జారిపోవడం ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఒకవైపు రైతుల పంటకు భద్రత లేకపోవడం, మరోవైపు ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు ఏర్పడటం ఆందోళనకర పరిణామం.

గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అవసరాల కోసం రహదారులను వినియోగించడం అనాదిగా కొనసాగుతున్నప్పటికీ, పెరుగుతున్న వాహనాల సంఖ్య, వేగవంతమైన రవాణా వ్యవస్థ నేపథ్యంలో ఈ పద్ధతి తీవ్ర సమస్యగా మారుతోంది. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆర్టీసీ బస్సులు, సరుకు రవాణా వాహనాలు ఒకే రహదారిపై ప్రయాణించే పరిస్థితుల్లో ధాన్యం ఆరబెట్టడం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో ధాన్యం రాశులు కనిపించకపోవడం, ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇవ్వడానికి ప్రయత్నించే క్రమంలో వాహనదారులు నియంత్రణ కోల్పోవడం ప్రాణాంతక ఘటనలకు దారితీస్తోంది. యువత, ఉద్యోగులు, విద్యార్థులు, రైతు కుటుంబాలకు చెందిన వారు ఇలాంటి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం లేదా తీవ్రంగా గాయపడటం విషాదకరం. వాహనాల మరమ్మతులు, వైద్య ఖర్చులు, ఆస్తి నష్టాలు కుటుంబాల ఆర్థిక పరిస్థితిని కూడా దెబ్బతీస్తున్నాయి.

రైతుల అవసరం.. రహదారులపై భారంగా మారుతున్న సంప్రదాయం

భారతదేశం ప్రపంచంలో ప్రధాన వరి ఉత్పత్తి దేశాల్లో ఒకటిగా కొనసాగుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు పశ్చిమ బెంగాల్, పంజాబ్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో వరి సాగు విస్తృతంగా జరుగుతోంది. మార్కెట్లో సన్నరకాల ధాన్యానికి పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో రైతులు వాటి సాగుపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. అయితే కోత అనంతరం ధాన్యంలో తేమ శాతాన్ని తగ్గించడం అత్యంత కీలకం. సాధారణంగా ధాన్యంలో తేమ 17 శాతం లోపు ఉండేలా ఆరబెట్టాల్సిన అవసరం ఉంటుంది. ఈ నేపథ్యంలో కోత పూర్తయిన వెంటనే ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. తగినంత విస్తీర్ణంలో కల్లాలు లేకపోవడం, ఆధునిక ఆరబెట్టే యంత్రాలు అందుబాటులో లేకపోవడం, వాటిని వినియోగించేందుకు అయ్యే ఖర్చును భరించలేకపోవడం వంటి కారణాలతో రైతులు రహదారులనే ప్రత్యామ్నాయంగా ఎంచుకుంటున్నారు. ఇది రైతుల ఉద్దేశపూర్వక నిర్లక్ష్యం కంటే మౌలిక సదుపాయాల కొరతతో ముడిపడిన సమస్యగా చూడాలి. అయితే రైతుల ఇబ్బందులను అర్థం చేసుకోవడంతో పాటు ప్రజల ప్రాణ భద్రతను కూడా ప్రభుత్వాలు సమానంగా పరిగణించాలి. రహదారులపై ధాన్యం ఆరబెట్టడం వల్ల వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడటమే కాకుండా, వాహనాల టైర్ల కింద గింజలు నలిగిపోవడం, దుమ్ము, మట్టి, ఇతర వ్యర్థాలు కలవడం వల్ల ధాన్యం నాణ్యత కూడా తగ్గుతుంది. అకస్మాత్తుగా వర్షాలు కురిసినప్పుడు రోజుల తరబడి కష్టపడి పండించిన పంట తడిసి రైతులకు అదనపు నష్టం కలుగుతోంది. అంటే ఈ విధానం రైతులకు శాశ్వత పరిష్కారం కాకుండా రెండు విధాలుగా నష్టాన్ని కలిగిస్తోంది.

రైతుకు నాలుగు వైపులా నష్టాలే.. రెక్కల కష్టం రహదారిపాలు!

రహదారులపై ధాన్యం ఆరబెట్టడం వల్ల ప్రమాదాల ముప్పు మాత్రమే కాకుండా



రైతులు అనేక రకాల ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి పొలంలో శ్రమించి, పెట్టుబడులు పెట్టి, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, సాగునీరు, కూలీల ఖర్చులు భరించి పండించిన పంట చివరి దశలో నష్టపోవడం అన్నదాతలకు తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు పంట కోత అనంతర దశ అత్యంత కీలకం. ఈ సమయంలో ధాన్యాన్ని సురక్షితంగా ఆరబెట్టడం, నిల్వ చేయడం, విక్రయించడం వంటి అంశాల్లో ఎదురయ్యే సమస్యలు వారి ఆదాయంపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి.

రహదారులపై ధాన్యం ఆరబెట్టే క్రమంలో వాహనాల టైర్ల కింద గింజలు నలిగిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ధాన్యం దుమ్ము, ఇసుక, మట్టి, ఇతర వ్యర్థాలతో కలిసిపోవడం వల్ల నాణ్యత తగ్గుతోంది. రహదారులపై తిరిగే వాహనాల నుంచి వెలువడే పొగ, దుమ్ము కూడా ధాన్యాన్ని కలుషితం చేసే ప్రమాదం ఉంది. నాణ్యత తగ్గిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో నిర్దేశిత ప్రమాణాల ప్రకారం స్వీకరించకపోవచ్చు. తేమ శాతం ఎక్కువగా ఉన్నా, ధాన్యంలో మట్టి, చెత్త, ఇతర కల్తీలు ఉన్నా రైతులు శుభ్రపరిచేందుకు అదనపు ఖర్చు చేయాల్సి వస్తుంది. కొన్నిసార్లు తక్కువ ధరకు విక్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దీంతో రైతు ఆశించిన ఆదాయానికి గండి పడుతోంది.

మరోవైపు అకాల వర్షాలు రైతుల కష్టాన్ని ఒక్కసారిగా నీరుగారుస్తున్నాయి. రహదారులపై ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసినప్పుడు తిరిగి ఆరబెట్టాల్సి వస్తుంది. ఈ ప్రక్రియలో కూలీల ఖర్చు, రవాణా ఖర్చు, సమయం పెరుగుతాయి. ధాన్యం ఎక్కువసేపు తడిగా ఉండటం వల్ల రంగు మారడం, మొలకలు రావడం, బూజు పట్టడం, నాణ్యత తగ్గడం వంటి సమస్యలు తలెత్తుతాయి. కొన్నిసార్లు పంటను తక్కువ ధరకు విక్రయించాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఒకవేళ వర్షం రాత్రివేళ కురిస్తే ధాన్యాన్ని సకాలంలో కాపాడుకోవడం కూడా కష్టమవుతుంది. ఆ సమయంలో రైతు కుటుంబ సభ్యులంతా నిద్రను పక్కనపెట్టి ధాన్యాన్ని కాపాడుకునేందుకు శ్రమించాల్సి వస్తోంది. ధాన్యం ఆరబెట్టేందుకు సరైన కల్లాలు లేకపోవడంతో రైతులు పంటను ఒకచోట నుంచి మరోచోటకు తరలించాల్సి వస్తోంది. దీనివల్ల ట్రాక్టర్లు, ఆటోలు, ఇతర వాహనాల అద్దెలు పెరుగుతున్నాయి. పంటను ఆరబెట్టడం, తిరగేయడం, కుప్పలుగా వేయడం, మళ్లీ పరచడం వంటి పనులకు అదనపు కూలీలు అవసరమవుతున్నారు. ఇప్పటికే వ్యవసాయ కూలీల కొరత, పెరుగుతున్న కూలి రేట్లతో ఇబ్బందులు పడుతున్న రైతులకు ఇది మరో భారంగా మారుతోంది. చిన్న రైతులు తమ కుటుంబ సభ్యుల శ్రమతోనే ఈ పనులు నిర్వహించాల్సి వస్తోంది. పంటను కాపాడుకోవడానికి రోజంతా రహదారులపైనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

ఇంకొక ముఖ్యమైన సమస్య తూకంలో, విక్రయ ధరలో ఏర్పడే నష్టం. ధాన్యం రహదారులపై ఎక్కువసేపు ఉండటం వల్ల గింజలు నలిగిపోవడం, గాలికి కొట్టుకుపోవడం, దుమ్ముతో కలిసిపోవడం జరుగుతుంది. తడిసిన ధాన్యాన్ని తిరిగి ఆరబెట్టే సమయంలో కూడా కొంత నాణ్యత తగ్గే అవకాశం ఉంది. కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం, నాణ్యత ప్రమాణాల కారణంగా ధాన్యాన్ని తిరిగి తీసుకెళ్లాలని సూచిస్తే రైతులకు రవాణా, నిల్వ, మళ్లీ ఆరబెట్టే ఖర్చులు తప్పవు. ఈ ఆలస్యం కారణంగా మార్కెట్లో ధరలు మారినా రైతు వెంటనే విక్రయించలేని పరిస్థితి ఏర్పడుతుంది. అవసరాల కోసం అప్పులు తీసుకున్న రైతులు చివరకు వచ్చిన ధరకు పంటను విక్రయించాల్సి వస్తోంది. పంట చేతికొచ్చిన వెంటనే కుటుంబ అవసరాలు, వ్యవసాయ రుణాలు, విత్తనాలు, ఎరువుల బకాయిలు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు తీర్చాల్సిన బాధ్యత రైతుపై ఉంటుంది. ధాన్యం కొనుగోలు ఆలస్యమైతే ఈ అవసరాలన్నీ వాయిదా పడతాయి. అప్పులపై వడ్డీ పెరుగుతుంది. తదుపరి పంటకు పెట్టుబడి సమకూర్చుకోవడం కూడా కష్టమవుతుంది. ఒక పంటలో వచ్చిన నష్టం మరో పంట సాగుపై ప్రభావం చూపుతుంది. ఈ విధంగా పంట ఆరబెట్టేందుకు సరైన సదుపాయాలు లేకపోవడం రైతు కుటుంబ ఆర్థిక స్థిరత్వాన్నే దెబ్బతీస్తోంది.

గణాంకాలు చెబుతున్న పంట నష్టాల తీవ్రత

రైతులు ఎదుర్కొంటున్న పంట కోత అనంతర నష్టాలను గణాంకాల కోణంలో పరిశీలిస్తే సమస్య తీవ్రత అర్థమవుతుంది. కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నాబార్డు కన్సల్టెన్సీ సర్వీసెస్ నిర్వహించిన 2022 అధ్యయనం ప్రకారం వరి పంటలో వ్యవసాయ స్థాయి కార్యకలాపాల్లో 4.16 శాతం నష్టం నమోదవుతోంది. మార్కెట్ స్థాయిలో మరో 0.61 శాతం నష్టం కలుస్తోంది. ఈ రెండు దశలను కలిపితే వరి పంట కోత



ముళ్లపొదల మధ్య బతుకులు

సొంత స్థలం లేక గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అనుమతితో బీడు పాలంలో గుడిసెలు వేసుకున్నారు. చిరిగిన టార్పాలిన్లు, తడికెలే వారి నివాసాలు. వర్షాకాలంలో నీరు చేరడం, చుట్టూ విషసర్పాల సంచారంతో బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. పురిటి నొప్పలొచ్చినా, కుటుంబంలో మరణం సంభవించినా ఆ గుడిసెలే దిక్కవుతున్నాయి.

పురిటి నొప్పలొచ్చినా.. పాడె మోయాల్సి వచ్చినా...

పూరి గుడిసెలే దిక్కు

■ భిక్షాటన వదిలి శ్రమిస్తున్నా.. నిలువ నీడ కరువు ■ నాలుగేళ్లుగా రోడ్డు పక్కనే దుర్భర జీవనం

యాలాల, నవంబర్ 24 (జనంసాక్షి): భిక్షాటన వృత్తిని వదిలి శ్రమించి బతుకుతున్న బుడిగ జంగాల కుటుంబాలకు కనీసం నిలువ నీడ కూడా కరువైంది. అచ్చంపేట ప్రాంతం నుంచి వలస వచ్చిన 10 నుంచి 15 కుటుంబాలు వికారాబాద్ జిల్లా యాలాల మండలం అగ్గనూరు గ్రామ శివారులో రోడ్డు పక్కన పూరిగుడిసెల్లో నాలుగేళ్లుగా దుర్భర జీవనం సాగిస్తున్నాయి.

భిక్షాటన మాని.. చిరు వ్యాపారాలు

తెల్లవారుజామునే నిద్రలేచి కుటుంబాలతో గ్రామాలు తిరుగుతూ బ్యాగులు, కీచైన్లు, గ్యాస్ స్టవ్‌లు, చీపుర్లు, చాపలు విక్రయిస్తున్నారు. వచ్చిన కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాలను పోషించుకుంటున్నారు. అయినా ప్రభుత్వ గృహ పథకాలు, కనీస సౌకర్యాలు వారికి అందడం లేదు.

నాయకులకు కనిపించని పేదల కష్టాలు

ప్రధాన రహదారి పక్కనే గుడిసెలు ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రచారానికే పరిమితమయ్యే కొన్ని స్వచ్ఛంద సంస్థలు కూడా నిజమైన నిరుపేదల దీనస్థితిని గుర్తించడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ కుటుంబాలకు శాశ్వత గృహ వసతి కల్పించాలని, అర్హత మేరకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని ప్రజలు కోరుతున్నారు. శ్రమించి బతుకుతున్న కుటుంబాలకు కనీసం ఒక గూడు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

సామాన్యుల కష్టాలు తెలిసిన బిడ్డను..

వికారాబాద్‌ను అభివృద్ధి చేస్తా!

రూ.3,500 కోట్లతో అభివృద్ధి పనులు

■ మరో రూ.4,500 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక
■ స్పీకర్‌గా నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నా
■ మంత్రి పదవి ఇస్తే మరింత అభివృద్ధి చేస్తా: గడ్డం ప్రసాద్‌కుమార్



బంట్వారం, నవంబర్ 24 (జనంసాక్షి): పాలమ్ముకునే పాల ఎల్లమ్మ కడుపున పుట్టిన తనకు సామాన్యుల కష్టాలు, బాధలు తెలుసని అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. ప్రజల ఆశీర్వాదంతో ఎంపీటీసీ స్థాయి నుంచి స్పీకర్‌గా ఎదిగానని, నియోజకవర్గ అభివృద్ధితో పాటు అసెంబ్లీ నిర్వహణలోనూ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నానని తెలిపారు. స్పీకర్‌గా రెండున్నరేళ్ల పదవీకాలం పూర్తయిన సందర్భంగా 'జనంసాక్షి'తో మాట్లాడారు. వికారాబాద్ నియోజకవర్గంలో రూ.3,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఇందులో రూ.670 కోట్లతో ఆర్‌అండ్‌బీ రహదారులు, రూ.200 కోట్లతో పంచాయతీరాజ్ రహదారులు, హామ్ పథకం కింద రూ.300 కోట్ల పనులు చేపట్టామన్నారు. రూ.1,200 కోట్లతో అనంతగిరిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని, హైదరాబాద్-మన్నెగూడ రహదారి పనులు తుది దశకు చేరుకున్నాయని చెప్పారు. వికారాబాద్ రైల్వే ఫ్లైఓవర్, పరిగి రహదారి విస్తరణకు రూ.100 కోట్ల చొప్పున, మెడికల్ కళాశాలకు రూ.200 కోట్లు, మర్పల్లిలో పబ్లిక్ స్కూల్‌కు రూ.50 కోట్లు, కోట్‌పల్లి అభివృద్ధికి రూ.97 కోట్లు, వికారాబాద్-తాండూరు రహదారికి రూ.50 కోట్లు కేటాయించామని వివరించారు. విద్యుత్ ఉపకేంద్రాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కూడా చేపడుతున్నామన్నారు. నియోజకవర్గానికి మరో రూ.4,500 కోట్లతో అభివృద్ధి ప్రతిపాదనలు పంపామని, రైల్వే అండర్‌పాస్‌ల నిర్మాణం, ప్రధాన రహదారులను నాలుగు లేన్లుగా విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మర్పల్లి, మోమిన్‌పేట, శంకర్‌పల్లి, తాండూరు ప్రాంతాలను కలిపే రహదారుల అభివృద్ధిపైనా దృష్టి సారించామన్నారు. స్పీకర్‌గా రాజకీయ పక్షపాతంతో వ్యవహరిస్తున్నాననే ఆరోపణల్లో నిజం లేదని, అసెంబ్లీలో ప్రతి సభ్యుడికి మాట్లాడే అవకాశం కల్పిస్తూ పదవి హుందాతనాన్ని కాపాడుతున్నానని చెప్పారు. గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉందని, మరోసారి మంత్రి పదవి అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు. నామినేటెడ్ పదవులను అర్హత, పనితీరు ఆధారంగానే కేటాయిస్తున్నామని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించే అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని, తన సొంత ట్రస్టు ద్వారా ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

అక్రమ భవనంలో ''అనుమతి'' లేని పాఠశాల

చర్యలు తీసుకోవాలని ప్రజావాణిలో ఫిర్యాదు





రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) : షాద్ నగర్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇంటి నిర్మాణం చేపట్టిన ఓ భవనంలో ఓ ప్రైవేట్ పాఠశాలను కొనసాగిస్తున్నారని పాఠశాలను నడిపేందుకు బిల్డింగ్ అనుమతులు లేకుండా కొనసాగిస్తున్న ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ కే.కిరణ్మయికి షాద్ నగర్ పట్టణానికి చెందిన దామోదర్ యాదవ్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు గతంలో ఈ విషయంపై పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు పాఠశాలను నడిపేందుకు బిల్డింగ్ అనుమతి తీసుకోకుండా నడుపుతున్న పాఠశాలలో విద్యార్థులకు ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు బిల్డింగ్ లో పాఠశాలను నడిపేందుకు అనుమతులు తీసుకోకుండా కృష్ణవేణి టాలెంట్, పాఠశాలను కొనసాగిస్తున్నారని ఆ పాఠశాలపై వెంటనే సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు అదే విధంగా నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేటు పాఠశాలలపై విద్యాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు..

విచారణ చేపట్టాం సీజ్ చేస్తాం
మండల విద్యాధికారి, టి. మనోహర్

ఇంటి నిర్మాణానికి అనుమతి తీసుకొని అదే బిల్డింగ్ లో, ప్రైవేట్ పాఠశాలను కొనసాగిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని విచారణ చేస్తున్నామని త్వరలోనే పాఠశాలను సీజ్ చేసి చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి టి. మనోహర్ తెలిపారు...

అదనపు కట్నం కోసం భార్యకు వేధింపులు.. ఆరుగురిపై కేసు నమోదు

భద్రాచలం నవంబరు 24 (జనంసాక్షి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- అదనపు కట్నం తీసుకురావాలంటూ భార్యను శారీరకంగా, మానసికంగా వేధించిన ఘటన భద్రాచలం పట్టణంలోని కొర్రాజుల గుట్టలో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు భర్తతో పాటు కుటుంబ సభ్యులు మొత్తం ఆరుగురిపై భద్రాచలం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కొర్రాజులగుట్టకు చెందిన దేవళ్ల కుమారి తన భర్త లెల్లూరి నరసింహాచారి, అత్త నర్సమ్మ, ఆడపడుచులు నాగేంద్ర, జ్యోతి, ఉమ, జ్యోతి భర్త గోవిందాచారిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త తల్లి, సోదరీమణుల ప్రోద్బలంతో అదనపు కట్నం కోసం తనను కొడుతూ, దూషిస్తూ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ వైర్లు తాకి యువకుడు మృతి

కొండపాక,నవంబర్, 24:(జనం సాక్షి) : సిద్దిపేట జిల్లా కొండపాక మండలం దుద్దెడ గ్రామాల్లో మంగళవారం విషాదకర సంఘటన చోటుచేసుకుంది. చిన్నకోడూరు గ్రామానికి చెందిన చెరుకు నాగరాజు (25) తొలిసారిగా (కన్నె స్వామి) అయ్యప్ప స్వామి మాల వేసుకున్నాడు. అతని సొంత అన్న చెరుకు కనకరాజు గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం అయ్యప్ప మాల వేసుకుంటూ దుద్దెడలో నివాసం ఉండి, అక్కడే సన్నిధానం ఏర్పాటు చేసుకొని చేసుకుంటుండడంతో నాగరాజు కూడా అతని అన్న ఇంటికి వచ్చి అయ్యప్ప స్వామి దీక్షను కొనసాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కార్తీక మాసం పౌర్ణమి పురస్కరించుకొని ఇంటిలో సత్యనారాయణ వ్రతము, అయ్యప్ప స్వాములకు భిక్ష కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు. వచ్చినవారికి సౌకర్యంగా ఉండడం కోసం ఇంటిముందు టెంటు వేస్తున్న క్రమంలో ఇనుప పైపులు ఇంటి ముందు ఉన్న విద్యుత్ వైర్లకు తగలడంతో నాగరాజు విద్యుత్ ఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని సిద్దిపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. తొలిసారిగా అయ్యప్ప మాల వేసుకుని శబరిమలకు వెళ్లి తన మొక్కలు చెల్లించుకుంటాడు అనుకున్న అతని కుటుంబ సభ్యులు నాగరాజు కరెంటు షాక్‌తో చనిపోడాన్ని జీర్ణించుకోలేక శోకసముద్రంలో మునిగిపోయారు. నిన్న మొన్న అతనితోపాటు కలిసి ఉన్న అయ్యప్ప స్వాములు సైతం కన్నీళ్ల పర్యంతమయ్యారు.

కంపుకొడుతున్న నల్లచెరువు ట్యాంక్ బండ్



దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు.. నీరు కలుషితమై మత్స్యకారుల ఉపాధికి నష్టం

జడ్చర్ల, నవంబర్ 24 (జనంసాక్షి): కావేరమ్మపేటలోని నల్లచెరువు ట్యాంక్ బండ్ అపరిశుభ్రత, దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఈ చెరువు మెట్ల వద్ద, తీరంలో ప్లాస్టిక్, చెత్తాచెదారం పేరుకుపోయింది. పండుగలు, వ్రతాలు, పూజల అనంతరం పూజా సామాగ్రి, నిమజ్జన విగ్రహాల వ్యర్థాలను నీటిలో వేయడంతో దుర్వాసన వస్తోంది. కొందరు తాగి పడేసిన బీరు సీసాలు నీటిపై తేలుతూ, ఒడ్డున పగిలి ప్రమాదకరంగా మారాయి. నీరు కలుషితమవుతుండటంతో దీనిపై ఆధారపడ్డ కావేరమ్మపేట మత్స్యకారుల ఉపాధికి, చేపల పెంపకానికి నష్టం వాటిల్లుతోంది. దోమల బెడదతో విషజ్వరాల ముప్పు పొంచి ఉంది. ట్యాంక్ బండ్ నిర్వహణను అధికారులు గాలికి వదిలేయడంపై స్థానికులు, మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే చెత్త, మద్యం సీసాలను తొలగించి, వ్యర్థాలు వేయకుండా నిఘా పెట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్

■ డైవర్షన్ రాజకీయాలకు ప్రాధాన్యత: మన్నె గోవర్ధన్ రెడ్డి



ఖైరతాబాద్, నవంబర్ 24 (జనం సాక్షి) : తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లిం చేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. మంగళవారం బంజారా హిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడి యాతో ఆయన మాట్లాడారు. 24 గంటలూ కష్టప డుతున్నామని చెప్పుకుంటున్న ప్రభుత్వ పెద్దలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ఎందుకు కృషి చేయడం లేదని ప్రశ్నించారు.గతంలో తెలంగాణ లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేదని, ప్రస్తుతం మూడు గంటల విద్యుత్ అందించేందుకు కూడా ప్రభుత్వం ఇబ్బందులు పడుతోందని విమర్శించా రు.ఏడాది పొడవునా నీటితో కళకళలాడిన చెరువులు నేడు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఆటో డ్రైవర్లకు ఆర్థిక సహాయం అందిస్తా మని హామీ ఇచ్చిన ప్రభుత్వం,మరోవైపు రైతులకు యూరియా అందుబాటులో ఉంచడంలో విఫలమైందని ఆరోపించారు.గ్రామాల్లో ధాన్యం కొను గోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటిని పట్టించుకునే వారే లేరని మండిపడ్డారు. మూడేళ్లుగా 24 గంటలూ పని చేస్తున్నామని చెప్పుకుంటున్న పాలకులు ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాకుండా, ఆంధ్రప్రదేశ్‌కు నీటిని విడుదల చేయడం, ఇసుక దందాలు, కమీషన్ల పంపకాలు,ఢిల్లీకి మూటలు మోసుకెళ్లడంలోనే శ్రమిస్తున్నారా అని ప్రశ్నించారు.ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకు నేందుకే డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నా రని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని, సాగర్‌కు వెళ్లి పల్నాడు గ్రిడ్ పనులను అడ్డుకోవడంపై ఆలోచించడం కంటే రాష్ట్ర ప్రయోజనాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు వారి సమస్యలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

■ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలి
■ మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు పిలుపు



హయత్‌నగర్, నవంబర్ 24 (జనంసాక్షి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం కమ్యూ నిస్టు భావజాలంతో ప్రజలతో మమేకమై నిరంతరం ఉద్యమాలు నిర్వహించాలని మాజీ ఎమ్మెల్సీ, మాజీ సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బంగారు తెలంగాణ పేరుతో అవినీతికి పాల్పడిందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా హామీల అమలులో విఫలమవుతోందని విమర్శించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు ఏర్పడిందని, మతతత్వ రాజకీయాలతో ప్రజల మధ్య విభజన సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఎస్ఐఆర్ పేరుతో ముస్లింలు, బీజేపీ వ్యతిరేకుల ఓట్ల తొలగింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. దళితులు, గిరిజనులు, మహిళలపై దాడులను అరికట్టడంలో బీజేపీ పాలిత రాష్ట్రాల ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేసి ప్రజల విశ్వాసాన్ని పొందాలని డిమాండ్ చేశారు. రైతులు కరువు, పంట దిగుబడుల తగ్గుదల, గిట్టుబాటు ధరల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడంతోపాటు సన్న వడ్లకు ప్రకటించిన బోనస్ చెల్లించాలని కోరారు. 355 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించినా బాధితులకు పంట నష్టపరిహారం, ఆర్థిక సాయం అందకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి చర్యలు తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు.

ఫ్యూచర్ సిటీ, మూసీ ప్రక్షాళన పేరుతో అనాలోచితంగా ప్రజాధనం ఖర్చు చేయడం సరికాదన్నారు. మూసీ ప్రక్షాళనతోపాటు గోదావరి జలాలను జిల్లాలకు అందించడానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కేంద్రం తెలంగాణకు నిధుల కేటాయింపులో వివక్ష చూపుతోందని ఆరోపిస్తూ, రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులు, హక్కుల సాధన కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. కృష్ణా జలాల్లో రాష్ట్ర వాటాను సాధించడంతోపాటు కాళేశ్వరం, పెండింగ్ ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని చెరుపల్లి డిమాండ్ చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

షాబాద్, నవంబర్ 24(జనం సాక్షి);

షాబాద్ పైల్వాన్ చెరువులో గుర్తుతెలియని పురుషుడి మృతదేహం నీటిపై తేలియాడుతూ ఉన్న సంఘటన మంగళవారం షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా, చెరువులో ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలియాడుతూ కనిపించింది.మృతుడి వయస్సు సుమారు 50 నుండి 55 సంవత్సరాల మధ్య ఉండవచ్చని, అతను తెలుపు రంగు ప్యాంటు మరియు తెలుపు రంగు చెక్స్ డిజైన్ కలిగిన చొక్కా ధరించి ఉన్నట్లు గుర్తించారు. మృతుడి గుర్తింపును తెలుసుకోవడానికి స్థానిక ప్రజలను మరియు చుట్టుపక్కల వారిని విచారించగా, ఎవరికీ అతని వివరాలు తెలియరాలేదు. అనంతరం గుర్తుతెలియని మృతదేహాన్ని తదు పరి వైద్య మరియు చట్టపరమైన చర్యల నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించ డం జరిగింది. ఈ ఘటనపై షాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, మృతుడి గుర్తింపు మరియు అతని మరణానికి గల కారణాలు, పరిస్థితులపై దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

పై వివరాలకు సంబంధించిన వ్యక్తి ఎవరికైనా తెలిసినట్లయితే లేదా తమ కుటుంబ సభ్యులు, బంధువులు ఎవరైనా కనిపించకుండా పోయి ఉంటే, మృతుడి వివరాలను సరిపోల్చుకొని వెంటనే షాబాద్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించ వలసిందిగ పోలీసులు కోరారు.



కరీంనగర్‌లో ఫ్లేవర్స్ ఆఫ్ ఆంధ్ర 23వ శాఖ ప్రారంభం

కరీంనగర్ టౌన్, నవంబర్ 24, (జనంసాక్షి): హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఆంధ్ర వంటకాల రెస్టారెంట్ సంస్థ ఫ్లేవర్స్ ఆఫ్ ఆంధ్ర తన 23వ శాఖను కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి ప్రత్యూష ప్లాజాలో ఆదివారం ఘనంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల కవిత చంద్రశేఖర్, పురమల్ల శ్రీనివాస్ పాల్గొని రెస్టారెంట్‌ను ప్రారంభించారు. కరీంనగర్ నగరంలో సంస్థకు ఇదే తొలి శాఖ ఆంధ్ర సంప్రదాయ వంటకాలతో పాటు తెలంగాణ ప్రత్యేక రుచులను కూడా వినియోగదారులకు అందించేందుకు రెస్టారెంట్‌లో ప్రత్యేక మెనూను సిద్ధం చేశారు. గోంగూర మటన్, రాజుగారి కోడి పులావ్, భీమవరం చిట్టి రొయ్యల వేపుడు, నాటుకోడి పులుసు, నల్లి ఫోష్ బిర్యానీ వంటి ఆంధ్ర ప్రత్యేక వంటకాలతో పాటు నాటుకోడి పులుసుతో రాగి సంగటి, బగారా అన్నంతో అంకాపూర్ నాటుకోడి కూర, తెలంగాణ మాంసం కూర, మానేరు చేపల పులుసు వంటి తెలంగాణ వంటకాలను అందుబాటులో ఉంచారు. ఆదివారాల్లో మటన్ తలకాయ ఫ్రై ప్రత్యేకంగా అందించనున్నారు. ప్రతిరోజూ మెనూలో లేని ప్రత్యేక వంటకాన్ని చెఫ్ తయారు చేయడం మరో విశేషం. ఈ సందర్భంగా సంస్థ సీఈఓ బి.ఎస్.వి.కె. రాజు మాట్లాడుతూ కరీంనగర్ తమకు ముఖ్యమైన నగరమని, ఇక్కడి కుటుంబాలకు అసలైన ఆంధ్ర రుచులతో పాటు తెలంగాణ వంటకాలను సరసమైన ధరల్లో అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఫ్రాంచైజీ యజమాని అక్షయ్ మాట్లాడుతూ తెలుగు సంప్రదాయ వంటకాలు, కుటుంబ విందులు, వేడుకలకు తమ రెస్టారెంట్ మంచి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. రెస్టారెంట్‌లో డైన్-ఇన్, పార్టీ బుకింగ్‌లు, అవుట్‌డోర్ క్యాటరింగ్ సేవలు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు. సంస్థ యజమానులు నడిమెట్ల గణేష్, నడిమెట్ల అక్షయ్, ఫ్రాంచైజర్ భూపతి రాజు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నల్లమల్లకు ఆధ్యాత్మిక, పర్యాటక శోభ!





మద్దిమడుగులో రూ.100 కోట్లతో సేవాలాల్ మహారాజ్ భారీ విగ్రహం

■ రూ.20 కోట్లతో ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి
■ ఈ నెల 26న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపనలు
■ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

అచ్చంపేట, నవంబర్ 24 (జనంసాక్షి): నల్లమల్ల అటవీ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక రంగాల్లో ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని మద్దిమడుగులో రూ.100 కోట్లతో శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ భారీ విగ్రహం, భవన నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 26న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా తొలి విడతలో రూ.38 కోట్ల పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. మంగళవారం ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ రాజేశ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి మద్దిమడుగును సందర్శించి సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. సభా ప్రాంగణం, పార్కింగ్, రవాణా, భద్రత, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై అధికారులకు సూచనలు చేశారు. లంబాడీ గిరిజనుల ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహారాజ్ విగ్రహ నిర్మాణం పూర్తయితే మద్దిమడుగుకు జాతీయస్థాయిలో ఆధ్యాత్మిక గుర్తింపు లభిస్తుందని, పర్యాటకుల రాకతో స్థానికులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ అంజనేయస్వామి దేవస్థాన అభివృద్ధికి రూ.20 కోట్లు కేటాయించామని, ఈ పనులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమన్నారు. సీఎం పర్యటనలో భాగంగా అచ్చంపేటలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ గతంలో అమలైన సంక్షేమ పథకాలను కొనసాగిస్తూ కొత్త కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. వెనుకబడిన అచ్చంపేట నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, రైతులకు సాగు నీటి వసతి కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ నెల 26న జరిగే బహిరంగ సభకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు దేవరకొండ ప్రాంత ప్రజలు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మంత్రి కోరారు. అనంతరం మంత్రితో పాటు ఎమ్మెల్యేలు మద్దిమడుగు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. చెన్న య్య, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

నేను ఈరవేని ప్రణయ్ కుమార్, తండ్రి గంగన్న, నివాసం ఇంటి నెం. 4-6-259, మంచినీళ్ల బావి, జగిత్యాల. మా పాత ఇంటిని కూల్చివేసి, తేదీ 11-10-2026న ఇంటి సామాన్లు మరో అద్దె ఇంటికి తరలించే క్రమంలో నా పాస్‌పోర్ట్ నెం. ఛీ 5016850 ఎక్కడో పోయినది. ఎంత వెతికినా దొరకలేదు.ఎవరికైనా నా పాస్‌పోర్ట్ దొరికినట్లయితే దయచేసి 9000644527 నంబర్‌కు ఫోన్ చేసి అందించగలరు. తగిన పారితోషికం ఇవ్వబడును.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
25 నవంబర్ 2026

మంత్రి జూపల్లిపై ఆరోపణలు అవాస్తవం

కొల్లాపూర్, నవంబర్ 24 (జనంసాక్షి) : మంత్రి జూపల్లి కృష్ణారావుపై కొందరు మత్స్యకారులు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని పలువురు మత్స్యకార నాయకులు ఖండించారు. మత్స్యకారులను వర్గాలుగా విడగొట్టి, వారి మధ్య విభేదాలు సృష్టిస్తూ కొందరు తమ రాజకీయ స్వార్థ ప్రయోజనాలను నెరవేర్చుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం కొల్లాపూర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 21న ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకుని కొల్లాపూర్‌లో రెండు వేర్వేరు సభలు నిర్వహించడంలో మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రమేయం లేదని స్పష్టం చేశారు. తామే మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు మంత్రి వాకిటి శ్రీహరిని తమ సభకు ఆహ్వానించామని, మరో సభ నిర్వహించిన మత్స్యకార నాయకులను సైతం ఆహ్వానించామని తెలిపారు. అయినప్పటికీ రెండు సభలు జరగడానికి మంత్రి జూపల్లే కారణమని ఆరోపించడం సరికాదన్నారు.మత్స్యకారుల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలు కొంతమంది మత్స్యకార నాయకులు తమ స్వార్థ ప్రయోజనాలు, రాజకీయ ఎదుగుదల కోసం మత్స్యకారులను వర్గాలుగా విభజిస్తూ వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర, జిల్లా స్థాయి మత్స్యకార సంఘాల నాయకులమని చెప్పుకునే వారు సభలు, సమావేశాలు జరిగినప్పుడు మాత్రమే కనిపిస్తున్నారని, మత్స్యకార కుటుంబాల్లో ఆపదలు ఎదురైనప్పుడు కనీసం ఒక్క కుటుంబాన్నైనా పరామర్శించారా అని ప్రశ్నించారు. మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కంటే వ్యక్తిగత రాజకీయ ప్రయోజనాలకే కొందరు



ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపించారు.

గంగమ్మ ఆలయ నిర్మాణానికి రూ.2 కోట్లకు పైగా నిధులు

మంత్రి జూపల్లి కృష్ణారావు మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని నాయకులు పేర్కొన్నారు. కొల్లాపూర్‌లో మత్స్యకారుల ఆరాధ్య దైవమైన గంగమ్మ ఆలయ నిర్మాణానికి రూ. 2 కోట్లకు పైగా నిధులు మంజూరు చేయించారని తెలిపారు. మత్స్యకారులు రాజకీయంగా ఎదగడానికి, ప్రజాప్రతినిధులుగా అవకాశాలు పొందడానికి మంత్రి సహకరిస్తున్నారని అన్నారు. అలాంటి మంత్రిపై ఆధారాలు లేని ఆరోపణలు చేయడాన్ని సహించబోమని హెచ్చరించారు.

పండుగ సాయన్న విగ్రహావిష్కరణకు ఎందుకు హాజరుకాలేదు?

పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామంలో తమ జాతి దైవమైన పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించినప్పుడు కొందరు మత్స్యకార నాయకులు ఎందుకు హాజరుకాలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. డాక్టర్ పగిడాల శ్రీనివాస్ రెడ్డి, భయ్యా వెంకటస్వామి తదితరులు మత్స్యకార నాయకులమని చెప్పుకుంటూ సమాజంలో విభేదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. పగిడాల శ్రీనివాస్ రెడ్డి తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తి కాకపోయినప్పటికీ తమ కులంలో ఆదరించామని పేర్కొంటూ, ఇకనైనా చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

మత్స్యకారులను రాజకీయ పావులుగా వాడుకోవద్దు

డాక్టర్ పగిడాల శ్రీనివాస్ రెడ్డి, భయ్యా వెంకటస్వామి ఎమ్మెల్యేగా పోటీ చేస్తామంటూ మత్స్యకారుల మధ్య ప్రచారం చేసుకుంటున్నారని నాయకులు ఆరోపించారు. రాజకీయంగా ఎదగాలనే ఆశతో మత్స్యకారులను పావులుగా వాడుకోవడం తగదన్నారు. మత్స్యకారుల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నాలను విరమించుకోవాలని సూచించారు.విలేకరుల సమావేశంలో కాళ్ల లింగయ్య, వెంకటస్వామి గోవర్ధనగిరి, ఆంజనేయులు (దేవుని తిర్మలాపూర్), చెంది వెంకటస్వామి (చిన్నపరావుపల్లి), పెబ్బేటి శేఖర్ (కొల్లాపూర్ కౌన్సిలర్), వైమన్ వెంకటస్వామి (వీపనగండ్ల), గువ్వలి రాముడు (మాజీ వైస్ ఎంపీపీ, కల్వకోల్), పసుపుల మల్లయ్య, భాషమోని సైదులు, బాల నారాయణ (పెద్దకొత్తపల్లి), గువ్వలి కురుమయ్య (డిప్యూటీ సర్పంచ్, కల్వకోల్), రెడ్డి కురుమయ్య (సోమశిల), రాజు (కొల్లాపూర్), గువ్వలి పెద్దయ్య (కల్వకోల్), ఈదన్న (మాజీ సర్పంచ్, కల్వకోల్) తదితర మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం

- టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు శంకర్ దయాళ్ చారి



పెద్దశంకరంపేట, నవంబర్ 24 (జనం సాక్షి) : జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటం చేయక తప్పదని టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షులు ఎ.శంకర్ దయాళ్ చారి అన్నారు. మంగళవారం రేగోడు, అల్లాదుర్గం, పెద్ద శంకరంపేట మండల కేంద్రాలలో సభ్యత సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆందోల్ నియోజకవర్గ పరిధిలోని రేగోడు, అల్లాదుర్గ్, టేక్మాల్ మండల కేంద్రాలలో పనిచేసే వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు, డబుల్ బెడ్రూంలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చొరవ చూపాలని కోరారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం యూనియన్ పని చేస్తుందని పేర్కొన్నారు. మూడు మండలాలకు సంబంధించిన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయంలో అవసరమైతే ఆందోళనకు సిద్ధమన్నారు. హెల్త్ కార్డులు అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో పనిచేసేలా స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విట్టల్ రావు, ఆనంద్ కుమార్, రాజకుమార్, రేగోడు ప్రెస్ క్లబ్ అధ్యక్షులు శంకర్ గౌడ్, అల్లాదుర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రఘుపతి, పెద్ద శంకరంపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షులు సతీష్, యూనియన్ బాధ్యులు ప్రభాకర్, సంతోష్, కృష్ణ, లావణ్య, షఫీ, సుభాష్, వెంకటేష్, వీరన్న, శంకర్, పూర్ణ చందర్ తదితరులు పాల్గొన్నారు.

రాముని బండ జాతరను సందర్శించిన సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్



జగదేవ్‌పూర్, నవంబర్ 24 (జనం సాక్షి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ జగదేవ్‌పూర్ మండలం జంగారెడ్డిపల్లి గ్రామంలోని ప్రసిద్ధ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం (రాముని బండ) వద్ద కొనసాగుతున్న జాతరను సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో దైవ దర్శనం చేసుకుని పరిసరాలను పరిశీలించి, భక్తుల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లు పోలీస్ బందోబస్తును పర్యవేక్షించారు. అనంతరం జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ రికార్డులు, నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలించారు. కాగా పోలీస్ స్టేషన్‌లో చేపడుతున్న నిర్వహణ, రికార్డుల పర్యవేక్షణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవిరాజు స్థానిక ఎస్ఐ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నల్లమల్లను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం

- మద్దిమడుగులో రూ.100 కోట్లతో సంత్ సేవాలాల్ మహారాజ్ భారీ విగ్రహం
- రూ.20 కోట్లతో ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధి పనులు
- ఈ నెల 26న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- అచ్చంపేటలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభం
- మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 24 (జనంసాక్షి) : నల్లమల్ల అటవీ ప్రాంతాన్ని ఆధ్యాత్మికంగా, పర్యాటక పరంగా ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. అచ్చంపేట నియోజకవర్గంలోని మద్దిమడుగు ప్రాంతాన్ని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా మద్దిమడుగులో రూ.100 కోట్ల వ్యయంతో దేశవ్యాప్తంగా ఉన్న లంబాడీ గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, రూ.20 కోట్లతో శ్రీ



ఆంజనేయస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.ఈ నెల 26వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాగర్ కర్నూల్ జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో మంగళవారం మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి మద్దిమడుగును సందర్శించారు. ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా చేపట్టనున్న అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమాలు, బహిరంగ సభ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.సభా ప్రాంగణం, ప్రజలు చేరుకునే మార్గాలు, వాహనాల పార్కింగ్, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మద్దిమడుగులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా పేరొందిన శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం అభివృద్ధికి రూ.20 కోట్లతో వివిధ పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నెల 26న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న బహిరంగ సభకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలతో పాటు దేవరకొండ నియోజకవర్గ ప్రజలు, గిరిజనులు, మహిళలు, రైతులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావు విజ్ఞప్తి చేశారు.అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు మద్దిమడుగు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందించారు. తీర్థప్రసాదా లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. చెన్నయ్య, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సింగూర్ నీళ్లు హైదరాబాద్‌కు సరఫరా ఆపాలి

- సంగారెడ్డి ప్రజల దాహం తీర్చాలి
- సింగూర్ నీళ్లు బీర్ కంపెనీలకు సరఫరా ఆపాలి ప్రజల దాహం తీర్చాలి
- ముందస్తు ప్రణాళిక లేకుండా సింగూరు నీళ్లు విడుదల
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే నీటి కష్టాలు
- మంజీరా ప్రాజెక్టును సందర్శించిన ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, నవంబర్ 24 (జనం సాక్షి) : సింగూరు ప్రాజెక్టు నుండి హైదరాబాద్ కు వెళుతున్న త్రాగునీటిని నిలిపివేసి సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందించాలని , ముందస్తు ప్రణాళిక లేకుండానే కాంగ్రెస్ ప్రభుత్వ సింగర్ ప్రాజెక్టు నీళ్లను వృధాగా విడుదల నియోజకవర్గ ప్రజలకు త్రాగునీటి సమస్యను తీసుకొచ్చిందని కాంగ్రెస్ ప్రభుత్వం పై తీవ్రంగా మండిపడ్డ సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మంగళవారం సంగారెడ్డి మంజీరా ప్రాజెక్టును ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగూరు ప్రాజెక్టు నీళ్లను హైదరాబాద్ తరలిస్తున్న నీటిని తక్షణమే ఆపి నియోజకవర్గ ప్రజలకు దాహం తీర్చే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆయన అన్నారు హైదరాబాద్‌కు నీళ్లు సరఫరా చేసే ముందు సంగారెడ్డి ప్రజల దాహం తీర్చాలి. సొంత జిల్లా ప్రజలు నీళ్ల కోసం అల్లాడుతుంటే ఇతర ప్రాంతాలకు నీటి సరఫరాపై చూపిస్తున్న శ్రద్ధ దేనికి సంకేతం? అని ప్రశ్నించారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ముందుగానే హెచ్చరికలు వచ్చినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కనీస ముందస్తు ప్రణాళిక రూపొందించలేదని విమర్శించారు. సింగూర్ ప్రాజెక్టు మరమ్మతుల పేరుతో అందులో ఉన్న నీటిని ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండా వదిలేయడం ప్రభుత్వ అవగాహనారాహిత్యానికి నిదర్శనమన్నారు. సింగూరు ప్రాజెక్టులో సామర్థ్యం 29. టీఎంసీలో వాటర్ సామర్థ్యం గల సింగూరు ప్రాజెక్టు ప్రస్తుతం సుమారు 1.9 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, ఈ నీటి నిల్వలు డిసెంబర్ వరకు మాత్రమే



సరిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ తర్వాత సంగారెడ్డి ప్రజల తాగునీటి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సింగూర్, మంజీరా జలాశయాల్లో పూడికతీత పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలి. తాగునీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. సంగారెడ్డి ప్రజల అవసరాలు తీర్చిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటి సరఫరాపై నిర్ణయం తీసుకోవాలి. జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రి, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించి తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చక్రపాణి, కౌన్సిలర్లు కొత్తపల్లి శ్రీకాంత్, జాఫర్, లాడే మల్లేశం, నాయకులు జీవీ శ్రీనివాస్, కసిని శ్రీకాంత్, విఠల్, మోహన్ సింగ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి భద్రతే లక్ష్యం ఇందిరమ్మ జీవిత బీమా



బెజ్జంకి, నవంబర్ 24 (జనం సాక్షి) : పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని గూడెం గ్రామంలో మంగళవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ గూడెల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ అర్హులైన కుటుంబాలకు జీవిత బీమా రక్షణ కల్పించడం ద్వారా ఆపద సమయంలో ఆర్థిక భరోసా అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ యాలాల పరశురాములు,వార్డు సభ్యులు నూనె రాములు,నారెడ్డి శ్రీనాథ్ రెడ్డి,బోనాల లక్ష్మి,పంచాయతీ కార్యదర్శి మేరుగు యాదగిరి,అంగన్వాడీ టీచర్ మాంకాళి సరోజన,సీఏ కుసుబ సుష్మ,గ్రామ పెద్దలు,సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులను వేగవంతం చేయాలి

- సిద్దిపేట సీపీ రష్మి పెరుమాళ్



జగదేవ్‌పూర్, నవంబర్ 24 (జనం సాక్షి) : కేసుల దర్యాప్తులను వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం చేయాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణ, రికార్డుల నిర్వహణను తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకొని పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో సిబ్బంది మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. స్టేషన్ పరిధిలోని సీజ్ చేసిన వాహనాలు, ఇతర క్రైమ్ ప్రాపర్టీని పరిశీలించి, వాటి భద్రత రికార్డుల నిర్వహణలో పారదర్శకత పాటించాలని సూచించారు. అత్యవసర సమయంలో 'డయల్ 112'కు ఫోన్ కాల్ రాగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలవాలని సూచించారు. ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా ఉండేందుకు మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో నిరంతరం అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. నేరాల నియంత్రణ, గ్రామాల భద్రత కోసం 'సిద్దిపేట సురక్ష నేత్ర' కార్యక్రమం కింద ప్రతి గ్రామంలో సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ గ్రామీణ సీఐ రవి రాజు, ఎస్ఐ కృష్ణ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర న్యాయం అందించడానికి కోర్టు ఎంతో ఉపయోగం

- తెలంగాణా ఒక ల్యాండ్ ఆఫ్ సెలబ్రేషన్స్
- కోర్టులో న్యాయమూర్తి కన్నా న్యాయవాది పాత్ర గొప్పది
- గౌరవ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విజయ్ సేన్ రెడ్డి
- న్యాయవాదులు సోషల్ ఇంజనీర్స్ ఆకాశమే హద్దుగా న్యాయవాదులు ప్రాక్టీస్ చేయాలి
- గౌరవ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుద్దాల చలపతిరావు

తూప్రాన్, నవంబర్ 24 (జనం సాక్షి) : ప్రజలకు సత్వర న్యాయ సేవలు అందించడానికి కోర్టులు ఎంతగానో ఉపయోగపడతాయని తూప్రాన్ కోర్టు ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడుతుందని హైకోర్టు న్యాయమూర్తి విజయసేన్ రెడ్డి తెలిపారు. మంగళ వారం మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జి కం ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును గౌరవ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు విజయ్ సేన్ రెడ్డి, చలపతిరావు చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో గౌరవ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి విజయ్ సేన్ రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ జిల్లాకు తనకు చాలా అనుబంధం ఉందని, ప్రధాన న్యాయమూర్తిగా కాక తనకు ఈ జిల్లాలో బంధువులు ఉన్నారన్నారు. తన తాతల నుండి ఈ జిల్లాకు అనుబంధం ఉందని అన్నారు. వ్యక్తి జీవితంలో ఏదీ శాశ్వతం కాదన్నారు. తెలంగాణ ఒక ల్యాండ్ ఆఫ్ సెలబ్రేషన్స్ అని, జీవితమే ప్రతిరోజు సెలబ్రేషన్ అని, సెలబ్రేషన్ చేసుకుంటూనే వాటికి తగ్గట్టుగా పని చేయాలన్నారు. న్యాయవాద వృత్తి పవిత్రమైందని అందులో సృజనాత్మకత, స్వేచ్ఛ ఉంటాయన్నారు. సృజనాత్మకత స్వేచ్ఛను మరి ఏ వృత్తిలో చూడలేమన్నారు. జీవితంలో న్యాయవాద వృత్తిని బాధ్యతగా తీసుకున్నప్పుడు చాలా ఆలోచించాలన్నారు. కోర్టులో జడ్జి కన్నా లాయర్ పాత్ర చాలా గొప్పది అన్నారు. యువ లాయర్లు పబ్లిసిటీపై ఆధారపడుతున్నారని, లాయర్ యొక్క మంచితరమే పబ్లిసిటీ అన్నారు. వృత్తి పై ఆదరణ కలిగి ఉండాలన్నారు. తూప్రాన్ లో కోర్టు భవనం ఏర్పాటులో పూర్వ మండల కార్యాలయం కేటాయించడం సంతోషమని దానిని 30 లక్షలతో ఆధునికరించామని తెలిపారు. కేసుల విషయంలో జడ్జి కన్నా లాయర్లకి ఎక్కువ పేరు వస్తుందన్నారు. జడ్జిల యొక్క గొప్పతనాన్ని కేసు గెలిచిన వారు కాకుండా, ఓడిపోయిన కక్షిదారులు చెప్పాలి, అదే జడ్జి గొప్పతనం అన్నారు. కోర్టుల్లో సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. గౌరవ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సుద్దాల చలపతిరావు మాట్లాడుతూ, న్యాయవాదులు సోషల్ ఇంజనీర్లు అని ,న్యాయవాదులు ఆకాశమే హద్దుగా ప్రతిరోజు ప్రాక్టీస్ లో ఉండాలన్నారు. బాలలను పరిరక్షించాలని, సమన్వయంతో పని చేయాలని, భారతదేశ అభివృద్ధి చెందుతున్న దేశంగా ఎదుగుతుందన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ



మాట్లాడుతూ. హైకోర్టు న్యాయమూర్తులకు మెతుకు సీమకు స్వాగతం చెప్పారు. కక్షిదారుల సౌకర్యం కోసం, సత్వర సేవలు కోసం కోర్టును ఏర్పాటు చేయడం జరిగిందని, తూప్రాన్ పరిసర నాలుగు మండలాల కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గౌరవ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులకు శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు,అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, మున్సిపల్ చైర్ పర్సన్ రజిని, మార్కెట్ కమిటీ చైర్మన్ కీర్తన విటల్ రెడ్డి, గౌరవ జిల్లా న్యాయమూర్తులు సాయి సిరి సౌజన్య, హేమలత , శుభవల్లి, సంతోష్ కుమార్, మెదక్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి , సీనియర్ న్యాయవాదులు పోచయ్య ప్రతాపరెడ్డి, జితేందర్ , న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సమ్మె నోటీసు అందజేత



బెల్లంపల్లి, నవంబర్ 24, (జనంసాక్షి) : ప్రభుత్వ హాస్పిటల్లో పనిచేస్తున్న సానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది, సూపర్వైజర్లు డిసెంబర్ 7 నుంచి సమ్మెకు దిగుతున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈసందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పిటల్లో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది, సూపర్వైజర్ కార్మికులను ఐహెచ్ఎఫ్ఎంఎస్ నుండి ఐఎఫ్ఎంఐఎస్ లో విలీనం చేయాలని, ఫిక్స్ వేతనము 26,000, డైరెక్ట్ బెనిఫిటర్ కి చెల్లించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 7 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతున్నామని తెలిపారు. కాంట్రాక్టర్లు చాలీచాలని జీతాలు ఇస్తున్నారని, ఈపీఎఫ్, ఈఎస్ఐ కట్టడం లేదని అన్నారు. గట్టిగా నిలదీస్తే కార్మికులను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి విధులకు రావద్దని హెచ్చరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. ఆసుపత్రిలో సమయపాలన లేకుండా ఓవర్ టైం డ్యూటీ చేయిస్తున్నారని, అన్నారు. బెడ్ సైడు కాంట్రాక్ట్ విధానము రద్దు చేయాలని, ప్రమాద బీమా కింద 20 లక్షల రూపాయలు అందించాలని, ఈపీఎఫ్ లో యాజమాన్యం షేరు ప్రభుత్వం చెల్లించాలను, మహిళా కార్మికులకు వేతనముతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా క్యాజువల్ సెలవులు ఇవ్వాలను, ప్రతి కార్మికునికి ఈఎస్ఐ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్కె ఇబ్రహీం, డి రమేష్, అన్వర్, శ్రీకాంత్, సాయి, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గొల్ల మాడలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



నిర్మల్ బ్యూరో, నవంబర్ 24 (జనంసాక్షి): నర్సాపూర్ జి మండలంలోని గొల్లమాడ గ్రామంలో మంగళవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం సర్పంచ్ చేన్న వసంత లస్మయ్య ధాన్యం కేంద్రంను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా గ్రామాల్లోనే కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించామని నిర్వాహకులకు సూచించారు. నిబంధనల ప్రకారం తేమ శాతం ఉండేలా చూసుకుని ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని రైతులను కోరారు. ఇందులో మాజీ పిఎసిఎస్ చైర్మన్ కుమ్మరి భాస్కర్, ఉప సర్పంచ్ బట్టి భూమన్న, చేన్న మహేష్,వార్డ్ మెంబర్ లు కాల్వ సంతోష్, భోజన,హరీష్, నాయకులు వినోద్ రెడ్డి, లంబడి గంగాధర్, కత్తూర్ లక్ష్మయ్య, భూపతి, లింగం డాక్టర్, నిర్వాహకులు రావుల శ్రీనివాస్,రవి, వంశీ, సమస్తులు రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పెన్షన్ కోసం ఎమ్మెల్యేకు వినతి



బెల్లంపల్లి, నవంబర్ 24, (జనంసాక్షి) : ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న జర్నలిస్టులకు పెన్షన్, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. తమ ప్రతిపాదనను సీఎం రేవంత్‌రెడ్డితో పాటు సంబంధిత ప్రభుత్వ శాఖల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగ విరమణ తర్వాత జర్నలిస్టులకు ప్రభుత్వం పెన్షన్ అందించి ఆదుకోవాలని కోరారు. ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమంలో జర్నలిస్టులు తమ గళం, కలంతో తెలంగాణ ఉద్యమానికి మద్దతుగా నిలిచారని గుర్తుచేశారు. వివిధ పత్రికలు, టీవీ ఛానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టులు పదవీ విరమణ అనంతరం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఆర్థిక భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు జారీ చేసే ప్రకటనలతో పాటు అర్హత కలిగిన మీడియా ప్రకటనల ఆదాయంలో 10 శాతం మొత్తాన్ని జర్నలిస్టుల పెన్షన్, సంక్షేమ నిధికి కేటాయించేలా చట్టబద్ధమైన విధానం రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు రాంశెట్టి వల్లభాయ్, ఆకుల శివప్రసాద్, పులియాల రాజు, పూదరి నగేష్ గౌడ్, వికాస్ యాదవ్, మోహన్, మనోజ్ పాండే, దండబోయిన భాస్కర్, ఇడిదివేని రాధాకృష్ణ, శ్రీనివాస్, బడుగు శ్రీనివాస్, అందుగుల రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

రామప్పను సందర్శించిన ట్రైనీ డీఎస్పీలు



వెంకటాపూర్, నవంబర్ 24(జనం సాక్షి): వెంకటాపూర్ మండలంలోని పాలంపేట గ్రామంలో గల రామప్ప దేవాలయాన్ని మంగళవారం ట్రైనీ డీఎస్పీలు మహేష్ గౌడ్, సాయి విశ్వనాథ్ సందర్శించారు. ఈ సందర్భంగా వారు ముందుగా రామలింగేశ్వర స్వామి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ వారికి స్వామి వారి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం టూరిజం గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వారికి ఆలయ చరిత్ర, శిల్పకళా సంపద , కాకతీయుల చరిత్ర గురించి వివరించారు. ఆలయ శిల్పకళను చూసి ట్రైనీ డీఎస్పీలు అబ్బురపడ్డారు. కాకతీయుల కళా నైపుణ్యం అద్భుతంగా ఉందని వారు కొనియాడారు. రామప్ప ఆలయం ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందడం ఈ ప్రాంత ప్రజలకు గర్వకారణమని వారు పేర్కొన్నారు. అనంతరం వారు రామప్ప సరస్సు ను సందర్శించి పర్యాటక శాఖ బోటు లో బోటింగ్ చేశారు. చెరువు అందాలను చూసి ఆనందం వ్యక్తం చేశారు.వారి వెంట ఆలయ ఈవో ఇమ్మడి భాస్కర్, టూరిస్ట్ పోలీసులు బద్రు, అరుణ్, శ్రీకాంత్, పురావస్తు, దేవాదాయ, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు.

హనుమకొండలో రోడ్డెక్కిన రాజకీయ రగడ

- ధాన్యం, నాయిని క్యాంపు కార్యాలయాల వద్ద కార్యకర్తల ధర్నాలు నిరసనలు..
- డౌన్ డౌన్ అంటూ బిఆర్ఎస్, కాంగ్రెస్‌నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు..
- సవాల్ కు ప్రతి సవాల్ విసురుకుంటున్న ఇరువురు
- వినయ్ భాస్కర్ ప్లెక్సీలు చించివేసిన కాంగ్రెస్ నేతలు







హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 24 (జనంసాక్షి) : హనుమకొండ నగరంలో రాజకీయం. రోడ్డెక్కింది మీడియా సమావేశాలలో మాజీ ఎమ్మెల్యే దాస్యం ప్రస్తుత ఎమ్మెల్యే నాయిని ఒకరికి ఒకరు సవాల్ కు ప్రతి సవాల్ విసురు కుంటు రాజకీయ రగడతో రాజకీయాన్ని రోడ్డు ఎక్కించారు హనుమకొండ నగరం అభివృద్ధి గత ప్రభుత్వం తోనే అభివృద్ధి జరిగిందని వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ సవాల్ విసిరడంతో హనుమకొండ నగరం ప్రస్తుత మూడేళ్లలో నే అభివృద్ధి చెందిందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సవాల్ విసిరారు ప్రతిపక్ష పార్టీల మధ్య రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శలు తీవ్ర స్థాయికి చేరుకుంటున్నాయి. మంగళవారం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి క్యాంపు కార్యాలయం ధర్నా నిర్వహించి పెద్ద ఎత్తున నాయిని డౌన్ డౌన్ వెంటనే రాజీనామా చేయాలని నినాదాలు చేయడంతో కాంగ్రెస్ నాయకులు వెంటనే మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించి పెద్ద ఎత్తున డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేసి ధర్నా చేశారు దాస్యం వినయ్ భాస్కర్ కు సంబంధించిన ఫ్లెక్సీలు కాంగ్రెస్ నేతలు చించి వేయడం జరిగింది ఇరు వర్గాల ధర్నాతో హనుమకొండ నగర రాజకీయం వేడెక్కింది ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు సవాల్ విసురుకుంటూ ఒకరి కార్యాలయం పై ఒకరు దాడులకు ప్రయత్నాలు చేస్తుంటే పోలీసులకు తలనొప్పిగా మారింది. దాస్యం, నాయిని వర్గాలకు సంబంధించిన రాజకీయ పరిణామాలు ప్రస్తుతం జిల్లాలో హాట్ టాపిక్‌గా మారాయి.ప్రజా సమస్యలపై పోరాడాల్సిన రాజకీయ పార్టీలు పరస్పర విమర్శలు, నిరసనలు, నినాదాలతో రోడ్డెక్కడం ప్రజల్లో చర్చనీయాంశంగా మారుతోంది. రాజకీయ ఆధిపత్య పోరులో కార్యకర్తలు ఉద్రిక్తతలకు లోనుకాకుండా నాయకులు సంయమనం పాటించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి హనుమకొండ రాజకీయాలు రాష్ట్రంలో ప్రస్తుతం హాట్ హాట్‌గా మారాయి.

భార్యపై అనుమానం..

- ఆస్తి కోసం అత్తపై కత్తితో దాడి
- అల్లుడు రాజేష్ అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

మల్లంపల్లి, నవంబర్ 24 (జనంసాక్షి): భార్యపై అనుమానం, ఆస్తి వివాదం నేపథ్యంలో అత్తపై అల్లుడు కత్తితో దాడికి పాల్పడిన ఘటన మల్లంపల్లిలో తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన బత్తిని లక్ష్మి (60) హనుమకొండలోని ఎన్ఎస్ఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లంపల్లికి చెందిన దూమల రాజేష్ (37)కు బత్తిని మానసతో 13 ఏళ్ల క్రితం ప్రేమ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న రాజేష్ ఆమెను వేధింపులకు గురిచేయడంతో మానస ఏప్రిల్ 1వ తేదీ నుంచి పుట్టింట్లో ఉంటోంది. గతంలో భార్య పేరు మీద రిజిస్ట్రేషన్ చేసిన భూమి, ఇంటిని తిరిగి తన పేరు మీద మార్చాలని రాజేష్ ఒత్తిడి చేస్తూ వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నేపథ్యంలో సోమవారం సాయంత్రం భార్య ఇంటికి వెళ్లిన రాజేష్ గొడవపడి చంపుతానని బెదిరించినట్లు తెలిపారు. ముందస్తు ప్రణాళికతో ఆన్‌లైన్‌లో కత్తి కొనుగోలు చేసిన రాజేష్ మంగళవారం





తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో అత్తగారి ఇంటికి చేరుకున్నాడు. తలుపు తీసిన బత్తిని లక్ష్మిపై మెడ భాగంలో కత్తితో దాడి చేశాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన భార్య మానసపై కూడా దాడికి యత్నించగా, ఆమె తప్పించుకుని కేకలు వేసింది. దీంతో ఇరుగుపొరుగు వారు అక్కడికి చేరుకోవడంతో నిందితుడు కత్తితో అక్కడి నుంచి పరారయ్యాడు.

తీవ్రంగా గాయపడిన లక్ష్మిని కుటుంబ సభ్యులు, స్థానికులు హనుమకొండలోని ఎన్ఎస్ఆర్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసిన ములుగు పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడు రాజేష్‌ను నేరానికి ఉపయోగించిన కత్తితో సహా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ములుగు ఎస్ఐ, ఎస్‌హెచ్ఓ ఎస్. వెంకటేశ్ తెలిపారు.

కార్తీక పౌర్ణమికి పోటెత్తిన భక్తజనం



- శివనామస్మరణతో మార్మోగిన రామప్ప
- దీపాల కాంతులతో విరాజిల్లిన ఆలయ పరిసరాలు

వెంకటాపూర్,నవంబర్ 24 (జనం సాక్షి) : కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే వేలాదిగా తరలివచ్చిన భక్తులు రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్తీక మాసం చివరి పౌర్ణమి కావడంతో స్థానికులతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచే ఆలయం వద్ద భక్తుల క్యూలైన్లు కనిపించాయి. స్వామివారికి పంచామృత అభిషేకాలు, బిల్వార్చనలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు హరీష్ శర్మ, ఉమాశంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి.కాగా, వారు భక్తులకు స్వామి వారి ఆశీర్వచనాలు,తీర్థప్రసాదాలను అందజేశారు.అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో మహిళలు పెద్ద సంఖ్యలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. దీపాల వెలుగులతో రామప్ప ఆలయం దేదీప్యమానంగా వెలిగిపోయింది. భక్తుల శివనామస్మరణతో, హర హర మహాదేవ శంభో అంటూ చేసిన నినాదాలతో రామప్ప పరిసరాలు మార్మోగాయి.అంతేకాకుండా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో ఇమ్మడి భాస్కర్ ఆధ్వర్యంలో దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది అందుబాటులో ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టూరిస్ట్ పోలీసులు బద్రు, అరుణ్, శ్రీకాంత్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కరువుపై చిత్తశుద్ధి లేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు..

- ముందస్తు ప్రణాళిక లేకనే తీవ్ర రూపం దాల్చుతున్న కరువు..
- వరంగల్ జిల్లాను తీవ్ర కరువు ప్రాంతంగా ప్రకటించాలి..
- కరువును శాస్త్రీయంగా అంచనా వేసి తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలి..
- ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్
- ఎంసీపీఐ(యు), ఏఐకేఎఫ్ ఆధ్వర్యంలో రైతుల పంట పొలాల సందర్శన..



దుగ్గొండి, నవంబర్ 25 (జనం సాక్షి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లే కరువు పరిస్థితులు తీవ్రరూపం దాల్చుతున్నాయని, ప్రచార ఆర్భాటాలను పక్కనపెట్టి తక్షణమే ప్రత్యేక బడ్జెట్ కేటాయించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఎంసీపీఐ(యు) వరంగల్ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు. ఎంసీపీఐ(యు), అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకేఎఫ్) ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం దుగ్గొండి మండలంలోని తిమ్మంపేట, గిర్నిబావి, మందపల్లి, చాపలబండ, అడవిరంగాపురం గ్రామాల్లో పర్యటించి రైతుల పంట పొలాలను సందర్శించింది. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి క్షేత్రస్థాయిలో నెలకొన్న కరువు పరిస్థితులను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 2 లక్షల 90 వేల ఎకరాల్లో పంటలు సాగు చేసినప్పటికీ, కనీసం 50 శాతం విస్తీర్ణంలో కూడా ఆశించిన దిగుబడులు వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో శాస్త్రీయంగా కరువు తీవ్రతను అంచనా వేయకుండా కేవలం ఎనిమిది మండలాలను మధ్యస్థ కరువు మండలాలుగా ప్రకటించడం అన్యాయమని విమర్శించారు.ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వరంగల్ జిల్లాను తీవ్ర కరువు ప్రాంతంగా ప్రకటించాలని, తక్షణమే ప్రత్యేక నిధులు కేటాయించి రైతులకు, వ్యవసాయ కూలీలకు కరువు సహాయక చర్యలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఏఐకేఎఫ్ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుంబ బాబురావు మాట్లాడుతూ, కరువు కారణంగా పంటల దిగుబడులు కోల్పోయిన రైతులకు వాణిజ్య పంటలకు ఎకరానికి రూ.50 వేల చొప్పున, ఇతర పంటలకు ఎకరానికి రూ.30 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ పంట పొలాల సందర్శనలో ఎంసీపీఐ(యు) డివిజన్ కార్యదర్శి మహమ్మద్ రాజాసాహెబ్, మండల కార్యదర్శి సింగతి మల్లికార్జున్, రాష్ట్ర కమిటీ సభ్యులు నాగెల్లి కొమురయ్య, మండల సహాయ కార్యదర్శి ఏల్లబోయిన రాజు, నాయకులు పాల్గొన్నారు.



కార్తీకమాస దీపకాంతులతో వెలిగిన భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయం

దేవరుప్పుల, నవంబర్ 24 (జనం సాక్షి): జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో కార్తీకమాస దీపోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం దీపాల వెలుగులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని దీపాలు వెలిగించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన దీపోత్సవంతో ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మార్మోగాయి.



హనుమకొండ జిల్లాలో పల్స్ పోలియో విజయవంతం

హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 24 (జనం సాక్షి) : జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన మూడు రోజుల పల్స్ పోలియో ఇమ్యునైజేషన్ కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణారావు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా ఆయన వివిధ ట్రాన్సిట్ బూత్‌లను సందర్శించి, అక్కడ చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అలాగే కార్యక్రమానికి సంబంధించిన ప్రోగ్రామ్ అధికారులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో పర్యటిస్తూ ఇంటింటి సర్వే, పోలియో చుక్కల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.మూడవ రోజు మొత్తం 416 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం జరిగింది. అదేవిధంగా 75,387 ఇళ్లను సందర్శించి ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ, పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కృషి చేసిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
25 నవంబర్ 2026

స్కానింగ్ సెంటర్‌లో మహిళపై లైంగిక వేధింపులు

దేవరకొండ, నవంబర్ 24 (జనం సాక్షి) : నమ్మకంతో వైద్య పరీక్షల కోసం వచ్చిన మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన నల్గొండ జిల్లా దేవరకొండలో కలకలం రేపింది. వైద్య పరీక్షల కోసం శ్రీబాలాజీ డిజిటల్ ఎక్స్ రే, సిటీ స్కానింగ్ సెంటర్‌కు వచ్చిన ఓ మహిళపై సదరు స్కానింగ్ సెంటర్ నిర్వాహకుడు కిరణ్ లైంగిక వేధింపులకు పాల్పడితే సదరు మహిళా ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. వైద్య పరీక్షల కోసం వచ్చే మహిళలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత కలిగిన వ్యక్తే ఇలాంటి చర్యలకు పాల్పడినట్లు ఆరోపణలు రావడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేశారు.

స్కానింగ్ సెంటర్‌ను సందర్శించిన పోలీసులు



ఈ ఘటనను పోలీసులు తీవ్రంగా పరిగణించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బృందం మంగళవారం సంబంధిత స్కానింగ్ సెంటర్‌ను సందర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించింది. అక్కడి పరిస్థితులను పరిశీలించి విచారణ చేపట్టారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

బాధితురాలి ఫిర్యాదు మేరకు లైంగిక వేధింపుల కేసుతో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు కూడా నమోదు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

మహిళల భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదు

వైద్య సేవలందించే కేంద్రాల్లో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. వైద్య పరీక్షల పేరుతో మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు స్కానింగ్ సెంటర్లపై పర్యవేక్షణ పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

సామాజిక అభివృద్ధికి ఉద్యోగుల ఐక్యత కీలకం



మిర్యాలగూడ, నవంబర్ 24 (జనంసాక్షి) : సమాజ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని, విద్య, ఉద్యోగ, సామాజిక రంగాల్లో ఐకమత్యంతో ముందుకు సాగి, అంబేద్కర్ ఆశయాలతో సమ సమాజ నిర్మాణానికి కృషి చెయ్యాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన మాదిగ ఉద్యోగుల సమాఖ్య మిర్యాలగూడ డివిజన్ ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, సమాఖ్య ప్రతినిధులతో ఆత్మీయంగా మాట్లాడారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, విద్యాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. భావితరాలకు మెరుగైన భవిష్యత్తును అందించేందుకు ఐక్యంగా పనిచేయాలని సూచించారు. ఈ సమ్మేళనాలు ఉద్యోగుల మధ్య స్నేహభావం, ఐక్యత, సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, సమాఖ్య ప్రతినిధులు, ఉద్యోగులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బేస్‌బాల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఛాంపియన్‌షిప్‌కు క్రీడాకారుల ఎంపిక



మిర్యాలగూడ, నవంబర్ 24 (జనంసాక్షి) : 6వ ఇంటర్ డిస్ట్రిక్ట్ బేస్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే నల్గొండ జిల్లా జట్ల ఎంపిక చేసినట్లు జిల్లా బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అమరావతి సైదులు, చిర్ర మల్లేష్ యాదవ్ లు తెలిపారు. మంగళవారం నాడు ప్రభుత్వ జూనియర్ కాలేజీ క్రీడా ప్రాంగణం లో జరిగిన ఎంపిక కార్యక్రమం లో భాగంగా జూనియర్ బాలబాలికలు, సీనియర్ మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమానికి జిల్లా కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జూనియర్ బాలబాలికల ఎంపికలు డిసెంబర్ 11 నుంచి 14 వరకు కోదాడలోని కేఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నారు. సీనియర్ మెన్ అండ్ ఉమెన్ జట్ల ఎంపికలు డిసెంబర్ 23 నుంచి 26 వరకు జరగనున్నాయి. ఈ ఎంపికల్లో 17 ఏళ్ల పైబడిన బాలబాలికలు, పురుషులు, మహిళలు పాల్గొనడానికి అర్హులని తెలిపారు. ఎంపికలకు హాజరైన క్రీడాకారులకు జిల్లా స్థాయి సెలక్షన్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు అర్హులైన క్రీడాకారులకు సెలవు మంజూరు చేసి ఎంపికల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని అసోసియేషన్ కోరారు. ఈ మేరకు బేస్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ నల్గొండ జిల్లా కార్యదర్శి కళాశాల ప్రిన్సిపాళ్లకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లోఅసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షులు పాశం నర్సింహా రెడ్డి,మాజీ కబడ్డీ క్రీడాకారుడు జర్నలిస్ట్ జంగా లక్ష్మణ్ యాదవ్,కాలేజీ వ్యాయామ ఉపాధ్యాయులు, అసోషియేషన్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తండ్రిని మోసం చేసిన తనయుడు

- **తండ్రి పేరు మీద ఉన్న రెండు ఎకరాలు కాజేసిన వైనం**

తుంగతుర్తి, నవంబర్ 24 (జనం సాక్షి) : తండ్రి బతికుండగానే చనిపోయినట్లు నకిలీ ఆధారాలు సృష్టించి తండ్రి పేరు మీద ఉన్న రెండు ఎకరాలు వ్యవసాయ భూమి తన పేరు మీద మార్చుకున్న సంఘటన మండల పరిధిలోని సూర్య తండా గ్రామపంచాయతీలో ఆలస్యంగా వెలుగు చూసింది, గ్రామానికి చెందిన ఓ గిరిజన రైతు తనకున్న వ్యవసాయ భూమిని తన కోసం రెండెకరాలు ఉంచుకొని మిగతా వ్యవసాయ భూమిని కుమారుడి పేర రిజిస్ట్రేషన్ చేయించాడు, ఆ రెండు ఎకరాల భూమి కూడా తన పేరు మీదనే రిజిస్ట్రేషన్ చేయించాలని తండ్రిపై ఒత్తిడి చేస్తున్నాడు, ఎక్కడ ఆ వ్యవసాయ భూమిని తన చెల్లెళ్ల పేరు మీద రిజిస్ట్రేషన్ చేస్తాడు అని అనుమానపడ్డాడు, ఈ క్రమంలో ఇద్దరు మధ్య తరచూ తగువు జరుగుతుండేది, ఈ క్రమంలో అతను 2021లో తన తండ్రి మరణించినట్లు ఫోర్జరీ తో కూడిన డెత్ సర్టిఫికెట్ సంపాదించాడు, దీంతో అతను గత నెల క్రితం తండ్రికి తెలవకుండానే తండ్రి మరణించినట్లు ఫోర్జరీ డెత్ సర్టిఫికెట్ తో తహశీల్దార్ తో కుమ్మక్కై ఫ్యామిలీ సర్టిఫికెట్ లేకుండానే తన తండ్రి పేరు మీద ఉన్న రెండు ఎకరాల భూమిని తన పేరుమీద మార్చుకున్నాడు, తన తండ్రి పేరు మీద ఉన్న రెండు ఎకరాలు వ్యవసాయ భూమి ఎక్కడ తన కుమార్తెలకు ఇస్తాడని భావించి చివరికి తన తండ్రి చనిపోయినట్లు అధికారులకు డబ్బులు ఆశ పెట్టి తన తన పేర మార్చుకున్నాడు ,దీంతో ఇటీవల ఆ తండ్రి తన పేరు మీద భూమి కనిపించడం లేదని ఆందోళన చెంది తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లి తాసిల్దార్ ను నిలదీశాడు, నీవు చనిపోయావని డెత్ సర్టిఫికెట్ చూపించి నీ యొక్క కుమారుడు మీ భూమిని తన పేరు మార్చుకున్నాడని తెలిపారు, తాను జీవించే ఉన్నానని మరణించినట్లు డెత్ సర్టిఫికెట్ ఎవరు జారీ చేశారని ఆయన నాకు కుమార్తెలు కూడా ఉన్నారని ఫ్యామిలీ సర్టిఫికెట్ లేకుండానే భూమి బదిలాయింపు ఎలా చేస్తారని తాసిల్దార్‌ను నిలదీశాడు, దీంతో ఆందోళన



చెందిన తాసిల్దార్ మళ్లీ మీ భూమిని నీ పేరున మారుస్తాన హామీ ఇచ్చినట్లు సమాచారం.

తాసిల్దార్ వివరణ...

ఈ విషయంపై తాసిల్దార్ ను వివరణ కోరగా డెత్ సర్టిఫికెట్ చూపించి తనను తప్పుదో పట్టించాడని దీంతో తాను భూమిని అతడి పేరున మార్చానని వాపోయారు, ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిపి మళ్లీ అతని పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు.

సామకూరి మహేష్ హత్య కేసులో నిందితుల అరెస్టు

- **మీడియా ముందు నిందితులను ప్రవేశపెట్టిన డి.ఎస్.పి ప్రసన్నకుమార్**

తుంగతుర్తి, నవంబర్ 24 (జనం సాక్షి) : మండల పరిధిలోని వెంపటి గ్రామంలో ఈనెల 20న హత్యకు గురైన సామకూరి మహేష్ హత్య కేసులో 8 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేసి మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో మీడియా ముందు ప్రవేశపెట్టారు, ఈ మేరకు డిఎస్పి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన సామకూరి మహేష్ (25) ఈనెల 18న రాత్రి 9 గంటలకు అదే గ్రామానికి చెందిన రమణ బోయిన మహేష్ భార్య అయినా సుమలతతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని చూసి అతడితో గొడవపడి కొట్టడం జరిగిందన్నారు, ఆ తోపులాటలో సుమలతకు తలకు గాయం జరిగిందని తెలిపారు, ఇట్టి విషయాన్ని రమణ బోయిన మహేష్ తన తల్లిదండ్రులతో పాటు అత్తమామలకు, బామ్మర్ది వేణుకు, అన్న పదినలు మురళి, హేమలతలకు తెలిపాడు, చామకూరి మహేష్ చేసిన పని వల్ల గ్రామంలో తమ పరువు పోయిందని ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నారని తెలిపారు, ఈనెల 20న ఉదయం 8 గంటలకు చామకూరి మహేష్ తమ ఇంటి ముందు నుండి ట్రాక్టర్ పై వ్యవసాయ పొలం దున్నుటకు వెళ్లడం చూసి ద్విచక్ర వాహనంపై వెంబడించి ఊరి బయట తాను తన వెంట తెచ్చుకున్న కత్తితో ట్రాక్టర్ ను అడ్డగించి దాడి



చేసి కత్తితో పొడిచి పారిపోయాడని తెలిపారు, మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మద్దిరాల పోలీస్ స్టేషన్ పరిధిలో నిందితులను అరెస్టు చేశామని తెలిపారు, ఈ మేరకు నిందితులైన రమణ బోయిన మహేష్, వల్లపు వేణు, రమణ బోయిన సుమలత, రమణ బోయిన మల్లయ్య, వల్లపు లింగయ్య, రమణ బోయిన మురళి, వల్లపు లింగయ్య, వల్లపు సోమ లింగమ్మ, లలో అరెస్టు చేశామని మరో నిందితురాలు రమణ బోయిన హేమలత పరార్లో ఉందని తెలిపారు ఈ మేరకు వీరుడు కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు ఈ సమావేశంలో సీఐ ఉపేందర్ రావు, ఎస్సై రాజ్ కుమార్ పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో జిల్లా స్థాయి గిరిజన క్రీడల ఎంపికలు

- **కిన్నెరసాని క్రీడా ప్రాంగణంలో నిర్వహణ..**
- **పాల్గొనే క్రీడాకారులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలి**
- **ఐటీడీఏ పీవో బి రాహుల్**

భద్రాచలం, నవంబర్ 24 (జనంసాక్షి) : ఐటీడీఏ భద్రాచలం పరిధిలోని ఏడు డివిజన్లలో డివిజన్ స్థాయి గిరిజన క్రీడల ఎంపికలు పూర్తికావడంతో జిల్లా స్థాయి ఎంపికలకు అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ఈ నెల 27, 28 తేదీల్లో కిన్నెరసానిలోని ప్రభుత్వ గిరిజన మోడల్ క్రీడా పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ ఎంపికలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. ఈ ఎంపికల్లో భాగంగా ఈ నెల 27న 17 ఏళ్లలోపు బాలబాలికలకు, 28న 14 ఏళ్లలోపు బాలబాలికలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు రెండు రోజులూ ఉదయం 9 గంటలకు క్రీడా ప్రాంగణానికి చేరుకోవాలని సూచించారు ఏడు డివిజన్ల ఇన్‌చార్జిలు, ఏఎస్ఓలు తమ పరిధిలోని పాఠశాలల నుంచి డివిజన్ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను



జిల్లా స్థాయి ఎంపికలకు పంపించాలని ఆదేశించారు. సంబంధిత వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, కోచ్‌లు ఎంపికైన విద్యార్థులను తప్పనిసరిగా వెంట తీసుకురావడంతోపాటు ప్రతి క్రీడాకారుడు ఎంపికల్లో పాల్గొనేలా బాధ్యత వహించాలని పేర్కొన్నారు. ఎంపికలకు వచ్చే ప్రతి క్రీడాకారుడు అర్హత ధ్రువీకరణ పత్రం, విద్యార్థి ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. అలాగే భోజనం చేసేందుకు వ్యక్తిగత ప్లేట్లు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. సంబంధిత వ్యాయామ విద్య ఉపాధ్యాయులు, కోచ్‌లు సైతం ఎంపికలకు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. ఏడు డివిజన్ల నుంచి ఎంపికైన క్రీడాకారులందరూ నిర్ణీత తేదీల్లో సమయానికి చేరుకుని జిల్లా స్థాయి ఎంపికలు విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ కోరారు.

లీ సర్వే పనుల్లో ప్రభుత్వ మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలి

- **నిర్ణీత గడువులోగా భూ సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి**
- **అధికారులకు ఆదేశించిన సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ**

భద్రాచలం, నవంబర్ 24 (జనంసాక్షి) : భూ పునఃసర్వే ప్రక్రియలో ప్రభుత్వ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ, భూముల వివరాలు, సరిహద్దులు, సర్వే పటాలను క్షుణ్ణంగా పరిశీలించాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ అధికారులను ఆదేశించారు. భూ రికార్డుల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించి, నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయాలని సూచించారు. మంగళవారం చర్ల మండలం గోగుపాక (జెడ్) గ్రామంలో జరుగుతున్న భూ పునఃసర్వే పనులను సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టాదారులతో మాట్లాడి సర్వే ప్రక్రియపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్,



సర్వేయర్, గిర్దావర్, గ్రామ ప్రణాళిక అధికారులు, లైసెన్స్ పొందిన సర్వేయర్లతో సమావేశమై గ్రామంలో చేపడుతున్న సర్వే పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూ వినియోగ సర్వే పునఃపరిశీలన పనుల పురోగతిని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ భూముల వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఖచ్చితమైన రికార్డులు రూపొందించాలని, సర్వే సమయంలో ఎలాంటి తప్పిదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పనులను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని, క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సర్వేయర్ బృందాన్ని ఆదేశించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నరసింహారావు, సర్వేయర్ రాజబాబు, గ్రామ ప్రణాళిక అధికారులు, రెవెన్యూ సిబ్బంది, లైసెన్స్ పొందిన సర్వేయర్లు పాల్గొన్నారు.

జగన్ కుటుంబానికి అండగా ఉంటాం



రంగారెడ్డి, నవంబర్ 24 (జనంసాక్షి) : ఇటీవల గుండెపోటుతో మరణించిన విలేకరి పల్లాటి జగన్ కుటుంబానికి అండగా ఉంటామని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి.రాంచందర్, ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య తెలిపారు. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.1.12 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కష్టకాలంలో జగన్ కుటుంబానికి సంఘం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చిన్ననాటి నుంచే పేదరికంతో పోరాడుతూ, విద్యార్థి, యువజన ఉద్యమాల్లో పనిచేసి, ప్రజా సమస్యలపై వార్తల ద్వారా అధికారులను స్పందింపజేసిన నిబద్ధత గల జర్నలిస్ట్ జగన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి సైదులు, ఇబ్రహీంపట్నం డివిజన్ అధ్యక్షుడు సిలువేరు యాదగిరితో పాటు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుడిగే రఘు, కార్యదర్శులు రాజశేఖర్, జగదీష్, నిరంజన్, సీనియర్ నాయకులు హాసిమ్, సీనియర్ జర్నలిస్ట్ జోగు శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు పి.వెంకటేష్, మణికుమార్, క్రాంతి కుమార్, అంజి, సహాయ కార్యదర్శి ఎర్ర లింగం, ఉపాధ్యక్షులు కందుకూరి నగేష్, పంది శ్రీను, శివ, బాలరాజు, గిరికాంత్, శ్రీశైలం, మల్లేష్, ఉపేందర్, కృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీకగా దేవరకొండ పెద్ద దర్గా ఉర్సు ఉత్సవాలు



దేవరకొండ, నవంబర్ 25 (జనం సాక్షి) : దేవరకొండ పట్టణంలోని ప్రసిద్ధ హజరత్ హాజీ హఫీజ్ మహమ్మద్ దుర్వేష్ ఖాద్రి ఖాదర్ షా వలి పెద్ద దర్గా ఉర్సు ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 27, 28 తేదీల్లో రెండు రోజులపాటు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు దర్గా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. హిందూ, ముస్లింలు అనే భేదం లేకుండా అన్ని వర్గాల ప్రజలు పాల్గొనే ఈ ఉర్సు ఉత్సవాలు దేవరకొండ ప్రాంతంలో మతసామరస్యం, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 27న ఎర్రారం గ్రామం నుంచి గంధం ఊరేగింపు ప్రారంభమై సాయంత్రం 7 గంటలకు దేవరకొండ పెద్ద దర్గాకు చేరుకోనుంది. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 28న దర్గా వద్ద దీపారాధన, జాతరతో పాటు ప్రత్యేక ఖవ్వాలి కార్యక్రమం భక్తులను అలరించనుంది. ఈ ఉర్సు ఉత్సవాలకు నల్గొండ జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ మొక్కులు చెల్లించుకోనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.రెండు రోజులపాటు జరిగే ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో ప్రజలు కులమతాలకు అతీతంగా పాల్గొని ఉర్సు ఉత్సవాలను విజయవంతం చేయాలని దర్గా ముజావర్లు మొహమ్మద్ బర్కత్ అలీ, మొహమ్మద్ అహ్మదుల్లా, మొహమ్మద్ జహంగీర్ పాషా, మొహమ్మద్ కరీముల్లా, మొహమ్మద్ గులాం హుస్సేన్, మొహమ్మద్ రషీద్, మొహమ్మద్ బాబా, మొహమ్మద్ అంజద్ తదితరులు కోరారు.

జిల్లాలో అట్టహాసంగా 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026'

ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 24 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 8వ ఎడిషన్ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్ - 2026' క్రీడలకు సంబంధించి ఖమ్మం జిల్లాలో విస్తృత స్థాయి ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించినట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8 జిల్లాలలోని 20 వేదికలలో డిసెంబర్ 11 నుండి 22 వరకు ఈ క్రీడలు జరగనుండగా, ఖమ్మం జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో డిసెంబర్ 17 నుండి 21 వరకు జాతీయ స్థాయి ఆర్చరీ (విలువిద్య) పోటీలు నిర్వహించబడుతున్నాయని కలెక్టర్ అన్నారు. ఈ క్రీడలపై విద్యార్థులు, యువత, సాధారణ ప్రజలలో విస్తృత అవగాహన కల్పించేందుకు నవంబర్ 16 నుండి డిసెంబర్ 22 వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నవంబర్ 26న ఖమ్మం నగరపాలక సంస్థతో పాటు వైరా, మధిర, కల్లూరు, సత్తుపల్లి, ఏదులాపురం మున్సిపాలిటీలు, అన్ని మండల స్థాయిలలో లోగో, మస్కట్ ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే మాల్స్, పార్కులు, బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు మరియు పోటీల వేదిక వద్ద కనీసం మూడు చోట్ల మస్కట్ సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయడంతో పాటు, కలెక్టరేట్, మున్సిపల్ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లలో మస్కట్ కటౌట్లు, స్టాండీలు, 'కౌంట్‌డౌన్ టు 2026' బోర్డులను ఏర్పాటు చేయనున్నట్లు అన్నారు.

నవంబర్ 30 నాటికి ప్రధాన కూడళ్లు, టోల్ గేట్లు, బస్ షెల్టర్ల వద్ద హోర్డింగ్‌లు, డిజిటల్ స్క్రీన్ల ద్వారా ప్రచారం కల్పించడంతో పాటు, భద్రతా అనుమతులకు లోబడి హాట్-ఎయిర్/హీలియం బెలూన్ లేదా భారీ మస్కట్ ఏర్పాటు, ప్రముఖ కట్టడాలకు క్రీడా రంగుల విద్యుత్ దీపాలంకరణ చేయనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 1 నాటికి పట్టణాలలోని ప్రజా గోడలు, ఫ్లైఓవర్లు, స్టేడియం ప్రహరీలపై క్రీడా నేపథ్యంతో కూడిన వాల్ ఆర్ట్ (మ్యూరల్స్) వేయించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు.

విద్యార్థులు, యువతను భాగస్వాములను చేసేందుకు డిసెంబర్ 1న జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, వృత్తి విద్యా కళాశాలల విద్యార్థులకు అత్యంత ప్రాధాన్యత కలిగిన 'ఖేలో తెలంగాణ గ్లోబల్ క్విజ్' (ఆన్‌లైన్) నిర్వహించనున్నామని, ఇందుకోసం ప్రతి విద్యా సంస్థలో ఒక నోడల్ టీచర్‌ను నియమించి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొనేలా చూడాలని సూచించారు. డిసెంబర్ 3న 'ఖేలో ఇండియా', మస్కట్ ఇతివృత్తంతో విద్యార్థులకు పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, ఉత్తమ చిత్రాలను క్రీడా వేదికల వద్ద ప్రదర్శించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 6న మండల, జిల్లా స్థాయిలలో ప్రజాప్రతినిధులు, విఐపిలు, ఎన్.ఎస్.ఎస్, ఎన్.సి.సి, యువజన సంఘాలు, క్రీడా సంఘాలు, సీనియర్ క్రీడాకారుల భాగస్వామ్యంతో మస్కట్ ప్రదర్శనతో కూడిన 'ఖేలో ఇండియా రన్ / వాకథాన్ / సైక్లోథాన్' వంటి భారీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

క్రీడల ముగింపు వరకు స్థానిక కేబుల్ టీవీలు, సినిమా హాళ్లు, ఎఫ్.ఎం రేడియో, పత్రికలు, సోషల్ మీడియా ద్వారా నిరంతర ప్రచారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అన్నారు. ఈ ప్రచార కార్యక్రమాల పర్యవేక్షణకు ప్రతి శాఖ ఒక నోడల్ అధికారిని నియమించుకోవాలని, జిల్లా యువజన, క్రీడల అధికారి సమన్వయకర్తగా వ్యవహరిస్తూ నివేదికలను ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు. జిల్లాలో జాతీయ స్థాయి పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు ఈ బాధ్యతలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి, నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. స్పష్టం చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
25.11.2026



ఆలయంలో మాజీ ఎమ్మెల్యే దాసరి ప్రత్యేకపూజలు

పెద్దపల్లి,నవంబర్ 24(జనంసాక్షి) :
పెద్దపల్లి మండలంలోని దేవునిపల్లి లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ఆశీర్వచనాలు అందజేశారు.అనంతరం దాసరి మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. స్వామివారి దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. దేవునిపల్లి గ్రామంతో పాటు పెద్దపల్లి నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరిపై ఆ లక్ష్మీనరసింహస్వామి వారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



పెద్దపల్లి,నవంబర్ 24(జనంసాక్షి) :
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల నూతన ఇంచార్జ్ గా నియమితులైన బి.ఎం. సందీప్ ని హైదరాబాద్ లోమర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక అభినందనలు తెలియజేసిన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.

సొంత ఇంటి పథకం అమలు కోసం నిర్వీరామ పోరాటాలు..

- మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం..
- సీఐటీయూ ప్రధానకార్యదర్శి తుమ్మల రాజారెడ్డి..



గోదావరిఖని, జనంసాక్షి : సింగరేణి కార్మికులకు సొంత ఇంటి పథకం అమలు కోసం నిర్వీరామ పోరాటాలు చేస్తున్నామని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి అన్నారు.మంగళవారం 12.30 గంటలకు కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌ను గోదావరిఖనిలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ సందర్భంగా తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సొంతింటి సాకారం, గత 5 సంవత్సరాలుగా విరామం లేని పోరాటం చేస్తున్నామన్నారు. సొంతింటి పథకం అవశ్యకత, విధివిధానాల వాటిపై వినతీపత్రం ఇచ్చారు.అలాగే అన్ని రకాలుగా లాభమైన ఈ పథకం అమలు కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చి సానుకూ లంగా మంత్రి వివేక్ వెంకటస్వామి స్పందించారు. సొంతిల్లు సాధించేవరకు సిఐటియు విరామం లేని పోరాటం నిర్వహించేందుకు సిద్ధంగా ఉందని, ఈ సంవత్సరంలోనే అది ప్రారంభం కావాలని కోరుకుం టున్నానన్నారు.అన్ని ఏరియాలలో ఈ పథకం అమలు అయ్యేలా పూర్తి బాధ్యతతో పనిచేస్తామని హామీ ఇచ్చారు.వినతీపత్రం ఇచ్చిన వారిలో ఆర్‌జీ-1 బ్రాంచ్ గౌరవ అధ్యక్షులు అరెపల్లి రాజమౌళి,అధ్యక్షులు వంగల శివరాంరెడ్డి,తోట నరహరిరావు, జనార్ధన్, సాయిప్రకాష్ ఉన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

బోధన్, నవంబర్ 24 (జనంసాక్షి) : బోధన్ మండలం భూలక్ష్మి క్యాంపులో గత రెండు రోజుల నుండి ట్రైనివ అధికారులు పలు అంశాలపై విస్తృతంగా పరిశీలిస్తుండగా అదే క్రమంలో మంగళవారం ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఈ మేరకు పథకంలో కూలీలు భాగస్వామ్యం ప్రభుత్వం వారికి ఏ విధంగా సహాయపడుతుంది రోజుకు ఎంత పని చేయాలి వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మీసేవ కేంద్రాన్ని సందర్శించి అక్కడ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరు, వివిధ సర్టిఫికెట్ల మంజూరు విషయంలో జరిగే విధానాన్ని పరిశీలించారు. వారి వెంట భూలక్ష్మి క్యాంప్ సర్పంచ్ బాల్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేందర్, ఫీల్డ్ అసిస్టెంట్, తదితరులు ఉన్నారు.



త్వరితగతిన కొనుగోళ్లు

- ధాన్యం,పత్తి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలి
- అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,నవంబర్ 24(జనంసాక్షి) : జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లతో పాటు పత్తి పంట కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు.సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు తో కలిసి ఖరీఫ్ ధాన్యం, పత్తి పంట కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే నాణ్యమైన ధాన్యాన్ని తేమ శాతం చూసి ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు సంబంధిత రైస్ మిల్లులకు తరలించాలని ఆదేశించారు.ధాన్యం కొనుగోలుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా ట్రక్ షీట్లను వెంటనే జనరేట్ చేయాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు, మిల్లులకు చేరిన ధాన్యానికి సంబంధించి మిల్లర్లు వెంటనే రసీదులు జారీ చేసేలా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.మార్కెట్‌కు వచ్చే ప్రతి పంటకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర లభించేలా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులు పండించిన పంటను విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, సీసీఐ మార్గదర్శకాల ప్రకారం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు మద్దతు ధరపై అవగాహన కల్పిస్తూ, ప్రతి రైతుకు న్యాయమైన ధర లభించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.ధాన్యం, పత్తి కొనుగోళ్ల ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు ధాన్యం తరలింపు వరకు ప్రతి దశను అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోళ్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ శ్రీకాంత్,జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, డి.సి.ఓ. శ్రీమాల,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగ ఖాళీల భర్తీ..

పెద్దపల్లి (జనంసాక్షి):జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో దివ్యాంగులకు రిజర్వు చేయబడిన 19 బ్యాక్‌లాగ్ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులైన దివ్యాంగ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ ఉద్యోగ ఖాళీలలో ఆఫీస్ సబార్డినేట్ 08, వాచ్‌మెన్ 02, కుక్ 02, కామాటి 01, పబ్లిక్ హెల్త్ వర్కర్ 04, స్వీపర్ 01, తోటి 01 పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఇవి గ్రూప్ కాని ఉద్యోగ ఖాళీలని పేర్కొన్నారు.ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, వాచ్‌మెన్ పోస్టులకు 5వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని సూచించారు. కుక్, కామాటి, పబ్లిక్ హెల్త్ వర్కర్, స్వీపర్, తోటి పోస్టులకు చదవడం, రాయడం వచ్చి ఉండాలని తెలిపారు.సంబంధిత ఉద్యోగాలకు నిర్దేశించిన విద్యార్హతల్లో సాధించిన మార్కులు, అభ్యర్థుల అంగవైకల్య శాతం, వయస్సు ప్రాతిపదికన ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.ఈ ఉద్యోగాలకు సంబంధించిన పూర్తి వివరాలు, అర్హతలు, నియమ నిబంధనలు, దరఖాస్తు ఫారాలు పెద్దపల్లి జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

సమష్టి కృషితోనే స్వర్ణోత్సవాల విజయం

సంఘం నాయకులకు మంత్రి శ్రీధర్ బాబు కానుకల అందజేత

పెద్దపల్లి,నవంబర్ 24(జనంసాక్షి) :
బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతి కోసం 50 ఏళ్లుగా పనిచేస్తున్న ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం స్వర్ణోత్సవాలను జయప్రదం చేసిన నాయకులు,కార్యకర్తల కృషి మరువలేనిది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో ఈ వేడుకలు అత్యంత వైభవంగా సాగాయి అని స్వర్ణోత్సవ మహాసభను స్వర్ణోత్సవ కమిటీ చైర్మన్,సంఘం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య,జిల్లా అధ్యక్షుడు లంక సదయ్య అన్నారు.జిల్లా అధ్యక్షుడు లంక సదయ్య ఆధ్వర్యంలో మంగళవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో స్వర్ణోత్సవాల సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ గడియారాలను సమకూర్చగా వివిధ మండలాల నుండి తరలివచ్చిన రాష్ట్ర,జిల్లా,మండల కమిటీ నాయకులకు వారు తమ చేతుల మీదుగా గోడ గడియారాలను అందజేశారు.ఈ సందర్భంగా మామిడిపల్లి బాపయ్య, లంక సదయ్యలు మాట్లాడుతూ స్వర్ణోత్సవ సభ నిర్వహణకు ఆర్థికంగా అండగా నిలిచిన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు,డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి,అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ప్రభుత్వ విప్,పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు,ఎంపీ గడ్డం వంశీకృష్ణ, పెద్దపల్లి డీసీసీ రామిరెడ్డి,ఎస్సీ,ఎస్టీ కమిషన్ సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణ, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్,ఆసంపల్లి లక్ష్మీ ఫౌండేషన్ చైర్మన్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆసంపల్లి వాసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా వేడుకలకు విచ్చేసిన జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్,మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్,కోరుకంటి చందర్‌లతో పాటు సంఘం జాతీయ అధ్యక్షులు ఎస్.వరుణ్ కుమార్,రాష్ట్ర అధ్యక్షులు కాడారం వినయ్ కుమార్,ఇతర జాతీయ, రాష్ట్ర కమిటీ బాధ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తూ,సభ విజయవంతానికి శ్రమించిన మండలాల నాయకులు, కార్యకర్తలను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, ఉత్తర తెలంగాణ జిల్లాల ఇన్‌చార్జి బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కవ్వంపల్లి సతీష్, రాష్ట్ర కార్యదర్శి పాల రాజేశం, నాయకులు ఇంటిబిల్లి రవీంద్ర కుమార్, సంకెనపల్లి లక్ష్మయ్య, సుంచు మల్లేష్, చొప్పదండి మల్లేష్, బొల్లి నందయ్య, కాంపల్లి నర్సయ్య, పెరిక బానేష్, బాదే వెంకటేష్, కాసిపేట పోచం, కన్నూరి బాబు, బూడిద సమ్మయ్య, పుల్లూరి మహేందర్, మహిళా నాయకురాళ్లురామలక్ష్మి, విజయ తదితరులు పాల్గొన్నారు.





తాగునీటి సమస్యకు పరిష్కారం

సుల్తానాబాద్(జనంసాక్షి) :
మున్సిపాలిటీ 7వ వార్డులోని మేకల సదానందం ఇంటి నుండి మేకల స్వామి ఇంటి వరకు గత కొన్ని సంవత్సరాలుగా పైప్‌లైన్ దెబ్బతినడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై పలుమార్లు గత పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో, స్థానిక ప్రజలు ఈ విషయాన్ని 7వ వార్డు కౌన్సిలర్ ఉట్ల వర ప్రదీప్ దృష్టికి తీసుకెళ్లారు.వెంటనే స్పందించిన కౌన్సిలర్ వర ప్రదీప్ మున్సిపల్ చైర్‌పర్సన్ బిరుదు రాధాకృష్ణ తో,కమిషనర్ రమేష్ తో మాట్లాడి నూతన పైప్‌లైన్ ఏర్పాటుచేసి సమస్యను పరిష్కారం చేశారు.ఈ కార్యక్రమంలో దాసరి విజయ్, పలువురు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

బస్‌స్టేషన్‌లో రద్దీని పర్యవేక్షించిన ఆర్టీసీ ఈడీ

కరీంనగర్ టౌన్ (జనంసాక్షి):కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని కరీంనగర్‌లోని బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల రద్దీని కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ మంగళవారం స్వయంగా పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల రద్దీ, బస్సుల రాకపోకలు, ప్రయాణికుల రవాణా పరిస్థితులను పరిశీలించారు.బస్‌స్టేషన్‌లోని పోలీస్ ఔట్‌పోస్టును కూడా తనిఖీ చేశారు. పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని బస్‌స్టేషన్‌లో పరిస్థితులను పరిశీలించినట్లు తెలిపారు. ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో ఈడీ కార్యదర్శి వి. శ్రవణ్ కుమార్, జోనల్ కార్యాలయ సూపర్‌వైజర్ కె. గీతాకృష్ణ పాల్గొన్నారు.



చర్చిలకు రూ.30 వేల ఆర్థిక సహాయం

- అర్హులైన చర్చి కమిటీలు దరఖాస్తు చేసుకోవాలి
- జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి జి. రవి కుమార్



పెద్దపల్లి,నవంబర్ 24(జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ పండుగ-2026 సందర్భంగా క్రైస్తవ మైనారిటీల సంక్షేమం కోసం చర్చిలకు వైట్ వాషింగ్ (సున్నం వేయడం), విద్యుత్ దీపాలంకరణ నిమిత్తం ఒక్కో చర్చికి రూ.30,000 ఆర్థిక సహాయం అందించనున్నట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి జి. రవి కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద ఎంపికైన ఒక్కో చర్చికి రూ.30,000 ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఇందులో వైట్ వాషింగ్ కోసం రూ.20,000, విద్యుత్ దీపాలంకరణ కోసం రూ.10,000 కేటాయించినట్లు వివరించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్చి తప్పనిసరిగా రిజిస్టర్ అయి ఉండాలని, గుర్తింపు పొందిన చర్చి కమిటీ ఉండాలని తెలిపారు. చర్చి కమిటీ పేరిట బ్యాంకు ఖాతా ఉండాలని, చర్చి పేరిట ఖాతా లేని పక్షంలో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అధ్యక్షుడు, కార్యదర్శి లేదా కోశాధికారి పేరిట ఉన్న ఉమ్మడి బ్యాంకు ఖాతాను పరిగణనలోకి తీసుకుంటారని పేర్కొన్నారు. అర్హత కలిగిన చర్చి కమిటీ అధ్యక్షుడు లేదా కార్యదర్శి మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.2026 సంవత్సరంలో కొత్తగా దరఖాస్తు చేసుకునే అర్హత కలిగిన చర్చిలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. కేటాయించిన లక్ష్యం పూర్తికాని పక్షంలో మాత్రమే 2025 సంవత్సరంలో ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం పొందిన చర్చిలను కూడా పరిగణనలోకి తీసుకుంటారని వివరించారు.అర్హత కలిగిన చర్చి కమిటీల అధ్యక్షులు లేదా కార్యదర్శులు నవంబర్ 30, 2026లోగా తెలంగాణ ఓ బి ఎం ఎం ఎస్ అధికారిక వెబ్‌సైట్ ఎచ్ టి టి పి ఎస్//టి జి ఓ బి ఎం ఎం ఎస్ సిగ్ గౌ ఇన్ / ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు పూర్తి చేసిన అనంతరం దాని ప్రింట్ కాపీతో పాటు చర్చి రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం, చర్చి కమిటీ వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఇతర అవసరమైన పత్రాలను జతచేసి జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయం, పెద్దపల్లిలో సమర్పించాలని తెలిపారు.ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో గరిష్టంగా 25 చర్చిలను మాత్రమే ఎంపిక చేయడం జరుగుతుందని, సంబంధిత కమిటీల పరిశీలన అనంతరం ప్రభుత్వ నిబంధనల ప్రకారం తుది ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు.కావున పెద్దపల్లి జిల్లాలోని అర్హత కలిగిన క్రైస్తవ చర్చి కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నవంబర్ 30లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారి జి. రవి కుమార్ కోరారు.

గోదావరి జలాల శుద్ధిపై ప్రత్యేక శద్ధ

- సంస్థపై దుష్ప్రచారం చేయడం సరికాదు..
- సింగరేణి ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్..



గోదావరిఖని, జనంసాక్షి : గోదావరి నది నుంచి సేకరించిన నీటిని సింగరేణి కార్మికులకు, పరిసర ప్రాంత ప్రజలకు సరఫరా చేసే ముందు పలుదశల్లో శుద్ధి చేసి సరఫరా చేయడంజరుగుతుందని సింగరేణి ఆర్‌జీ-1 జీఎం డి. లలిత్‌కుమార్ తెలిపారు.నీటిని ఒకటిరెండు దశల్లో కాకుండా రెండుమూడు దశల శుద్ధి ప్రక్రియల ద్వారా వడపోసిన అన తంరమే ప్రజలకు, కార్మికులకు పంపిణీ చేయడ జరుగుతోందని జీఎం పేర్కొన్నారు. అతేకాకుండా, ప్రతి రెండు నెలలకు ఒకసారి ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థ దారా నీటి నమూనాలను పరీక్షలకు పంపించడం జరుగుతోందని తెలిపారు.ఫిల్టర్ బెడ్ నీటితో పాటు ఆర్ఓ ప్లాంటు నీటిని కూడా పరీక్షించడం జరుగుతోందన్నారు.నీటి నాణ్యత, శుద్ధి,సరఫరాపై సిగరేణి యాజమాన్యం నిరతంర పర్యవేక్షణ కొనసాగిస్తోందని తెలిపారు.అయితే, ఈ అంశంపై ఏవైనా సందేహాలు లేదా ఫిర్యాదులు ఉన్నట్లయితే సంబంధిత జనరల్ మేనేజర్‌ని లేదా సంబంధిత అధికారులను సంప్రదించి వాస్తవాలను తెలుసుకోవాలని, అధికారులను సంప్రదించకుండా, క్షేత్రస్థాయి పరిస్తితులను పరిశీలించకుండా సంస్థపై అవాస్తవ ప్రచారం చేయడం దురదృష్టకరమని జీఎం పేర్కొన్నారు.ఇది సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ఉందన్నారు.సాధారణగా పాత పైపులను మరమ్మతులు లేదా మార్పులు చేసే సందర్భంలో మాతమే పైపులో పేరుకుపోయిన మట్టి లేదా ఇతర అవక్షేపాలు నీటిలోకి చేరే అవకాశం ఉంటుందన్నార.అలాంటి సందర్భాల్లో అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుదన్నారు.దీనిని నిరంతర నీటి కాలుష్య సమస్యగా చిత్రీకరించడ ం సరికాదన్నారు.సుమారు 7వేలు ఆర్‌జీ-1ఏరియాకు, ఆర్‌జీ-2,3 పరిధిలో మరో 3,000 కుటుంబాలకు, గోదావరిఖని పరిసర ప్రాంత ప్రజలతో కలిపి సుమారు 25వేల కుటుంబాలకు సింగరేణి ద్వారా నీటి సరఫరా జరుగుతోందన్నారు.ప్రజలకు నాణమైన తాగునీరు అందించేందుకు సంస్థ గణనీయమైన మొత్తాన్ని ఖర్చు చేస్తూ అవసరమైన చర్యలు చేపడుతోందని జీఎం లలిత్‌కుమార్ పేర్కొన్నారు.

ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ పోరాటం

26న సంవిధాన్ రక్షా మార్చ్-రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ: ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్



గోదావరిఖని, జనంసాక్షి :
ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ పోరాటం చేస్తోందని రామగుండం శాసనసభ్యులు, పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు.గోదావరిఖని గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల ఓట్లు తొలగించారనే అంశంపై ఆందోళన వ్యక్తం చేశారు.ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, ఇప్పటికే ఉన్న ఓటర్ల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.ఓటు హక్కును పరిరక్షించడం,రాజ్యాంగ విలువలను కాపాడటం లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండాలని, ఓటర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సంవిధాన్ రక్షా మార్చ్‌కు కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని సూచించారు.రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీసీసీ పిలుపు మేరకు ఈ నెల 26వ తేదీ గురువారం టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీగా సంవిధాన్ రక్షా మార్చ్-రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.ర్యాలీలో పెద్దపల్లి జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ ర్యాలీ 26వ తేదీ ఉదయం 10:30 గంటలకు ట్యాంక్ బండ్ వద్ద ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం (లిబర్టీ) నుంచి ప్రారంభమై నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు కొనసాగుతుందని వెల్లడించారు.ఏఐసీసీ ఇంచార్జ్ బిఎం సందీప్‌కుమార్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొననున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సంవిధాన్ రక్షా మార్చ్‌ను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ విజ్ఞప్తి చేశారు. మన ఓటు-మన హక్కు, ప్రజాస్వామ్యం-మన బలం అనే నినాదంతో ఓటు హక్కును, రాజ్యాంగ స్ఫూర్తిని, ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.ఈ విలేకరుల సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య,కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండీ ముస్తఫా, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దుబాయ్‌లో కార్తీక వనభోజనాలు

పద్మశాలి కుటుంబాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ

సుల్తానాబాద్(జనంసాక్షి) : దుబాయ్‌లోని అల్ ఖుసైస్ పాండ్ పార్క్‌లో యూఏఇ పద్మశాలి కుటుంబాల ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజనాలను ఘనంగా, ఉత్సాహభరితంగా నిర్వహించారు. ఈ వేడుకకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లోని వివిధ ప్రాంతాల నుండి 200 మందికి పైగా పద్మశాలి కుటుంబ సభ్యులు, చిన్నారులు, మహిళలు, పెద్దలు పాల్గొని వన భోజనాల కార్యక్రమాన్ని ఉల్లాసభరితంగా జరుపుకున్నారు.విదేశాల్లో నివసిస్తున్న పద్మశాలి కుటుంబాల మధ్య ఆత్మీయతను పెంపొందించడం, మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడం, అందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడం కోసమే వనభోజనాలను నిర్వహించినట్లు నిర్వాహకులు సదానంద్, లక్ష్మీనారాయణ, అశోక్ తెలిపారు.ప్రకృతి ఒడిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ వేడుకలో ఆటపాటలు, నవ్వులు, సందడితో పార్క్ అంతా పండుగ వాతావరణం నెలకొంది.కార్యక్రమంలో నిర్వహించిన వివిధ రకాల సరదా ఆటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా దంపతుల కోసం నిర్వహించిన కపుల్స్ గేమ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భార్యాభర్తలు ఉత్సాహంగా పాల్గొని తమ సరదా, చమత్కారాలతో అందరినీ నవ్వించారు. చిన్నారులు, మహిళలు, పెద్దలు సైతం వివిధ ఆటల్లో పాల్గొని ఆనందంగా గడిపారు.సంగీతం, పాటలతో కార్యక్రమానికి మరింత కళ వచ్చింది. పలువురు తమ గాన ప్రతిభను ప్రదర్శించి అందరినీ అలరించారు.

తెలుగు వంటకాలతో విందు భోజనం :
వనభోజనాల్లో మరో ప్రత్యేక ఆకర్షణ నోరూరించే రుచికరమైన తెలుగు సంప్రదాయ వంటకాలు. ఆత్మీయంగా అందించిన రుచికరమైన భోజనాన్ని కుటుంబ సభ్యులందరూ కలిసి ఆస్వాదించారు. విదేశాల్లో ఉన్నప్పటికీ మన ఇంటి భోజనాన్ని, పల్లెటూరి వనభోజనాల అనుభూతిని గుర్తుచేసేలా ఆహార ఏర

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
25 నవంబర్ 2026



ఓఆర్ఆర్ ఎగ్జిట్-11 మృత్యుమార్గం

50 ప్రమాదాలు.. 11 మంది బలి
మరో 30 మందికి తీవ్ర గాయాలు

- ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు.. రోడ్డుపైనే పార్కింగ్
- ఇన్ని ప్రాణాలు పోయినా అధికారుల్లో చలనం ఏదీ?
- 11 కుటుంబాల్లో తీరని విషాదం.. 30 మంది బాధితులు

అబ్దుల్లాపూర్‌మెట్ నవంబర్24 (జనం సాక్షి):

రహదారిపై ప్రయాణం అంటేనే ప్రజలు భయపడే పరిస్థితి నెలకొంది. మైసమ్మ గుడి నుంచి ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఎగ్జిట్ నంబర్-11 వరకు రహదారి ప్రమాదాలకు అడ్డాగా మారుతోంది. అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని ఈ మార్గంలో 2026 జనవరి 1 నుండి ఇప్పటివరకు సుమారు 50 రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకోగా, 11 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 30 మంది క్షతగాత్రులయ్యారు. ఈ గణాంకాలు రహదారిపై నెలకొన్న ప్రమాదకర పరిస్థితులకు అద్దం పడుతున్నాయి. పదకొండు కుటుంబాల్లో విషాదాన్ని నింపి, 30 మందిని ప్రమాద బాధితులుగా మార్చిన ఈ ఘటనలు అధికార యంత్రాంగానికి కనిపించడం లేదా? అన్న ప్రశ్నలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి.

అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) ఎగ్జిట్ నంబర్-11 సమీపంలో ప్రయాణం రోజురోజుకూ ప్రమాదకరంగా మారుతోంది. విజయవాడ జాతీయ రహదారి-65పై అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి అంబర్‌పేట వైపు వెళ్లే మార్గంలో నిత్యం ఏదో ఒక చోట ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా సంబంధిత శాఖల అధికారుల్లో మాత్రం కదలిక కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు, రహదారులపైనే వాహనాల నిలుపుదల, పార్కింగ్ సౌకర్యం లేని వాణిజ్య సంస్థల నిర్వహణతో ఈ ప్రాంతం ప్రమాదాలకు నిలయంగా మారుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పార్కింగ్ స్థలాలు లేక రోడ్డుపైనే వాహనాలు

ఓఆర్ఆర్ ఎగ్జిట్-11 సమీపంలో రహదారికి ఇరువైపులా అనేక వాణిజ్య సంస్థలు వెలుస్తున్నాయి. అయితే ఆయా సంస్థలకు అవసరమైన పార్కింగ్ సదుపాయాలు ఉన్నాయా? నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకున్నాయా? అనే అంశాలపై సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో భారీ వాహనాలు, కార్లు, ఇతర వాహనాలను నేరుగా ప్రధాన రహదారిపైనే నిలిపివేస్తున్నారు. నాలుగు లైన్లలో వాహనాలు సాఫీగా ప్రయాణించాల్సిన రహదారిపై అక్రమ పార్కింగ్ కారణంగా రెండు లైన్లకే పరిమితమవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. పాదచారుల సౌకర్యార్థం నిర్మించిన ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. దుకాణాలు, టీ కొట్లు, ఇతర వ్యాపారాలు ఫుట్‌పాత్‌లపైనే నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గుట్కా విక్రయాలు, బెల్ట్ షాపుల నిర్వహణపై కూడా స్థానికుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ట్రాఫిక్ సిబ్బంది దృష్టికి రాని సమస్యా?

ఓఆర్ఆర్ ఎగ్జిట్-11 పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యలు ప్రతిరోజూ కనిపిస్తున్నప్పటికీ వాటి పరిష్కారానికి పూర్తిస్థాయి చర్యలు ఎందుకు చేపట్టడం లేదన్నది చర్చనీయాంశంగా మారింది. ట్రాఫిక్ సిబ్బంది ఈ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నా రహదారులపై వాహనాల నిలుపుదల, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలు కొనసాగుతుండటంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా వాణిజ్య సంస్థలకు అనుమతులు మంజూరు చేసే సమయంలో పార్కింగ్ సదుపాయాలు, రహదారి భద్రత, ఫుట్‌పాత్‌ల పరిరక్షణ వంటి అంశాలను పరిశీలించారా? అనుమతులు లేకుండా నిర్మాణాలు లేదా వ్యాపారాలు కొనసాగు తున్నాయా? ఉంటే ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదనే అంశాలపై మున్సిపల్ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ సమస్య ఒక్క ట్రాఫిక్ శాఖతోనే పరిష్కారమయ్యేది కాదు. ట్రాఫిక్ పోలీసులు, స్థానిక పోలీసు శాఖ, మున్సిపల్ అధికారులు, జాతీయ రహదారుల సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది.

అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల ఉక్కుపాదం

ఆత్మకూర్ వాగులో మెరుపు దాడులు.. ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టివేత

- వాహన యజమానులపై కేసుల నమోదు
- అనుమతులు లేకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక



మెట్‌పల్లి, నవంబర్ 24 (జనంసాక్షి): అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు మెట్‌పల్లి పోలీసులు ప్రత్యే క నిఘా చేపట్టారు. ఇందులో భాగంగా ఆత్మకూర్ గ్రామ శివారులోని వాగులో మెరుపు దాడులు నిర్వహించి, అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. TS 21 B 2055, TS 21 E 3315, TS 21 M 0131 నంబర్లు గల ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వాహన యజమానులపై కేసులు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం ట్రాక్టర్లను మెట్‌పల్లి తహసీల్దార్ కార్యాలయ అధికారులకు అప్పగించారు. హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వర్‌తో పాటు కానిస్టేబుళ్లు మల్లేష్, శ్రీనివాస్, కృష్ణంరాజు ఈ దాడుల్లో పాల్గొన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. సహజ వనరుల అక్రమ రవాణాపై నిరంతర నిఘా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అక్రమ ఇసుక రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

లేబర్ కార్డుల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి

- మీ-సేవలోనే 90 రోజుల పని అనుభవ ధ్రువీకరణ తప్పనిసరి చేయాలి
- భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి డిమాండ్



రామగిరి, నవంబర్ 24 (జనంసాక్షి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు నిజమైన కార్మికులకు మాత్రమే అందేలా లేబర్ కార్డుల రిజిస్ట్రేషన్ విధానంలో ప్రభుత్వం సమూల మార్పులు తీసుకురావాలని భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి డిమాండ్ చేశారు. లేబర్ కార్డుల జారీలో అనర్హుల నమోదు, అక్రమాలను అరికట్టాలంటే దరఖాస్తు స్వీకరించే మొదటి దశలోనే కఠినమైన నిబంధనలు అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా మీ-సేవ కేంద్రాల్లో లేబర్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే సమయంలోనే కనీసం 90 రోజుల భవన నిర్మాణ రంగ పని అనుభవ ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరిగా సమర్పించే విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించారు. ప్రభుత్వం పెళ్లి కానుక, ప్రసూతి ప్రయోజనం, డెత్ క్లెయిమ్ వంటి సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను తప్పనిసరిగా అడుగుతున్నట్లుగానే, లేబర్ కార్డు రిజిస్ట్రేషన్ సమయంలో కూడా 90 రోజుల పని అనుభవ ధ్రువీకరణ పత్రాన్ని తప్పనిసరి చేయాలని అన్నారు. కేవలం దరఖాస్తు స్వీకరించి తర్వాత పరిశీలించడం కాకుండా, దరఖాస్తు సమర్పించే సమయంలోనే 90 రోజుల పని అనుభవ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా జతచేసేలా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు తీసుకురావాలని కోరారు. ఈ విధానం అమలైతే అనర్హుల నమోదు, లేబర్ కార్డుల దుర్వినియోగాన్ని ప్రారంభ దశలోనే అరికట్టవచ్చని, ప్రభుత్వ సంక్షేమ నిధులు నిజంగా భవన నిర్మాణ రంగంలో పనిచేసే కార్మికులకే అందుతాయని చిలువేరు స్వామి పేర్కొన్నారు.

అంజన్న అనుగ్రహం కొండంతా భక్తజనం

లక్షకు పైగా భక్తులు అంజన దర్శనం

- అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇబ్బందులు పడ్డామంటూ భక్తుల అసహనం



మల్యాల (జనంసాక్షి) : తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రం జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని కొండ గట్టులోని శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానములో సుమారు 60 సంవత్సరాల అనంతరం నిర్వహి స్తున్న చందనోత్సవ నిజరూప దర్శనానికి మంగళవారం సుమారు లక్ష యాభై వేలకు పైగా భక్తులు అంజన్నను దర్శించుకున్నారు.కార్తీక పౌర్ణమి,గిరిప్రదక్షిణ, స్వామి వారి పర్వది నము కావడంతో భక్తులు అంజన్న దర్శనానికి పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో కొండగట్టుకు తరలివచ్చారు. అంజన్నను దర్శించుకునేందుకు భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. ఓ సందర్భంలో భక్తులు ఓపిక నశించి బారికెట్లను కూడా తోసేసుకొని వచ్చారు, క్యూలైన్లలో తోపులాటలు,చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఇబ్బందులకు గురయ్యారు. భక్తుల తాకిడికి తగ్గట్టుగా అధికారులు సరియైన ఏర్పాట్లు చేయకపోవడంతో భక్తులు తీవ్ర అసహనానికి లోనయ్యారు. ఒక దశలో భక్తుల తాకిడి ఒక్కసారిగా పెరగడంతో ఆలయ అధికారులు కొద్దిసేపు ప్రధాన ద్వారాన్ని మూసివేశారు. దీంతో దర్శనం కోసం వచ్చిన భక్తులు తీవ్ర అసహనానికి గురయ్యా రు. భక్తులకు కనీస సౌకర్యాల కల్పనలో అధికారుల విఫలమయ్యారంటూ భక్తులు వ్యక్తం చేశారు.

పోలీస్ క్రీడా సంబరాలకు నిజామాబాద్ సిద్ధం

- నేటి నుంచి 28 వరకు రాష్ట్రస్థాయి పోటీలు
- వివిధ జిల్లాల నుంచి 1,000 మంది క్రీడాకారుల రాక
- స్విమ్మింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ తదితర విభాగాల్లో పోటీలు
- అన్ని ఏర్పాట్లు పూర్తి: పోలీస్ కమిషనర్ సాయి చైతన్య

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 24 జనం సాక్షి:

నిజామాబాద్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2026, ముగింపు వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుండి విచ్చేస్తున్న పోలీస్ క్రీడాకారు లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టడం జరిగింది.ఈ క్రీడా పోటీలు నవంబర్ 25 నుండి నవంబర్ 28, 2026 వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించబడనున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ పోలీస్ యూనిట్లు, జిల్లాలకు చెందిన సుమారు 1,000 మంది క్రీడాకా రులు ఈ క్రీడా పోటీలలో పాల్గొననున్నారు. పోలీస్ సిబ్బందిలో క్రీడా ప్రతిభను వెలికితీయడం, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, పోటీతత్వం, పరస్పర స్నేహభావాన్ని పెంపొందించడం ఈ క్రీడా మీట్ ప్రధాన ఉద్దేశం అని కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య అన్నారు.

వివిధ క్రీడా విభాగాల్లో పోటీలు



ఈ క్రీడా మీట్‌లో ప్రధానంగా స్విమ్మింగ్, అథ్లెటిక్స్, ఆర్చరీ, వాటర్ స్పోర్ట్స్, సైక్లింగ్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఆయా క్రీడలకు అనుగుణంగా క్రీడా వేదికలను సిద్ధం చేయడంతో పాటు, పోటీలు సజావుగా జరిగేలా అవసరమైన సాంకేతిక , నిర్వహణపరమైన ఏర్పాట్లు చేపట్టారు. క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, పోటీల నిర్వహణలో పారదర్శకత, సమయపాలన, క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. క్రీడాకారులకు సమగ్ర సౌకర్యాలు రాష్ట్రం లోని వివిధ జిల్లాల నుండి నిజామాబాద్‌కు చేరుకుంటున్న క్రీడాకా రుల కోసం వసతి, భోజనం, తాగునీరు, రవాణా, వైద్య సదుపాయా లు, భద్రత తదితర అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.క్రీడాకారుల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన వైద్య బృందాలను అందుబాటులో ఉంచడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సహాయం అందించేలా చర్యలు తీసుకున్నారు. క్రీడా ప్రాంగణాలు, వసతి కేంద్రాలు, పోటీలు నిర్వహించే ప్రాంతాల్లో పరిశుభ్రత, భద్రత, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలను పర్యవేక్షించి సిద్ధం చేశారు. క్రీడాకారులు, అధికారులు, సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా రవాణా, ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సమన్వయంతో విజయవంతమైన నిర్వహణకు చర్యలు క్రీడా పోటీల నిర్వహ ణలో పాల్గొనే అన్ని విభాగాల అధికారులు, సిబ్బందికి బాధ్య తలు కేటాయించి, పరస్పర సమన్వయంతో పనిచేసేలా చర్యలు తీసుకున్నారు. క్రీడా వేదికల వద్ద అవసరమైన సిబ్బందిని నియమించి, ప్రతి విభాగంలో పోటీలు సజావుగా జరిగేలా పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశారు. నిజామాబాద్ జిల్లాలో నిర్వహించనున్న ఈ రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడా వేడుకలు పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచేలా, క్రీడాకారులకు మంచి అనుభూతిని అందించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గౌరవనీ యులు నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య వెల్లడించారు. తెలంగాణ పోలీస్ శాఖలో క్రీడా స్ఫూర్తి, ఐక్యత, క్రమశిక్షణ, ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ 5వ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్-2026 లక్ష్యం.

మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

- రుద్రంగిలో ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జాతర తిరునాళ్లు



రుద్రంగి నవంబర్ 24 (జనం సాక్షి): రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో కొలువైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర తిరునాళ్లు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జాతరలో భాగంగా భక్తులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ముందుగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి అన్నదానంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జాతర తిరునాళ్లు భక్తిభావంతో పాటు గ్రామాల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ సామ మోహన్ రెడ్డి తెలిపారు. అన్నదానం వంటి పుణ్యకార్యక్రమాలకు అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్వామివారిని వేములవాడ బిజెపి ఇన్చార్జ్ చేన్నమనేని వికాస్ రావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, తుల ఉమలు దర్శించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు వారికి ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు.కార్యక్రమంలో సర్పంచ్ గండి నారాయణ,ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి,ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు విరాళాలు అందించిన దాతలు పాల్గొన్నారు. జాతరకు వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై మోతిరాం అన్నారు. మంగళవారం భక్తుల యొక్క చైను డబ్బులు గుర్తుతెలియని దొంగలు దొంగిలించారని జాతరకు వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండి విలువైన వస్తువుల పట్ల అప్రమత్తతతో మెలిగాలని భక్తులకు ఆయన సూచించారు.

'ప్రజావాణి'కి అధికారుల డుమ్మా..

ఆగ్రహం వ్యక్తం చేసిన అదనపు కలెక్టర్

- అధికారులు, ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) : ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ప్రాముఖ్యత గల 'ప్రజావాణి' పట్ల ఉదాసీనతగా వ్యవహరిస్తున్న అధికారులు, ఉద్యోగులపై జిల్లా అదనపు (స్థానిక సంస్థలు) కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావాణికి ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరు కావడంతోపాటు తమ శాఖల నుంచి ఏ ఉద్యోగి అక్కడ లేకపోవడంపై సీరియస్ అయ్యారు. ప్రజావాణి పట్ల సమయపాలన పాటించకపోవడంపై భగ్గుమన్నారు. అదనపు కలెక్టర్ ఉదయం 10.30 గంటలకు ప్రజావాణికి హాజరుకాగా...ఆ సమయంలో కనీసం 30 మంది అధికారులు, ఉద్యోగులు కూడా రాలేదు. "ఏ అధికారి కూడా రాకుండా.. నేను మాత్రమే వచ్చి ఏం చేయాలి. ప్రజావాణి సమయం ఏంటి? తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, విధిగా హాజరుకావాలని రెండు నెలల కిందటే డీఆర్ఓ ఆదేశించారు. అయిన రాలేని పరిస్థితి ఉంటే సదరు శాఖ తరఫున ఇతర ఉద్యోగిని పంపాలని చెప్పారు. మరెందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు? జిల్లాలో 27 మంది తహసీల్దార్లకుగాను.. 8 మందే ఇక్కడ ఉన్నారు. 19 మంది రాలేదు. కనీసం ఈ మండలాల నుంచి ఒకరినైనా పంపాలి కదా. దీనిపై ఉపేక్షించేది లేదు. అటువంటి వారికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నా. ఇకపై ఇది కొనసాగుతుంది. ఆ శాఖ జిల్లా అధికారులే ఇందుకు బాధ్యులు' అని ఘాటుగా స్పందించారు. జిల్లాలో సుమారు 35 మందికి నోటీసులు జారీ చేయడం విశేషం. ఈ జాబితాలో 9 మంది జిల్లాస్థాయి అధికారులతోపాటు ఆర్డీఓ కార్యాలయ, మున్సిపాలిటీల ఉద్యోగులు, తహసీల్దార్లు ఉండడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం అదేవిధంగా ప్రజావాణి కి,శాఖల వారీగా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి ఎన్ని పరిష్కరించడం జరిగింది ఎన్ని పరిష్కరించలేమో ఎందుకు పరిష్కరించలేమో దృష్టి సారించాలని వచ్చే ప్రజావాణి కి,సరిగ్గా 10:30,గంటల వరకు రాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు...

ధాన్యం, పత్తి కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు
- కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి
- పత్తి ధరలపై రైతులకు అవగాహన కల్పించాలి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశం



పెద్దపల్లి, నవంబర్ 24 (జనంసాక్షి): జిల్లాలో ఖరీఫ్ ధాన్యం, పత్తి కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి. శ్రీరాములుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తేమ శాతాన్ని పరిశీలించి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేంద్రాల్లో నిల్వ చేయకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి ట్రక్‌షీట్లు వెంటనే జనరేట్ చేయాలని ఆదేశించారు. మిల్లులకు చేరిన ధాన్యానికి వెంటనే రసీదులు జారీ చేసేలా పర్యవేక్షించాలన్నారు. పత్తి కొనుగోళ్లను సీసీఐ నిబంధనలు, నాణ్యతా ప్రమాణాల ప్రకారం చేపట్టాలని సూచించారు. తేమ శాతాన్ని బట్టి లభించే ధరల వివరాలను రైతులకు తెలియజేసేలా జిన్నింగ్ మిల్లులు, కొనుగోలు కేంద్రాల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, మేనేజర్ శ్రీకాంత్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, డీసీవో శ్రీమాల తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల నిరీక్షణకు తెర.. 812 మందికి చేయూత

- ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి కొత్త పింఛన్లు
- అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- నాలుగు గ్యారంటీలు అమలు చేశాం.. మరో రెండు అమలు చేస్తాం
- రూ.1.83 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన



ఎండపల్లి, నవంబర్ 24 (జనంసాక్షి): ఏళ్లుగా పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న వారి నిరీక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం తెరదించిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంగళవారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రంలో వెల్గటూర్, ఎండపల్లి మండలాలకు మంజూరైన కొత్త చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో నాలుగు గ్యారంటీలను అమలు చేశామని, మరో రెండు అమలు చేస్తామని తెలిపారు. అర్హులకు కొత్త రేషన్ కార్డులతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త పింఛన్ల మంజూరు చేశారని పేర్కొన్నారు. రెండు మండలాలకు కలిపి 812 పింఛన్ల మంజూరయ్యాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి సంక్షేమ పథకాలు అందించాలని అధికారులకు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు కూడా ఇవ్వలేదని విమర్శి ంచారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, సంక్రాంతి తర్వాత నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. అనంతరం వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.1.83 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మార్కెట్ యార్డుకు మరిన్ని నిధులు కేటాయించడంతో పాటు ప్రధాన రహదారి నుంచి మార్కెట్ వరకు డబుల్ రోడ్డు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జిల్లాలో 19 ఉద్యోగ ఖాళీలు.. విద్యార్హత, వైకల్య శాతం, వయస్సు ఆధారంగా ఎంపిక.. డిసెంబర్ 10లోగా దరఖాస్తుల సమర్పణ

పెద్దపల్లి జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో దివ్యాంగులకు కేటాయించిన 19 బ్యాక్‌లాగ్ ఉద్యోగ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఖాళీల్లో ఆఫీస్ సబార్డినేట్ 8, వాచ్‌మెన్ 2, కుక్ 2, కామాటి 1, పబ్లిక్ హెల్త్ వర్కర్ 4, స్వీపర్ 1, తోటి 1 పోస్టులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇవి గ్రూప్-4 కేటగిరీకి చెందని ఉద్యోగాలని తెలిపారు. ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు ఏడో తరగతి, వాచ్‌మెన్ పోస్టులకు ఐదో తరగతి ఉత్తీర్ణత తప్పనిసరని, మిగతా పోస్టులకు చదవడం, రాయడం వచ్చి ఉండాలని సూచించారు. విద్యార్హతల్లో సాధించిన మార్కులు, వైకల్య శాతం, వయస్సు ఆధారంగా ఎంపిక ఉంటుందని వివరించారు. పూర్తి వివరాలు, దరఖాస్తు నమూనాలు జిల్లా అధికారిక వెబ్‌సైట్ peddapalli. telangana.gov.inలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హులు డిసెంబర్ 10,2026 సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు 9440852495 నంబర్‌లో సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

సగరుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించండి

- పిఏసి చైర్మన్ అరికెపూడికి తెలంగాణ రాష్ట్ర సగర సంఘం వినతి



శేరిలింగంపల్లి, నవంబర్ 24 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రం పరిధిలోని సగర కులస్తుల సంక్షేమంతోపాటు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర సగర సంఘం అభిప్రాయం పడింది. ఈ మేరకు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్, గ్రేటర్ హైదరాబాద్ సగర సంగం అధ్యక్షులు మోడల రవి సాగర్ రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీని ఆయన నివాసంలో కలిసి పలు సమస్యలను విన్నవిస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్ తో కలిసి అరికపూడి మాట్లాడుతూ సగరుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి తప్పకుండా ప్రభుత్వానికి నివేదిస్తానని, వాటి పరిష్కారం లభించేంతవరకు వారికి సంఫీభావాన్ని ప్రకటిస్తున్నానని అరికపూడి తెలిపారు. సగర ఫెడరేషన్ ను సగర కార్పొరేషన్ గా అభివృద్ధి చేయాలని, దానికి సత్వరమే పాలకమండలిని సైతం నియమించాలని శేఖర్ సాగర్ కోరగా తప్పకుండా ఆ దిశగా చర్యలు తీసుకుంటానని, అవసరమైతే రాష్ట్ర ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా సమావేశమై సమస్యను ఆయనకు వివరిస్తానని అరికపూడి వారికి హామీని ఇచ్చారు. సగరులను భవన నిర్మాణరంగ కార్మికులుగా గుర్తించి వారికి సంపూర్ణ ఆరోగ్య భద్రతకు సంబంధించిన నిర్దిష్టమైన కార్డులను ఏర్పాటు చేసి అందించాల్సిన అవసరం మరియు పెన్షన్ విధానాన్ని సైతం అమలులోకి తీసుకురావాలని సగరుల కోరిక మేరకు ఈ వినతినిసైతం ప్రభుత్వం ముందు ఉంచుతానని అరికెపూడి ధీమాను వ్యక్తంచేశారు. సగర కులస్తులను రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్ లో భాగంగా బిసి-డి నుండి బిసి – ఏ వర్గంలోకి మార్పు చేయాల్సిన అవసరం ఉందని, సగరులు చాలామంది నిరుపేద వర్గాలకు చెందిన వారిని సంఘం ప్రతినిధులు అరికెపూడి కి విన్నవించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కచ్చితంగా ప్రజాపాలనను కొనసాగిస్తుందని, ఇందులో భాగంగా ప్రతి ఒక్కరికి న్యాయం అందించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని అరికపూడి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి కానుగంటి శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకట్ రాములు, గ్రేటర్ యువజన సంఘం మాజీ అధ్యక్షులు ఎర్రంశెట్టి సీతారాం, శేరిలింగంపల్లి నియోజకవర్గ నగర సంగం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మంత్రి శరణ్ ప్రకాష్ పాటిల్ తో చీఫ్ విప్ డా. పట్నం మహేందర్ రెడ్డి భేటీ

- పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్న ఇరువురు నేతలు



తాండూరు, నవంబర్ 24 (జనంసాక్షి) : గాణగాపూర్ ప్రయాణంలో భాగంగా తెలంగాణ శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శరణ్ ప్రకాష్ పాటిల్ తో కలబురిగిలోని ఆయన స్వగృహంలో భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ఇరువురు నేతలు ఒకరినొకరు కుశల ప్రశ్నలతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. పలు జ్ఞాపకాలను పంచుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇద్దరం అటు కర్ణాటకలో, ఇటు తెలంగాణలో రవాణా శాఖ మంత్రులుగా ఉన్నప్పుడు సేడం, తాండూరు నియోజకవర్గాల పరిధిలో బస్సు సదుపాయం, రోడ్ల నిర్మాణం, కాగ్నా నీటి సరఫరా, రైతు సంక్షేమం తదితర అంశాలపై ఎన్నో అభివృద్ధి పనులు చేశామని గుర్తుచేసుకున్నారు.నేడూ, రేపూ ఇలా ఎల్లవేళలా పరస్పరం ప్రజా సంక్షేమం కోసం కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ భేటీలో టీపీసీసీ ప్రచార కమిటీ సమన్వయకర్త కరణం పురుషోత్తం రెడ్డి, బిర్కిట్ రఘు, బీదర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు కొండంత అండ

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా



బెజ్జంకి, నవంబర్ 24 (జనం సాక్షి) : నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని మంగళవారం బెజ్జంకి గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ప్రారంభించారు.గ్రామ సర్పంచ్ బొల్లం శ్రీధర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై పథకం ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పేద కుటుంబాలకు అండగా నిలవాలనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు.రేషన్ కార్డు కలిగిన అర్హులైన ప్రతి ఒక్కరూ తమ గ్రామపంచాయతీలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.భూమిలేని నిరుపేద కుటుంబాలకు సైతం ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు.18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు ఈ పథకానికి అర్హులని, అర్హులైన కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా ఆర్థిక భరోసా లభిస్తుందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బోనగాం రమేష్,లోనే నర్సింగరావు,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కత్తి రమేష్,అధికార ప్రతినిధి జెల్ల ప్రభాకర్,బండి వేణు,సంగ రమేష్,పంచాయతీ కార్యదర్శి ప్రణీత్,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సేవకే వన్నె తెచ్చిన శంకర్ యాదవ్‌కు సేవారత్న' అవార్డు

- ఘనంగా సన్మానించిన గీతా సత్సంగ్ సేవా సమితి



తాండూరు, నవంబర్ 24 (జనంసాక్షి) : సేవే పరమావధిగా భావించి, నిరంతరం ప్రజా సేవలో, ఆధ్యాత్మిక సేవలో ముందుండే గీతా భక్తులు, రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త బి. శంకర్ యాదవ్ కు ప్రతిష్టాత్మక 'సేవారత్న' అవార్డు లభించింది.ఈ శుభ సందర్భంగా గీతా సత్సంగ్ సేవా సమితి సభ్యులందరూ మర్యాదపూర్వకంగా ఆయనను కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సమితి సభ్యులు మాట్లాడుతూ హరి ఓం జై శ్రీరామ్. మన గీతా భక్తులు, పెద్దలు బి. శంకర్ యాదవ్ సేవారత్న అవార్డు రావడం మనందరికీ ఎంతో గర్వకారణం. ఆయన చేస్తున్న సేవలు, ధార్మిక కార్యక్రమాలకు చేస్తున్న కృషి నిజంగా అభినందనీయం. భగవద్గీత ప్రచారంలో, భక్తుల సేవలో ఆయన ఎల్లప్పుడూ ముందుంటారు. ఇలాంటి మరెన్నో గౌరవాలు ఆయనకు దక్కాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని అన్నారు.అనంతరం శంకర్ యాదవ్ మాట్లాడుతూ ఈ అవార్డు నాకు ఒక్కడికే కాదు, గీతా సత్సంగ్ సేవా సమితి సభ్యులందరికీ చెందుతుంది. మీ అందరి ప్రేమ, ఆశీర్వాదంతోనే ఈ గౌరవం దక్కింది. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో గీతా సత్సంగ్ సేవా సమితి సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యల పరిష్కారమే ఎన్ఎస్‌యుఐ లక్ష్యం

- జిల్లా ఎన్ ఎస్.యు.ఐ అధ్యక్షులు శ్రీకాంత్ నాయక్
- నియోజకవర్గ అధ్యక్షులు ప్రేమ్ కుమార్



తాండూరు, నవంబర్ 24 (జనంసాక్షి) : విద్యార్థుల సమస్యల పరిష్కారమే ఎన్ ఎస్.యు.ఐ లక్ష్యమని జిల్లా ఎన్ ఎస్.యు.ఐ అధ్యక్షులు శ్రీకాంత్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం తాండూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వికారాబాద్ జిల్లా ఎన్ ఎస్.యు.ఐ అధ్యక్షులు శ్రీకాంత్ నాయక్ , తాండూర్ ఎన్ ఎస్.యు.ఐ నియోజకవర్గ అధ్యక్షులు ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ మండలాల ఎన్ ఎస్.యు.ఐ నాయకులతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎన్ ఎస్.యు.ఐ ని తాండూర్ నియోజకవర్గంలో మరింత బలోపేతం చేయడం, విద్యార్థి విభాగాన్ని బలోపేతం చేయడం, కొత్త విద్యార్థులను ఎన్ ఎస్.యు.ఐ లోకి ఆహ్వానించడం, నాయకులు చురుకుగా ముందుకు రావడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.సమావేశంలో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలు. ప్రతి నెల రెండు సార్లు ఎన్ఎ స్. యు.ఐ సమావేశాలు నిర్వహించడం. ప్రతి మండలంలోని పాఠశాలలు, కళాశాలలు, హోస్టళ్ల వివరాలు సేకరించడం.మైనారిటీ పాఠశాలలు, విద్యాసంస్థలను కూడా గుర్తించడం.ప్రతి ఎన్ ఎస్.యు.ఐ నాయకుడు తమ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలను సందర్శించడం. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారం కోసం కృషి చేయడం. ప్రతి మండలంలో ఎన్ ఎస్.యు.ఐ కమిటీలను బలోపేతం చేసి కొత్త విద్యార్థులను సంఘంలో చేర్చుకోవడం. యాలాల, పెద్దేముల్ , తాండూర్, బషీరాబాద్ మండలంతో పాటు తాండూర్ పట్టణంలోని ప్రతి విద్యాసంస్థకు ఎన్ ఎస్.యు.ఐ నాయకులు వెళ్లి విద్యార్థుల సమస్యలను తెలుసుకోవాలని నిర్ణయించడం జరిగింది. సమావేశానికి ప్రతి మండలం నుంచి ఎన్ ఎస్.యు.ఐ నాయకులు స్వచ్ఛందంగా తరలివచ్చి పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉంది. అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు.ఈ సమావేశంలో ఎన్ ఎస్.యు.ఐ నాయకులు సంతోష్ కుమార్, ఆజాం, విజయ్,సైబాస్, సోయెల్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలతో నిండు ప్రాణాలు బలి

- ఎమ్మెల్యే మౌనం ఎందుకు
- వికారాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు యు. రమేష్ కుమార్ డిమాండ్



యాలాల, నవంబర్ 24 (జనం సాక్షి) : కాగ్నా నదిలో ఇష్టారాజ్యంగా సాగుతున్న ఇసుక అక్రమ తవ్వకాల వల్ల ఏర్పడిన లోతైన గుంతలే అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయని బీజేపీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు యు. రమేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. యాలాల మండలం విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన కిష్టప్ప (40) నదిలో పడి మృతి చెందడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మంగళవారం ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. గత ఎనిమిది నెలల్లోనే ఇసుక గుంతల వల్ల ముగ్గురు చనిపోయినా యంత్రాంగం స్పందించడం లేదని మండిపడ్డారు. తాండూరు ఇసుక సంపదను కొదంగల్‌కు తరలిస్తుంటే స్థానిక ఎమ్మెల్యే ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. కిష్టప్ప కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, బాధ్యులైన కాంట్రాక్టర్లు, అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బంటారం భద్రేశ్వర్, వెంకటేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జల్సాల కోస బోరు మోటార్ వైరు చోరీ

- బోరు మోటార్ వైరు చోరీ కేసును ఛేదించిన పుల్కల్ పోలీసులు
- రూ.15 వేల నగదు, కట్టింగ్ ప్లేయర్, వైరు స్వాధీనం



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 24 (జనం సాక్షి) : వ్యవసాయ బోరు మోటార్‌కు సంబంధించిన విద్యుత్ వైరు చోరీ కేసును పుల్కల్ పోలీసులు ఛేదించారు. ఈ ఘటనలో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.15 వేల నగదుతో పాటు చోరీకి ఉపయోగించిన కట్టింగ్ ప్లేయర్, మిగిలిన విద్యుత్ వైరును స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 18న చక్రియాల్ గ్రామానికి చెందిన రోళ్ళపాటి బేతాల్ తన వ్యవసాయ పొలంలోని బోరు మోటార్‌కు స్టార్టర్ నుంచి వెళ్లే విద్యుత్ వైరు చోరీకి గురైనట్లు పుల్కల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నవంబర్ 24న అనుమానితులను విచారించగా, శివ్వంపేట గ్రామానికి చెందిన కుమ్మరి శివకుమార్ (23), దూదేకుల సమీర్ (19) ఈ చోరీకి పాల్పడినట్లు వెల్లడైంది. ఇద్దరూ కలిసి చక్రియాల్ గ్రామంలోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి, ఒకరు కాపలాగా ఉండగా మరొకరు కట్టింగ్ ప్లేయర్‌తో బోరు మోటార్ విద్యుత్ వైరును కత్తిరించి చోరీ చేశారు. అనంతరం వైరును ఇద్దరూ పంచుకొని, జల్సాలకు ఖర్చు చేశారు. చోరీ చేసిన వైరులో తన వాటాకు వచ్చిన భాగాన్ని ఒక నిందితుడు పాత సామాన్ల వ్యాపారికి విక్రయించగా రూ.16 వేల నగదు వచ్చింది. అందులో ఖర్చు చేసిన రూ.వెయ్యి మినహా మిగిలిన రూ.15 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చోరీకి ఉపయోగించిన కట్టింగ్ ప్లేయర్, మిగిలిన వైరును కూడా స్వాధీనం చేసుకున్నారు.నిందితులిద్దరినీ అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. వ్యవసాయ పొలాలు, బోరు మోటార్లు, విద్యుత్ పరికరాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

మర్రిముచ్చాలలో బ్రిడ్జి వద్ద తాత్కాలిక మరమ్మతులు



కొమురవెల్లి, నవంబర్ 24 (జనంసాక్షి) : గ్రామ పరిధిలోని ఎన్ హెచ్-365బి జాతీయ రహదారిపై బ్రిడ్జి వద్ద రహదారి ప్రమాదకరంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాలు జరిగే అవకాశం ఉండటంతో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎన్ ఆర్ ఎం హెల్పింగ్ హ్యాండ్స్ సహకారంతో గ్రామ సర్పంచ్ జంగని రవి ఆధ్వర్యంలో మంగళవారం బ్రిడ్జి వద్ద తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టారు. ప్రజలకు, వాహనదారులకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ పనులు చేపట్టడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సహకారం అందించిన ఎన్ ఆర్ ఎం హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులకు గ్రామ ప్రజల తరఫున సర్పంచ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

గుండారెడ్డిపల్లి లో ఘనంగా సిద్ధప్ప వరకవి గురుపూజోత్సవం



కోహెడ, నవంబర్ 24 (జనంసాక్షి) : మండలంలోని గుండారెడ్డిపల్లి గ్రామంలోని సిద్ధప్ప వరకవి ఆశ్రమంలో మంగళవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా సిద్ధప్ప వరకవి ట్రస్ట్ చైర్మన్ అనంతవరం మాణిక్యలింగం ఆధ్వర్యంలో గురుపూజోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముందుగా సిద్ధప్ప వరకవి చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం తులసి పూజ, భజనలు చేశారు. అలాగే గాయత్రి యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధప్ప శిష్యులు మాట్లాడుతూ గోల్కొండ కవిగా, తెలంగాణ వేమనగా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు. ఆశ్రమానికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయడం పట్ల భక్తుల సంతోషం వ్యక్తం చేశారు. వందలాదిగా తరలివచ్చిన భక్తులకు ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో సిద్ధప్ప వరకవి విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు తరిగొప్పుల రామచంద్రం తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి బాబు, మాజీ సర్పంచ్ సుతారి కనకయ్య, కాంగ్రెస్ నాయకులు భూంపల్లి సంజీవరెడ్డి, సిద్ధప్ప వరకవి కుటుంబ సభ్యులు, భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా బుగ్గ రామలింగేశ్వరాలయం

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- రూ.2కోట్ల వరకు నిధులతో అభివృద్ధి
- రెండేళ్లలో ఆలయ పరిసరాల్లో మరిన్ని వసతులు
- రూ.25 లక్షలతో నిర్మించిన వసతి గృహం ప్రారంభం
- అధికారులతో కలిసి ఏర్పాట్ల పరిశీలన



రంగారెడ్డి, నవంబర్ 24 (జనంసాక్షి) : ఎంతో విశిష్టత గల ఆరుట్ల బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయాన్ని గొప్ప ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగళవారం ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాట్లను పరిశీలించారు. జాతరకు ఘనంగా ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీ, అధికార యంత్రాంగాన్ని ఎమ్మెల్యే అభినందించారు. ఆలయ పరిసరాల్లో రూ.25లక్షలతో నిర్మించిన వసతి గృహాన్ని ప్రారంభించారు. అనంతరం, జాతరలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని సందర్శించారు. భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, ఇతర అధికారులను ఆరాతీస్తూ.. భద్రత విషయంలో పోలీసులు ప్రత్యేక జాగ్రత్తలు వహించాలని సూచించారు. తాగునీరు, విద్యుత్, రవాణా, పారిశుద్ధ్యం విషయంలో ఆయాశాఖల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. తూర్పు నుంచి పడమటికి నీరు ప్రవహించటం, శ్రీరాముడే అభిషేకం చేసినట్లు భక్తుల విశ్వసించే ఈ ఆలయానికి ఎంతో విశిష్టత ఉందన్నారు. రానున్న రోజుల్లో మరింత గొప్పగా వర్ధిల్లేలా కృషి చేస్తామని చెప్పారు. గత రెండేళ్లలో రెండు కోట్ల వరకు నిధులతో రోడ్లు, నీటి సౌకర్యం, విద్యుత్, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. గతంలో నిరాదరణకు గురైన ఈ ఆలయ విశిష్టత చరిత్రలో నిలిచేలా దృష్టిసారిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శోభకుమార్, ఆర్డీవో శ్రీనివాసరెడ్డి, మంచాల సొసైటీ చైర్మన్ హనుమంత్ రెడ్డి, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ యాదయ్య తదితరులున్నారు.

ఎల్లమ్మ గుడి అభివృద్ధికి రూ.2 లక్షల విరాళం

- దాత కుటుంబాన్ని ఘనంగా సత్కరించిన గౌడ సంఘం పెద్దలు



కొల్చారం, నవంబర్ 24 (జనం సాక్షి) : కొల్చారం మండలం చిన్న ఘనపూర్ గ్రామంలోని ఎల్లమ్మ గుడి అభివృద్ధికి గ్రామానికి చెందిన చందాపురం నవీన్ రెడ్డి రూ.2 లక్షల భారీ విరాళాన్ని అందజేశారు. ఆలయ అభివృద్ధికి ఉదారంగా విరాళం అందించిన నవీన్ రెడ్డి సేవలను గుర్తిస్తూ సోమవారం గౌడ సంఘం పెద్దలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా నవీన్ రెడ్డి తండ్రి చందాపురం రామ్ రెడ్డి దంపతులతో పాటు, ఆయన సోదరుడు, గ్రామ సర్పంచ్ చందాపురం మధుసూదన్ రెడ్డి దంపతులను గౌడ సంఘం పెద్దలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. గ్రామంలోని ఆలయ అభివృద్ధికి ముందుకొచ్చి రూ.2 లక్షల విరాళం అందించడం అభినందనీయమని వారు కొనియాడారు. ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
25 నవంబర్ 2026



పౌల్ట్రీలో తెలంగాణ నెం.1 లక్ష్యం

- పరిశ్రమకు ప్రభుత్వ సంపూర్ణ సహకారం
- సింగిల్ విండోలో వేగంగా అనుమతులు
- మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలి: మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో పౌల్ట్రీలో నెం.1గా నిలపడమే లక్ష్యంగా పని చేస్తున్నామని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో నిర్వహించిన 18వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో-2026 నాలెడ్జ్ డే కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశ, విదేశాల నుంచి వచ్చిన పౌల్ట్రీ రంగ పారిశ్రామికవేత్తలకు, నిపుణులకు తెలంగాణ ప్రభుత్వం తరఫున స్వాగతం పలికారు. తెలంగాణలో పౌల్ట్రీ పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానంలో యుద్ధప్రాతిపదికన మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా పౌల్ట్రీ రంగంలో మహిళలకు అవకాశాలు కల్పించాలని పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. మహిళలు ఇతరులపై ఆధారపడే స్థాయి నుంచి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. పౌల్ట్రీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తామని తెలిపారు. సంబంధిత శాఖల కార్యదర్శులు, పౌల్ట్రీ రంగ ప్రతినిధులతో సమావేశం నిర్వహించి, ప్రభుత్వ పరిధిలోని సమస్యలను వారం రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం పౌల్ట్రీ రంగంలో దేశంలో రెండో స్థానంలో ఉన్న తెలంగాణను రాబోయే రోజుల్లో మొదటి స్థానంలో నిలపాలన్నదే తన ఆకాంక్ష అని మంత్రి పేర్కొన్నారు. వచ్చే పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో నాటికి తెలంగాణ అగ్రస్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. తనకు కూడా పౌల్ట్రీ రైతుగా మారాలనే ఆకాంక్ష ఎన్నో సంవత్సరాలుగా ఉందని మంత్రి తెలిపారు. ఈ వేదికగా అమ్యుత్ రామ్‌ను పౌల్ట్రీ రంగంలోకి ప్రోత్సహిస్తున్నట్లు ప్రకటించారు. పౌల్ట్రీ రంగ ప్రముఖులు ఆయనకు అవసరమైన మార్గదర్శకత్వం, సహకారం అందించాలని కోరారు. పౌల్ట్రీ పరిశ్రమ అంతగా విస్తరించని ప్రాంతాల్లో మహిళలను సంఘటితం చేసి, వారికి ఉపాధి, ఆదాయ అవకాశాలు కల్పించే దిశగా కృషి చేయాలని సూచించారు.

మెడికోల నిరసన విరమణ

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం హామీ

- మార్చి 2027 నాటికి వైద్య కళాశాల భవనం పూర్తి
- నవంబర్ నెలాఖరులో బాలికల హాస్టల్.. డిసెంబర్‌లో బాలుర హాస్టల్ అందుబాటులోకి
- బుధవారం నుంచి తరగతులకు హాజరవుతామని విద్యార్థుల వెల్లడి



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 24 (జనంసాక్షి) : కొత్తపల్లి ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు తమ శాంతియుత నిరసనను విరమించారు. మూడు రోజులుగా హాస్టల్ వసతి, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన చేపట్టిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లభించింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో మంగళవారం నిరసనకు ముగింపు పలికారు. బుధవారం నుంచి యథావిధిగా తరగతులకు హాజరవుతామని విద్యార్థులు ప్రకటించారు. విద్యార్థుల్లో భరోసా కల్పించేందుకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తఖీయుద్దీన్ ఖాన్, కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ మంగళవారం కళాశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి, సమస్యలు పరిష్కారమవుతాయని భరోసా ఇచ్చారు. కళాశాలలో రెండో, మూడో, నాలుగో సంవత్సరం చదువుతున్న సుమారు 300 మంది విద్యార్థులు తమ సమస్యలను ప్రిన్సిపాల్, జిల్లా కలెక్టర్, వైద్య విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయం మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి చేరడంతో ఆయన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో చర్చించారు. దీంతో సోమవారం ఇద్దరు మంత్రులు ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, ఆర్‌అండ్‌బీ, వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా నవంబర్ నెలాఖరులోగా బాలికల హాస్టల్, డిసెంబర్‌లోగా బాలుర హాస్టల్ నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వైద్య కళాశాల ప్రధాన భవన నిర్మాణాన్ని మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. నిర్మాణ పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని, తాత్కాలిక కళాశాలలోని సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సూచించారు.

విద్యార్థుల ఫలితాలు అభినందనీయం

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యల పరిష్కారంపై మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ కూడా కళాశాల అభివృద్ధికి చొరవ చూపుతున్నారని పేర్కొన్నారు. తాత్కాలిక కళాశాలలోనూ అవసరమైన వసతులు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్ తఖీయుద్దీన్ ఖాన్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆందోళన చెందవద్దని, హాస్టళ్ల వసతి, కళాశాల భవన నిర్మాణం, తాత్కాలిక కళాశాలలోని సమస్యల పరిష్కారానికి మంత్రులు ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు శాంతియుతంగా నిరసన తెలిపి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో విజయం సాధించారని పేర్కొన్నారు. ఏవైనా సమస్యలుంటే ప్రిన్సిపాల్, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో కొత్తపల్లి సీఐ కోటేశ్వర్, తహసీల్దార్ లక్ష్మి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం

- సైబరాబాద్ మూవ్స్ - 2026 కార్యక్రమంలో ప్రజలకు పిలుపునిచ్చిన సైబరాబాద్ సీపీ



శేరిలింగంపల్లి, నవంబర్ 24 (జనంసాక్షి) : రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టే దిశగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వినూత్న కార్యక్రమానికి తెరతీసింది. కొన్ని రోజులుగా 'సైబరాబాద్ మూవ్స్ - 2026' పేరుతో ట్రాఫిక్ నియంత్రణ, అవగాహనపై సైబరాబాద్ ప్రజలకు అనేక అవగాహన కార్యక్రమాలను చేపడుతూ కొత్తగా ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయం ఆవరణలో పోలీస్ పాస్ డాక్టర్ ఎం. రమేష్ మరో మారు ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా 'సైబరాబాద్ మూవ్స్ - 2026' కి సంబంధించి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పోలీస్ బాస్ రమేష్ మాట్లాడుతూ ' సైబరాబాద్ మూవ్స్ - 2026 కోసం ఆన్లైన్ నమోదు కార్యక్రమం ఈనెల 26, 27, 28వ తేదీలలో కొనసాగనుందన్నారు. రాయదుర్గం పరిధి టీ-హబ్ లో అధికారిక వెబ్సైట్ ద్వారా ఔత్సాహికులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా పాల్గొనాలని సూచించారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని పకడ్బందీగా చేదించడంతోపాటు భవిష్యత్తులో ఇది ఒక సమస్యగా మారకుండా ఉండేలా పలు విప్లవాత్మక అడుగులను వేయాల్సిన అవసరం ఉందని, ఎందుకోసం యువత, మేధావులు, విద్యార్థులు, విద్యాసంస్థలు, ఇతర ప్రజా సంబంధ వర్గాలు కలిసి ముందుకు సాగాల్సిన అవసరాన్ని సిపి ఎత్తిచూపారు. 'హాయ్ బోలో... దిల్ ఖోలో... నో సోలో... సాథ్ చలో...!' అన్నది తమ ప్రధాన నినాదంగా పేర్కొంటూ ఇందులో భాగంగా ఒక్కరే వాహనంపై మరియు వాహనంలో రావద్దని, సాధ్యమైనంతవరకు కార్ పూలింగ్/షేర్డ్ మొబిలిటీ విధానాన్ని అనుసరించాలని సిపి సూచించారు. మెట్రో, ఎంఎంటిఎస్, ఆర్టీసీ బస్సులను రవాణా కోసం ఉపయోగించాలని తద్వారా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వాహనాల సాంద్రత గణనీయంగా తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ద్విచక్ర వాహనాలు, బైక్ లపై వచ్చేవారు తప్పకుండా మరొకరిని తీసుకొని వస్తే బాగుంటుందని, 5 సీట్ల సామర్థ్యం కలిగిన కారులో కనీసం ఇద్దరినుండి ముగ్గురు కలిసి వచ్చేలా ప్రణాళికను సిద్ధం చేసుకుంటే ఉత్తమమని కోరారు. పిల్లలను స్కూల్ కు దింపడానికి కార్లలో పదే పదే తిరగవద్దని, సైకిల్ వచ్చేవారికి ప్రత్యేక లేన్ ను కేటాయించడం ద్వారా ప్రతి వాహనదారుడు సురక్షిత ప్రయాణం చేయడానికి ఆస్కారం లభిస్తుందన్నారు. జేఎన్టీయూ నుండి ఐకియా ఐటీ కారిడార్ పరిధిలో ఒకే సమయంలో సుమారు 65 శాతం మంది రాకపోకలు సాగిస్తుండడంతో ఆయా మార్గాలలో తీవ్ర రద్దీ నెలకొని ఉంటుందని, తద్వారా అనేక ప్రదేశాలలో ట్రాఫిక్ జామ్ అవుతుందని సిపి వివరించారు. ఉదయం, సాయంత్రం రద్దీ వేళలలో సొంత వాహనాలకు బదులు ఆర్టీసీతో అనుసంధానం చేసుకుంటే ఎక్కువ బస్సులను రవాణాకు వినియోగించడానికి అవకాశం ఉంటుందని, ఫీనిక్స్, ఇన్ఫోసిస్ కార్ సంస్థలు కార్ పూలింగ్ ను ప్రోత్సహించేందుకు ముందుకు వచ్చాయని, ఇది శుభ పరిణామంగా సిపి అభివర్ణించారు. సైబరాబాద్ మూవ్స్ - 2026 తో అనుసంధానం చేసుకున్న సిఎంసి, ఆర్టీసీ, హెచ్ఎంఆర్ఎల్, హెచ్ఎండిఏ సంస్థలు తమ ఉద్యోగుల, ప్రజల ప్రయాణ సౌకర్యం నిమిత్తం తగిన సూచనలతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని కమిషనర్ ఎత్తిచూపారు. ట్రాఫిక్ నియంత్రణ పై మరింత అవగాహన అవసరమని, ఇందుకోసం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, ఆసుపత్రులు, వ్యాపార సంస్థలతోపాటు ప్రజా రవాణా విభాగాలను గుర్తించి వాటిలో వర్క్ షాప్ లను నిర్వహిస్తూ అవగాహన కల్పించడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని చేరడానికి సైబరాబాద్ మూవ్స్ - 2026 సరికొత్త పంథాలో ముందుకు సాగనుందని సిపి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం జాయింట్ సిపి సన్ ప్రీత్ సింగ్, వివిధ జోన్ల డిసిపి లు, అడిషనల్ డిసిపి లు, ఇతర పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ మెమోరియల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా నామకరణం

పేరు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



వరంగల్ బ్యూరో నవంబర్ 24 (జనం సాక్షి) : వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి మహాత్మా గాంధీ మెమోరియల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, వరంగల్ గా పేరు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.ఈ మేరకు రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ జీఓ ఎంఎస్ నంబర్ 180, తేదీ 23-11-2026 ద్వారా ఉత్తర్వులు వెలువరించింది.గతంలో వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి స్థాపన, నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం జీఓలు జారీ చేసింది.తాజాగా ఈ అంశాన్ని పరిశీలించిన ప్రభుత్వం వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి మహాత్మా గాంధీ మెమోరియల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా నామకరణం చేయాలని నిర్ణయించింది.ఈ మేరకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వైద్య విద్యా సంచాలకులు, హైదరాబాద్‌తో పాటు వరంగల్ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌ను ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తరఫున ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తు ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

పుస్తక పఠనాసక్తిని పెంపొందించడంలో జర్నలిస్టులు, రచయితల పాత్ర కీలకం

- యువతలో పఠనాసక్తి పెంచేలా మరిన్ని మంచి రచనలు రావాలి: జ్యోత్స్న



హైదరాబాద్ (కొండాపూర్), నవంబర్ 24: గుంటూరు మాజీ ఎమ్మెల్యే దివంగత కనపర్తి నాగయ్య కుమార్తె, ప్రముఖ సీనియర్ జర్నలిస్టు, విశాలాంధ్ర సంపాదకులుగా విశేష సేవలందించిన దివంగత సీ. రాఘవాచారి సతీమణి జ్యోత్స్నను మంగళవారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ గవర్నింగ్ కౌన్సిల్ మాజీ సభ్యులు, సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావుతో కలిసి యాత్రలోకం ట్రావెల్ మ్యాగజైన్ సంపాదకుడు టీ. అనిల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యాత్రలోకం ట్రావెల్ మ్యాగజైన్ తాజా సంచికను జ్యోత్స్నకు అందజేశారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఉన్న సీఆర్ ఫౌండేషన్‌లోని నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్ (లైబ్రరీ) ఇన్‌చార్జిగా జ్యోత్స్న బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా యాత్రలోకం మ్యాగజైన్‌ను ఆమెకు పరిచయం చేసిన సంపాదకుడు అనిల్ కుమార్, ఆంధ్రప్రదేశ్ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి అందాలు, సంస్కృతి, సంప్రదాయాలను తెలుగు పాఠకులకు పరిచయం చేయడమే మ్యాగజైన్ ప్రధాన లక్ష్యమని వివరించారు. అనంతరం అనిల్ కుమార్ మాట్లాడుతూ, నీలం రాజశేఖరరెడ్డి రీసెర్చ్ సెంటర్ లైబ్రరీకి ప్రతినెలా యాత్రలోకం ట్రావెల్ మ్యాగజైన్‌ను ఉచితంగా పంపించనున్నట్లు తెలిపారు. పుస్తకాలు, పత్రికలు పాఠకులకు నిరంతరం అందుబాటులో ఉండటం ద్వారా విజ్ఞానాన్ని, పఠనాసక్తిని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రంథాలయాల ద్వారా మంచి పుస్తకాలు, విలువైన సమాచారాన్ని యువతకు చేరువ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ, ఒకప్పుడు యువతలో పుస్తక పఠనంపై ఎంతో ఆసక్తి ఉండేదని, అయితే ప్రస్తుత కాలంలో మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం, డిజిటల్ మాధ్యమాల ప్రభావంతో పుస్తక పఠనాసక్తి క్రమంగా తగ్గుతోందని అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ ఎంతోమంది జర్నలిస్టులు, రచయితలు తమ రచనలు, కథనాల ద్వారా పాఠకుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. పుస్తక పఠనం వ్యక్తి ఆలోచనా విధానాన్ని విస్తృతం చేయడంతో పాటు సమాజం, చరిత్ర, సంస్కృతి, వివిధ రంగాలపై అవగాహనను పెంచుతుందని పేర్కొన్నారు. యువతలో తిరిగి పుస్తకాలు చదివే అలవాటును పెంపొందించేందుకు రచయితలు, జర్నలిస్టులు మరిన్ని మంచి రచనలు చేయాలని ఆకాంక్షించారు. నాణ్యమైన సమాచారాన్ని అందించే పత్రికలు, మ్యాగజైన్లు గ్రంథాలయాలకు చేరడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ జర్నలిస్ట్ నిమ్మరాజు చలపతిరావు, జ్యోత్స్నతో కలిసి దివంగత సీ. రాఘవాచారితో తమకున్న సుదీర్ఘ అనుబంధాన్ని, వృత్తిపరమైన అనుభవాలను, ఆనాటి జర్నలిజం రంగంలోని మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. రాఘవాచారి విలువలు, పాత్రికేయ రంగానికి ఆయన అందించిన సేవలు, సమాజం పట్ల ఆయనకున్న నిబద్ధత వంటి అంశాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు.

సింగూర్‌లో నీళ్లున్నా సంగారెడ్డికి కష్టాలు

ముందు మా దాహం తీర్చండి.. ఆ తర్వాతే హైదరాబాద్‌కు నీళ్లు ఇవ్వండి

- బీరు కంపెనీలకు నీటి సరఫరాపై ఉన్న శ్రద్ధ ప్రజలపై ఏదీ?
- ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే తాగునీటి సంక్షోభం
- ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఆగ్రహం



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 24 (జనం సాక్షి): సంగారెడ్డి నియోజకవర్గ ప్రజల తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి మంజీరా డ్యామ్‌ను సందర్శించారు. హైదరాబాద్‌కు నీటి సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీని గుర్తించిన ఆయన వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంగారెడ్డి ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతుంటే హైదరాబాద్‌కు నీటి సరఫరాపై ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధ ఏమిటని ప్రశ్నించారు. ముందుగా సొంత జిల్లా ప్రజల దాహం తీర్చిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయని ముందస్తు హెచ్చరికలు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం తగిన ప్రణాళిక రూపొందించలేదని విమర్శించారు. సింగూర్ ప్రాజెక్టు మరమ్మతుల పేరుతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు లేకుండానే నీటిని వదిలేయడం ప్రభుత్వ ముందుచూపు లేమికి నిదర్శనమన్నారు. ప్రస్తుతం సింగూర్ జలాశయంలో సుమారు 1.9 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, ఈ నిల్వలు డిసెంబర్ వరకు మాత్రమే సరిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు మున్సిపాలిటీలు, నాలుగు మండలాల ప్రజలకు వారానికి ఒక్కసారి కూడా సక్రమంగా తాగునీరు అందడం లేదని, మరోవైపు బీరు కంపెనీలకు నీటి సరఫరా కొనసాగడం ఏమిటని నిలదీశారు. కంపెనీల అవసరాల కంటే ప్రజల తాగునీటి అవసరాలకే ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న సుమారు 50 ఎంఎల్డీ నీరు నిలిచిపోతే నియోజకవర్గంలో తీవ్ర సంక్షోభం ఏర్పడుతుందని హెచ్చరించారు. మంజీరా నదిలో అక్రమంగా బోర్లు వేసి నీటిని తోడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అక్రమ నీటి వినియోగాన్ని అరికట్టాలని, సింగూర్, మంజీరా జలాశయాల్లో పూడికతీత పనులు చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. తాగునీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి, స్థానిక ప్రజల అవసరాలు తీరిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటి సరఫరాపై నిర్ణయం తీసుకోవాలన్నారు. జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రి, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించాలని కోరారు. ప్రజల గొంతు ఎండిపోతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవడం సరికాదని, తాగునీటి సమస్య పరిష్కరించకపోతే ప్రజలను సమీకరించి వాటర్‌వార్‌కు కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు. ప్రజల తాగునీటి హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ కొండల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు చక్రపాణి, కౌన్సిలర్లు కొత్తపల్లి శ్రీకాంత్, జాఫర్, లాడే మల్లేశం, నాయకులు జీవీ శ్రీనివాస్, కసిని శ్రీకాంత్, విఠల్, మోహన్ సింగ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370